www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఆదివారం | 11-1-2026 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 306 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, పుష్యమాసం, బహుళపక్షం, తిథి: అష్టమి ఉ.10:20 తదుపరి నవమి, నక్షత్రం: చిత్ర రా.6:12 తదుపరి స్వాతి, వర్జ్యం: రా.12:28-2:15, దుర్ముహూర్తం: సా.4:25-5:10, అమృతఘడియలు: ఉ.11:07-12:53, రాహుకాలం: సా.4:30-6:00, సూర్యోదయం: 6:51, సూర్యాస్తమయం: 5:54 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

అమరావతిపై అవే కుట్రలు!



మన దేశంలో రాజధాని లేని రాష్ట్రం ఏదైనా ఉందా? ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఉత్తరాఖండ్ వంటి కొత్తగా ఏర్పడిన రాష్ట్రాలకు కూడా రాజధానులు ఉన్నాయి కదా? ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే రాజధాని అవసరం లేదని జగన్ రెడ్డి ఎందుకు భావిస్తున్నారో తెలియదు.

ఇప్పుడు జగన్ రెడ్డి ఆంతర్యం బయటపడింది కనుక అమరావతి ఆయువు అర్ధాంతరంగా ముగియకూడదంటే... కూటమి ప్రభుత్వంపై గురుతర బాధ్యత ఉంది. ఒట్టి మాటలు కట్టిపెట్టి గట్టి మేలు తలపెట్టవోయ్ అన్న గురజాడ మాటలను గుర్తుకు తెచ్చుకొని కూటమి ప్రభుత్వం అమరావతిలో నిర్మాణాల వేగాన్ని పెంచాలి. వీలైనంత త్వరగా రాజధానిలో పౌర సౌకర్యాలు కల్పించడంతో పాటు నిర్మాణాలను పూర్తి చేయాలి.

ఇప్పుడు హైదరాబాద్ అసలు సిసలైన కాస్మోపాలిటన్ నగరం. ఈ కారణంగానే హైదరాబాద్‌లో మత కలహాలు కూడా మటుమాయమయ్యాయి. హైదరాబాద్‌కు ఇప్పుడు ఉన్న విశిష్టత దక్షిణాదిన మరే నగరానికీ లేదు. అంతా సవ్యంగా సాగితే అమరావతి కూడా హైదరాబాద్ అంత కాకపోయినా ఒక పెద్ద నగరంగా అభివృద్ధి చెందుతుంది. బయటి ప్రాంతాల వారి సంఖ్య పెరిగే కొద్దీ స్థానికుల ఆధిపత్యం పోతుంది. జగన్ రెడ్డి ద్వేషించే ఆ కులం వారి ఆధిపత్యం కూడా పోతుంది.

బహిరంగంగా చెప్పుకోలేని కారణాలతో జగన్ రెడ్డి అంతర్గతంగా దహించుకుపోతున్నారు. అందుకే రాష్ట్ర శాశ్వత రాజధానిగా అమరావతిని ప్రకటించకుండా అడ్డుకొనే ప్రయత్నాలకు తెర లేపారు. అందులో భాగంగానే రివర్ బేసిన్ అనే వాదాన్ని తెరమీదకు తెచ్చారు. తమాషా ఏమిటంటే, రాజధాని అమరావతిపై జగన్ రెడ్డి నోటి వెంట వెలువడిన విష గుళికలు ఆయన సొంత మీడియాలో ఎక్కడా కనిపించలేదు. వింతల్లోకెల్లా వింత ఇది.

కొత్త పలుకు ఆర్కే విశ్లేషణ 4లో..

జగన్‌ది విద్వేషమే

ప్రజలు బుద్ధి చెప్పినా ఆయన ఆపడం లేదు

- నదీ తీరానికి, పరీవాహక ప్రాంతానికీ తేడా తెలీదు.. నాగరికతపై అవగాహన లేదు
- నదుల వెంట ఉన్న నగరాలన్నీ అభివృద్ధి
- లండన్, మాస్కో, ఢిల్లీ, కోల్‌కతా ఇలాంటివే
- తిరుమల పవిత్రత దెబ్బతీసేలా వైసీపీ కుట్రలు
- ఈ విషయంలో కఠినంగా వ్యవహరిస్తాం
- పార్టీ నేతలతో చంద్రబాబు కీలక వ్యాఖ్యలు
- తెలుగు రాష్ట్రాలు పరస్పరం సహకరించుకోవాలి
- మిగులు జలాలతో నల్లమలసాగర్ పూర్తయితే శ్రీశైలం, సాగర్‌లో నీటి లభ్యత పెరుగుతుంది
- అవసరమైతే తెలంగాణ కూడా వాడుకోవచ్చు
- గొడవలకు పోతే నష్టపోయేది తెలుగు ప్రజలే
- టీడీపీ కార్యాలయంలో మీడియాతో ఇష్టాగోష్ఠి



మంగళగిరి టీడీపీ ప్రధాన కార్యాలయంలో శనివారం ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న సీఎం చంద్రబాబు

అమరావతి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): 'జగన్‌కు నాగరికతపై అవగాహన లేదు. నదీ తీరానికి.. నదీ పరీవాహక ప్రాంతానికీ తేడా తెలియని వ్యక్తి. అలాంటి వ్యక్తి రాజధానిపై అర్థం పర్థం లేని విమర్శలు చేస్తున్నారు' అంటూ సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. సింధు నాగరికత ఎలా అభివృద్ధి చెందిందో తెలుసుకుంటే జగన్ అమరావతిపై అడ్డగోలుగా మాట్లాడరని అన్నారు. నదులు ఎక్కడ ఉంటే అక్కడ నాగరికత అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయానికి వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. అనంతరం పార్టీ ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వైసీపీ అధినేత జగన్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచంలో గానీ దేశంలో గానీ నదుల వెంబడి ఉన్న నగరాలన్నీ అద్భుతమైన అభివృద్ధిని సాధించాయని

మిగతా 12వ పేజీలో...

ఉల్టా.. పల్టా!



అమరావతిపై వైసీపీ తికమక



- ఇక్కడ కట్టొద్దంటూ జగన్ హూంకరింపు
- రివర్ బేసిన్ పేరుతో బెదిరింపు
- 48 గంటల్లోనే తెరపైకి వచ్చిన సజ్జల
- 'స్వాగతిస్తున్నాం' అని ప్రకటన
- రివర్ బేసిన్ మాటెత్తని వైనం
- అమరావతి రైతులపై 'ప్రేమ'
- ఖర్చు, అవినీతి అంటూ పాతకథలు

13

నెలకో రోజు గ్రామాలకు వైద్యులు!



రాంకోసా అధ్యక్షుడు డా.ఆనంద్ బహూకరించిన వెంకటేశ్వరస్వామి ప్రతిమతో పవన్. పక్కన ఎమ్మెల్యేలు కామినేని, నానాజీ, కొండబాబు, ఎమ్మెల్సీ పద్మశ్రీ

- పల్లెలు, గిరిజన ప్రాంతాల్లో స్పెషలిస్టుల కొరత
- నెలలో ఒకసారి అక్కడికి వెళ్లి సేవలందించాలి
- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచన
- కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో నూతన భవనాల నిర్మాణానికి శంకుస్థాపన
- అరకులో సికిల్‌సెల్, ఎనీమియా బాధితుల కోసం బ్లడ్ బ్యాంక్ భవనం నిర్మిస్తున్నట్లు వెల్లడి

12



జేడీ లక్ష్మీనారాయణ భార్యకు సైబర్ నేరగాళ్ల టోకరా

- పెట్టుబడి చిట్కాల పేరుతో 2.58 కోట్లు దోపిడీ
- చెప్పినట్టు చేస్తే 500 రెట్లు లాభం అంటూ ఎర
- పసిడి తాకట్టుపెట్టి డబ్బిచ్చిన రిటైర్డ్ ఐపీఎస్ భార్య
- హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు

11

ఖమేనీ చిత్రాలు తగులబెట్టి సిగరెట్లు వెలిగించి

- ఇరాన్‌లో ప్రజా తిరుగుబాటు తీవ్రతరం
- ఉద్యమాన్ని ముందుండి నడిపిస్తున్న మహిళలు
- దేశం మొత్తం పాకిన ఖమేనీ వ్యతిరేక ఉద్యమం
- నగరాలు ఆక్రమించాలని యువరాజు రెజా పిలుపు
- టెహ్రాన్ కాల్పుల్లో 200 మంది మృతి.. డాక్టర్ ట్వీట్

2

బంగ్లాలో మరో హిందూ యువకుడి హత్య

- సునామ్‌గంజ్ జిల్లా భంగాడోహోర్‌లో ఘటన
- హిందువులపై నెల రోజుల్లో 50కి పైగా దాడులు

2

హెచ్-1బీ వీసా ప్రీమియం ఫీజుల పెంపు

న్యూఢిల్లీ, జనవరి 10: హెచ్-1బీ సహా పలు వీసాల ప్రీమియం ప్రాసెసింగ్ ఫీజులను అమెరికా పెంచింది. మార్చి 1 నుంచి పెరిగిన రుసుములు అమల్లోకి వస్తాయని అమెరికా పౌరసత్వ, వలస సేవల విభాగం (యూఎస్‌సీఐఎస్) ప్రకటించింది. 2023 జూన్ నుంచి 2025 జూన్ వరకూ ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకొని ఈ ఫీజులను పెంచుతున్నట్లు పేర్కొంది. ఈ పెంపుతో అమెరికాలో చదువుతున్న, ఉద్యోగం చేస్తున్న భారతీయులపై ప్రత్యక్షంగా ప్రభావం పడనుంది. సవరించిన ఫీజుల ప్రకారం... హెచ్-2బీ, ఆర్-1 నాన్-ఇమిగ్రెంట్ హోదా కోసం దాఖలు చేసే ఐ-129 దరఖాస్తుల ప్రీమియం ప్రాసెసింగ్ ఫీజు 1,685 డాలర్ల నుంచి రూ.1,780 డాలర్లకు పెరగనుంది. హెచ్-1బీ, ఎల్-1, ఓ-1, పీ-1, టీఎన్ వీసాలకు సంబంధించి ఐ-129 ఫాం ఫీజులు 2,805 డాలర్ల నుంచి 2,965 డాలర్లకు పెరుగుతాయి. విదేశీ కార్మికుల కోసం దాఖలు చేసే ఐ-140 ఫాంకు కూడా ఈ మొత్తమే వర్తించనుంది. ఎఫ్-1, ఎఫ్-2, జే-1, జే-2, ఎం-1, ఎం-2 వీసాలకు ఇచ్చే ఐ-539 ఫాం రుసుము 1,965 డాలర్ల నుంచి 2,075 డాలర్లకు పెంచారు. త్వరితగతిన ఉపాధి అనుమతి కోరే వారితో పాటు, ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ), స్టెమ్-ఓపీటీ దరఖాస్తుదారులకు ఇచ్చే ఐ-765 ఫాంల ప్రీమియం ప్రాసెసింగ్ ఫీజును 1,685 డాలర్ల నుంచి 1,780 డాలర్లకు పెంచారు. ఇదిలా ఉండగా, అమెరికాలో వలస కార్మికుల వర్క్ పర్మిట్ ఆటోమేటిక్ పునరుద్ధరణను రద్దు చేయడాన్ని సవాలు చేస్తూ హెచ్-1బీ వీసాదారుల జీవిత భాగస్వాములు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎ‌స్)పై దావా వేశారు. ప్రభుత్వ చర్య వేలాది కుటుంబాల ఉద్యోగ, ఆర్థిక స్థిరత్వాన్ని సవాలు చేయడమేనని కాలిఫోర్నియాలోని ఫెడరల్ కోర్టులో దాఖలు చేసిన వ్యాజ్యంలో వారు ఆరోపించారు. ఎవరినీ సంప్రదించకుండా తీసుకున్న ఈ నిర్ణయం ఏకపక్షం, మోసపూరితమని పేర్కొన్నారు.

ఇక రివర్స్ బ్రెయిన్ డ్రెయిన్!

▸▸ అమెరికా నుంచి తిరిగొస్తున్న భారతీయ నిపుణులు

న్యూఢిల్లీ, జనవరి 10: అమెరికా నుంచి స్వదేశానికి తిరిగొస్తున్న భారతీయ నిపుణుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న కఠిన వలస విధానాలతో పాటు వీసా ప్రాసెసింగ్‌లో అనిశ్చితి, లేఆఫ్‌లు, సోషల్ ఖాతాల వెట్టింగ్ తదితర కారణాలతో వీరు తిరుగుముఖం పడుతున్నారని ఆంగ్ల మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. దీన్ని రివర్స్ బ్రెయిన్ డ్రెయిన్‌గా పలువురు అభివర్ణిస్తున్నారు. ఈ విధంగా వస్తున్న వారిలో అత్యధిక శాతం టెక్నాలజీ ప్రొఫెషనల్స్ కాగా, వస్తువులు, సేవల రంగాలకు చెందిన సీనియర్, మధ్యస్థాయి అధికారులు కూడా గతంతో పోలిస్తే పెద్దసంఖ్యలో ఉంటున్నారు. వీరిలో పలువురు హెచ్-1బీ, ఎల్-1 వీసాలు కలిగి ఉన్నవారేనని నివేదికలు వెల్లడిస్తున్నాయి. వీరిలో అత్యధికులు అమెరికాలో ఏడాదికి 1,50,000 డాలర్ల నుంచి 4లక్షల డాలర్ల వరకూ జీతాలు సంపాదించేవారు. వీసాల విషయంలో పెరిగిన అనిశ్చితి, వలస విధానాల్లో తరచూ మార్పుల్లే కారణమని నియామక రంగానికి చెందిన నిపుణులు పేర్కొంటున్నారు. టెక్నాలజీ రంగానికి చెందిన డజనుకు పైగా సీఈవోలు గత దశాబ్దకాలంలో తిరిగి వచ్చేశారు.

యూపీఎస్సీ పరీక్ష కేంద్రాల వద్ద డిజిటల్ రూపంలో అభ్యర్థుల ముఖగుర్తింపు

న్యూఢిల్లీ, జనవరి 10: పరీక్షల్లో అక్రమాలను నిరోధించేందుకు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఇక అభ్యర్థులను డిజిటల్ రూపంలో ముఖగుర్తింపును తప్పనిసరి చేయనుంది. ఇందుకోసం ప్రతి పరీక్ష కేంద్రం వద్ద కూడా "ఫేస్ అథంటికేషన్" టెక్నాలజీని నిర్వహిస్తామని శనివారం అధికారవర్గాలు తెలిపాయి. ఇప్పటికే ప్రయోగాత్మకంగా గురుగ్రాంలోని పలు పరీక్ష కేంద్రాల వద్ద ఈ టెక్నాలజీ నిర్వహించగా సత్ఫలితాలు వచ్చినట్లు పేర్కొన్నాయి. కొద్ది నెలల క్రితం నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నేవల్ అకాడమీ, కంబైండ్ డిఫెన్స్ సర్వీసెస్ పరీక్షల్లో ఈ విధానాన్ని అమలు చేశారు. అభ్యర్థుల రిజిస్ట్రేషన్ ఫారాల్లో పొందుపరిచిన ఫొటోలతో వారి ముఖాలు సరిపోయిందీ లేనిదీ డిజిటల్ విధానంలో తనిఖీ చేస్తారు.

నారి బిగించిన ఉద్యమం

ఇరాన్‌లో ప్రజా తిరుగుబాటు తీవ్రతరం.. ముందుండి నడిపిస్తున్న మహిళలు

▸▸ దేశమంతా పాకిన ఖమేనీ వ్యతిరేక ఉద్యమం.. నగరాలను ఆక్రమించాలని యువరాజు రెజా పహ్లవి పిలుపు

టెహ్రాన్, జనవరి 10: ఇరాన్‌లో మహిళలు 'కట్టుబాటు' సంకెళ్లను తెంచుకుని స్వేచ్ఛ కోసం పోరుకెక్కుతున్నారు. ప్రభుత్వం బలవంతంగా తొడిగిన ముసుగులను లాగిపడేసి మంటల్లో తగలెట్టి చేస్తున్నారు. ఇస్లామిక్ మతపెద్ద అయతొల్లా అలీ ఖమేనీ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు వీధుల్లో కదం తొక్కుతున్నారు. పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా వేలమంది ఉద్యమకారులు 'ఖమేనీ చావని' అంటూ గర్జిస్తున్నారు. మహిళలపై అడుగడుగునా ఆంక్షలు ఉండే ఇరాన్‌లో.. దాదాపు రెండు వారాలుగా ఉద్యమానికి మహిళలే నాయకత్వం వహిస్తున్నారు. వయసుతో సంబంధం లేకుండా అందరూ రోడ్లపైకి వచ్చి ఖమేనీ అధికారాన్ని కూలదోయటమే లక్ష్యంగా పోరాడుతున్నారు. ఇరాన్‌లో ఖమేనీ చిత్రపటాలను అవమానించడం, తగులబెట్టడం తీవ్రమైన నేరం. ఇప్పుడు మహిళలు దానినే అస్త్రంగా మార్చుకున్నారు. ఓ యువతి ఖమేనీ ఫొటోకు నిప్పు పెట్టి, ఆ మంటతో సిగరెట్ వెలిగించుకుంటున్న ఫొటో ప్రపంచవ్యాప్తంగా సోషల్ మీడియాను ఊపేస్తోంది. ఇరాన్‌లో మహిళల ధూమపానం కూడా నిషిద్ధమే. ఆ దేశంలో మహిళలు బయటకు వెళ్లాలంటే జుట్టు కనపడకుండా హిజాబ్ కప్పుకోవటం తప్పనిసరి. తాజా నిరసనల్లో మహిళలు తమ హిజాబ్‌లను మంటల్లో కాల్చివేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేస్తున్నారు.


మీ పాలనే వద్దు

గతంలో మహిళలు కఠినమైన నిబంధనలకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేయగా, తాజా నిరసనల్లో ఇస్లామిక్ రిపబ్లిక్ పాలనే వద్దనే నినాదం బలంగా వినిపిస్తోంది. ఇరాన్‌లో 1979లో వచ్చిన ఇస్లామిక్ విప్లవం తర్వాత నుంచి ఖమేనీల కుసున్నల్లోనే పాలన అంతా సాగుతోంది. తాజాగా ప్రజలు ఇస్లామిక్ రిపబ్లిక్ పాలన పోయి.. ప్రజాస్వామ్య ప్రభుత్వం రావాలని డిమాండ్ చేస్తున్నారు. కొందరు మాత్రం తిరిగి పహ్లవీ రాజవంశ పాలనను కోరుకుంటున్నారు. టెహ్రాన్‌లో జరిగిన నిరసనల్లో ముఖానికి రక్తం పూసుకుని పాల్గొన్న ఓ వృద్ధురాలు 'నాకు భయం లేదు.. ఎందుకంటే నేను 47 ఏళ్ల క్రితమే మరణించాను' అని నినాదాలు చేస్తున్న వీడియో వైరల్ అయ్యింది. 'ఇస్లామిక్ రిపబ్లిక్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న విప్లవానికి ఇరాన్ యువతులే నాయకత్వం వహిస్తున్నారు' అని డాక్టర్ మాలోఫ్ అనే రాజకీయ విశ్లేషకుడు ట్వీట్ చేశారు. గత ఏడాది డిసెంబర్ 28న మొదలైన తాజా ఉద్యమం.. రాజధాని నగరం టెహ్రాన్‌ను దాటి దేశం నలుమూలలకు పాకింది. శనివారం రాత్రి టెహ్రాన్‌లో భారీ నిరసన ప్రదర్శన జరిగింది. వేలాదిమంది ప్రజలు ఇందులో పాల్గొన్నారు. మరోవైపు అమెరికాలో ఉంటున్న పహ్లవి రాజవంశ యువరాజు రెజా పహ్లవి.. ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నిరసనలు తెలపటం మాత్రమే కాకుండా నగరాలను పూర్తిగా ఆక్రమించాలని సూచించారు. కాగా, నిరసనకారులపై ప్రభుత్వం కూడా కఠినమైన అణచివేత చర్యలకు దిగుతోంది. ఒక్క టెహ్రాన్‌లోనే ప్రభుత్వ బలగాల కాల్పుల్లో 200 మంది మరణించారని ఓ వైద్యుడు సోషల్‌మీడియాలో వెల్లడించారు. నిరసనల్లో పాల్గొనేవారిని దైవానికి శత్రువుగా భావించి మరణశిక్ష విధిస్తామని ఇరాన్ అటార్నీ జనరల్ మొహమ్మద్ మొవాహెదీ ఆజాద్ హెచ్చరించారు.



నిరసనల్లో భాగంగా ఖమేనీ చిత్రపటాన్ని కాల్చేస్తూ ఆ నిప్పుతో సిగరెట్ వెలిగించుకుంటున్న యువతి

లోకం తీరు



అయోధ్య రామ మందిరంలో నమాజ్ చేసేందుకు కశ్మీర్ వ్యక్తి ప్రయత్నం

▸▸ అహ్మద్ షేక్‌ను అదుపులోకి తీసుకున్న భద్రతా సిబ్బంది

▸▸ మా నాన్న మానసికస్థితి సరిగా లేదు.. షేక్ కుమారుడి వెల్లడి



అయోధ్య, శ్రీనగర్, జనవరి 10: అయోధ్యలోని రామ మందిరం కాంప్లెక్స్‌లో ఓ వ్యక్తి నమాజ్ చేయడానికి ప్రయత్నించడం కలకలం సృష్టించింది. జమ్మూకశ్మీర్‌లోని షోపియాన్ జిల్లాకు చెందిన అహ్మద్ షేక్(55) ఆలయ ప్రాంగణంలోకి శనివారం ప్రవేశించాడు. సీతా రసోయి ప్రాంతానికి సమీపంలో కూర్చున్నాడు. అనంతరం నమాజ్ చేయడానికి సిద్ధమవుతున్న తరుణంలో ఆలయ భద్రతా సిబ్బంది అతడి కదలికలను గుర్తించి అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం పోలీసులకు అప్పగించారు. అహ్మద్ షేక్‌ను అడ్డుకున్న సమయంలో నినాదాలు చేసినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే ఏమని నినాదాలు చేశాడన్న దానిపై స్పష్టత లేదు. కాగా ఆ వ్యక్తి ఈ చర్యకు పాల్పడటం వెనకున్న ఉద్దేశం ఏంటో తెలుసుకునేందుకు దర్యాప్తు, ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు ప్రశ్నిస్తున్నాయని పోలీసులు తెలిపారు. తాను అజ్మీర్‌కు వెళ్తున్నట్టుగా ఆ వ్యక్తి విచారణ అధికారులకు చెప్పినట్టు తెలుస్తోంది. ఈ ఘటనపై జిల్లా పాలనా యంత్రాంగం గానీ, రామ మందిరం ట్రస్ట్ గానీ ఇప్పటి వరకు స్పందించలేదు. కాగా తన తండ్రి అహ్మద్ షేక్ మానసిక స్థితి సరిగా లేదని, కొన్నాళ్లుగా ఆయన ఇంట్లో ఉండటం లేదని, తరచుగా మసీదులకు వెళ్తుంటారని అతని కుమారుడు ఇమ్రాన్.. షోపియాన్‌లోని తన నివాసంలో విలేకరులతో అన్నారు.

బంగ్లాదేశ్‌లో మరో హిందూ యువకుడి హత్య



ఢాకా, జనవరి 10: బంగ్లాదేశ్‌లో మరో హిందువు హత్యకు గురయ్యాడు. సునామ్‌గంజ్ జిల్లా భంగాడోహోర్ గ్రామానికి చెందిన జోయ్ మహాపాత్రో అనే యువకుడిని అమిరుల్ ఇస్లాం అనే స్థానికుడు కొట్టి చంపాడు. మహాపాత్రోను గ్రామంలోని దుకాణానికి పిలిచి దాడికి పాల్పడటంతో పాటు విషం కూడా ఇచ్చినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆసుపత్రికి తరలించినా లాభం లేకపోయింది. ఇది కుట్ర ప్రకారం చేసిన హత్య అని, తమకు న్యాయం చేయాలని యువకుడి కుటుంబసభ్యులు డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్‌లో గత 35 రోజుల్లో 11 మంది హిందువులు హత్యకు గురయ్యారు. గత నెలలో హిందువులపై 51 హింసాత్మక ఘటనలు నమోదయ్యాయి. బంగ్లాదేశ్‌లో హిందువులు హత్యకు గురవుతున్నా భారత్‌లో ఉన్న సెక్యులర్‌వాదం ముసుగువేసుకున్న వారి నోళ్లు మూతపడ్డాయని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ విమర్శించారు. ఎవరో ఫెవికాల్ పెట్టి నోటిని మూసినట్లే ఉందని ఆయన ఎద్దేవా చేశారు.

బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ అధ్యక్షుడిగా తారిఖ్ రహ్మాన్

ఢాకా, జనవరి 10 : బంగ్లాదేశ్‌లో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బీఎన్‌పీ) అధ్యక్షుడిగా తారిఖ్ రహ్మాన్ నియమితులయ్యారు. ఆయన తల్లి అయిన ఆ పార్టీ చైర్‌పర్సన్ ఖలేదా జియా కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో బీఎన్‌పీ స్టాండింగ్ కమిటీ శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన నియామకాన్ని ఆమోదించింది. 60 ఏళ్ల తారిఖ్ రహ్మాన్ ఫిబ్రవరిలో జరగనున్న బంగ్లా ఎన్నికల్లో ప్రధాని పదవికి ముఖ్య పోటీదారుగా ఉన్నారు. మాజీ ప్రధాని హసీనా పార్టీ అవామీ లీగ్‌పై ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం విధించినందున ఆయన పార్టీ బీఎన్‌పీ అధికారం దక్కించుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

మయన్మార్ 'నరకం' నుంచి విముక్తి!

▸▸ ఢిల్లీ చేరుకున్న 8మంది ఏపీ వాసులు

▸▸ అక్కడి నుంచి స్వగ్రామాలకు పయనం

న్యూఢిల్లీ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల పేరుతో మాయమాటలు చెప్పి, మయన్మార్‌కు తరలించి అక్కడ చిత్రహింసలకు గురిచేస్తున్న ముఠాల చెర నుంచి రాష్ట్రవాసులు ఎట్టకేలకు విముక్తి పొందారు. నరకయాతన అనుభవిస్తున్న బాధితులను రక్షించాలంటూ కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి, శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు చేసిన విజ్ఞప్తికి కేంద్ర విదేశాంగ శాఖ తక్షణమే స్పందించింది. ఆయన చొరవతో మయన్మార్ సరిహద్దుల్లో చిక్కుకుపోయిన ఏపీకి చెందిన 8మంది, తెలంగాణకు చెందిన ఇద్దరిని సురక్షితంగా రక్షించి శనివారం ఢిల్లీకి తరలించారు. అక్కడినుంచి బాధితులు తమ స్వగ్రామాలకు బయలుదేరారు. పౌర విమానయాన, విదేశాంగ శాఖల సమన్వయంతోనే ఈ ఆపరేషన్ విజయవంతమైందని రామ్మోహన్ తెలిపారు.

గర్భవతిని చేస్తే 10 లక్షలు

▸▸ బిహార్‌లో కొత్త తరహా సైబర్ మోసం

నవాదా(బిహార్), జనవరి 10: సైబర్ మోసం కొత్త పుంతలు తొక్కుతోంది. బిహార్‌లోని నవాదా కేంద్రంగా మొదలైన ఈ సైబర్ మోసంలో అనేక మంది భారీగానే సొమ్ములు పోగొట్టుకున్నట్లు సైబర్ పోలీసులు అనుమానిస్తున్నారు. పిల్లలు లేని మహిళలతో సెక్స్‌లో పాల్గొని గర్భవతిని చేస్తే రూ.10 లక్షలు ఇస్తామంటూ ఫేస్‌బుక్, వాట్సా‌ప్‌లలో వస్తున్న ప్రకటనలు పూర్తి మోసపూరితమని ఎస్పీ అభినవ్ ధీమాన్ పేర్కొన్నారు. "ఆల్ ఇండియా ప్రెగ్నెంట్ జాబ్, ఆల్ ఇండియా ప్రెగ్నెంట్ సర్వీస్.. పేరుతో సామాజిక మాధ్యమాల్లో ప్రకటనలు వస్తున్నాయి.

ఏదో ఒక రోజు భారత ప్రధానిగా హిజాబ్ ధరించిన మహిళ: అసదుద్దీన్

ముంబై, జనవరి 10: మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఏదో ఒకరోజు.. హిజాబ్ ధరించిన మహిళ భారత ప్రధాని అవుతుందని, ఆ రోజు వస్తుందని అన్నారు. పాకిస్థాన్‌లా కాకుండా భారత రాజ్యాంగం అన్ని మతాల వారికీ ఆ అవకాశం కల్పిస్తోందని చెప్పారు. పాక్ రాజ్యాంగం మాత్రం కేవలం ముస్లింలకు మాత్రమే అవకాశం కల్పిస్తుందన్నారు. శుక్రవారం సోలాపూర్‌లో జరిగిన ప్రచార సభలో ఒవైసీ ఈ వ్యాఖ్యలు చేశారు. దీనిపై బీజేపీ ఘాటుగా స్పందించింది. "90% హిందువులు ఉన్న దేశంలో హిజాబ్ లేదా బురఖా ధరించిన మహిళ ప్రధాని మాత్రమే కాదు.. ముంబై మేయర్ కూడా కాలేదు. ఎవరికైనా అలాంటి కోరిక ఉంటే కరాచీ వంటి ఇస్లామిక్ దేశాలకు వెళ్లి ప్రయత్నం చేసుకోవాలి" అని బీజేపీ నేత, మహారాష్ట్ర మంత్రి నితీశ్ రాణే అన్నారు. ఒవైసీ ముందుగా హిజాబ్ ధరించిన మహిళను తన పార్టీకి అధ్యక్షురాలిని చేయాలని షెహజాద్ పూనావాలా సవాల్ చేశారు.

అమెరికాలో కాల్పులు.. ఆరుగురి మృతి

వాషింగ్టన్, జనవరి 10: అమెరికాలో మరోసారి సామూహిక కాల్పుల సంఘటన చోటు చేసుకుంది. మిస్సిసిపీలోని క్లే కౌంటీలో శుక్రవారం రాత్రి మూడు చోట్ల జరిగిన కాల్పుల్లో ఆరుగురు మరణించారు. ఓ అనుమానితుడ్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 20వేల జనాభా ఉండే ఈ కౌంటీలో 3చోట్ల కాల్పులతో ఆందోళన నెలకొంది.

సుప్రీంకు ఈడీ-దీదీ పోరు

అత్యున్నత న్యాయస్థానంలో ఇరువర్గాల పిటిషన్లు

▸▸ మమతా బెనర్జీ చర్యలు 'బల ప్రదర్శనే': ఈడీ

▸▸ మా వాదన వినకుండా ఆదేశాలు జారీ చేయొద్దు: ప్రభుత్వం

న్యూఢిల్లీ, జనవరి 10: పశ్చిమబెంగాల్ సీఎం మమత, ఈడీ మధ్య పోరు కలకత్తా హైకోర్టులో రసాభాసగా మారిన నేపథ్యంలో ఇరుపక్షాలూ సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. కేసు విచారణను శుక్రవారం హైకోర్టు ఈనెల 14వ తేదీకి వాయిదా వేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈడీ శనివారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. బొగ్గు స్కామ్‌పై విచారణలో భాగంగా ఈడీ అధికారులు చేపట్టిన తనిఖీలను, ఆధారాల సేకరణను సీఎం మమత మద్దతుతో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు అడ్డుకున్నారని ఆ పిటిషన్‌లో ఈడీ ఆరోపించింది. పశ్చిమబెంగాల్‌లో మరో 4నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో అధికార తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) పార్టీ ఎన్నికల వ్యూహాల కోసం పనిచేస్తున్న ఐ-ప్యాక్ సంస్థ కార్యాలయం, ఆ సంస్థ డైరెక్టర్ ప్రతీక్ జైన్ ఇంట్లో గురువారం ఈడీ సోదాలు చేపట్టగా, తమ ఎన్నికల వ్యూహాలను చోరీ చేసేందుకే ఈడీ ఈ దాడులు చేపట్టిందని టీఎంసీ ఆరోపించిన విషయం తెలిసిందే. ఈడీ తీరుకు నిరసనగా మమతా బెనర్జీ భారీ ప్రదర్శన కూడా నిర్వహించారు. సోదాల సందర్భంగా అక్కడ జరిగిన వరుస ఘటనలను ఈడీ తన పిటిషన్‌లో వివరించింది. రాష్ట్ర ప్రభుత్వ చర్యలను 'బలప్రదర్శన'గా ఆక్షేపించింది. ఈ అంశంలో పోలీసులు సహా రాష్ట్ర అధికారులు జోక్యం చేసుకోవడం.. బొగ్గు స్మగ్లింగ్ స్కామ్ దర్యాప్తు సమగ్రతపై రాజీపడినట్టు స్పష్టమవుతోందని పేర్కొంది. స్వేచ్ఛాయుతంగా, స్వతంత్రంగా దర్యాప్తు జరిపే తమ హక్కును రాష్ట్ర యంత్రాంగం హరించిందని ఆక్షేపించింది. అక్కడ జరిగిన ఘటనలపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని సుప్రీంకోర్టును కోరింది. బొగ్గుస్కామ్‌కు సంబంధించిన రూ.20 కోట్లను హవాలా మార్గాల ద్వారా ఐప్యాక్‌కు మళ్లించినట్టు కీలకమైన ఆధారాలను దర్యాప్తులో గుర్తించామని, అయితే, సోదాల సమయంలో ప్రతీక్ జైన్ ఇంట్లోకి మమత ప్రవేశించి కీలక ఆధారాలను లాక్కెళ్లిపోయారని ఆరోపించింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం(పీఎంఎల్ఏ) కింద చేపట్టిన సోదాల్లో జోక్యం చేసుకోవద్దని తాము అభ్యర్థించినప్పటికీ మమత పోలీసుల సాయంతో బలవంతంగా కీలకమైన పత్రాలు, డిజిటల్ పరికరాలను లాక్కున్నారని తెలిపింది. అలాగే, ఐదుగురు సాక్షులను 'సమర్థవంతంగా హైజాక్' చేశారని ఈడీ ఆరోపించింది. ఆ పత్రాలు, డిజిటల్ పరికరాలను వారు వినియోగించకుండా, తొలగించకుండా మధ్యంతర ఆదేశాలు జారీ చేయాలని కోరింది. మరోవైపు ఈ అంశంలో తమ వాదన వినకుండా ఎటువంటి ఆదేశమూ జారీ చేయవద్దని కోరుతూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం శనివారం సుప్రీంకోర్టులో కెవియెట్ దాఖలు చేసింది.

సోమ్‌నాథ్ స్వాభిమాన్ పర్వ్‌లో మోదీ



గాంధీనగర్, జనవరి 10: గుజరాత్‌లోని ప్రసిద్ధ శైవ క్షేత్రం సోమ్‌నాథ్ మందిరాన్ని ప్రధాని మోదీ సందర్శించారు. సోమ్‌నాథ్ మందిరంపై తొలి దాడికి వెయ్యేళ్లైన సందర్భంగా నిర్వహిస్తున్న సోమ్‌నాథ్ స్వాభిమాన్ పర్వ్‌లో ఆయన పాల్గొన్నారు. మందిరంలో ఆయన ప్రత్యేక పూజలు చేయడంతో పాటు ఓంకార మంత్ర జపంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మందిర విశేషాలతో నిర్వహించిన ప్రత్యేక డ్రోన్ షోను ఆయన వీక్షించారు. 3వేల డ్రోన్‌లను ఇందుకు వినియోగించారు. 1026 జనవరిలో మహ్మద్ ఘజని ఈ పుణ్యక్షేత్రంపై దాడి జరిపిన సందర్భంగా నిర్వహిస్తున్న స్వాభిమాన్ పర్వ్ ఈ నెల 11 దాకా జరగనుంది. సోమ్‌నాథ్ ఆలయాన్ని కాపాడే క్రమంలో ప్రాణ త్యాగం చేసిన వారిని స్మరించుకుంటూ నిర్వహించే శౌర్య యాత్రలో మోదీ పాల్గొంటారు. 108 గుర్రాలతో ఆదివారం ఈ శౌర్య యాత్ర నిర్వహించనున్నారు.

కుప్పకూలిన విమానం

▸▸ ఆరుగురికి గాయాలు.. ఒడిశాలోని రూర్కెలాలో ఘటన



రూర్కెలా/భువనేశ్వర్, జనవరి 10: పై చిత్రంలో కనిపిస్తున్న చిన్నపాటి విమానం.. ఓ ప్రైవేట్ విమానయాన సంస్థది. తొమ్మిది మంది ప్రయాణించే సామర్థ్యం ఉన్న 'వన్ ఏ-1' చార్టర్డ్ విమానం.. శనివారం నలుగురు ప్రయాణికులు, ఇద్దరు సిబ్బందితో ఒడిశాలోని భువనేశ్వర్ నుంచి రూర్కెలాకు బయలు దేరింది. మరో 10 కిలోమీటర్లు ప్రయాణిస్తే గమ్యస్థానం చేరుతుందనగా.. అదుపుతప్పి పొలాల్లో కుప్పకూలింది. ఈ ఘటనలో పైలెట్లు సహా మొత్తం ఆరుగురు గాయపడ్డారు. బాధితుల్లో ఇద్దరు మహిళలు ఉన్నట్టు ఒడిశా రవాణాశాఖ మంత్రి బీబీ జెనా తెలిపారు.





పక్షుల పండుగ ప్రారంభోత్సవం సందర్భంగా సూళ్లూరుపేటలో శోభాయాత్ర

పక్షుల పండుగ పిలుస్తోంది!

తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో పక్షుల పండుగ శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ ఫ్లెమింగో ఫెస్టివల్‌ను ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ప్రారంభించారు. అనంతరం స్టాళ్లను ప్రారంభించారు. భీములవారిపాళెం పడవల రేవులో పడవ షికారుకు పచ్చజెండా ఊపారు. నేలపట్టు, అటకానితిప్పలో పక్షులను చూసేందుకు సందర్శకులు తరలి వచ్చారు. తొలిరోజు పడవ షికారు, పక్షుల వీక్షణకు జనం ఆసక్తి చూపారు. చలి గాలులు, వర్షంతో పర్యాటకులు ఇబ్బందిపడ్డారు. ఉదయం సూళ్లూరుపేటలో శోభాయాత్ర నిర్వహించారు. సూళ్లూరుపేట, సర్వేపల్లి ఎమ్మెల్యేలు విజయశ్రీ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్ పాల్గొన్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

– ఆంధ్రజ్యోతి, సూళ్లూరుపేట

విశాఖ నుంచి మూడు ఇండిగో విమానాలు రద్దు

- ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రయాణికులు

విశాఖపట్నం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నుంచి శనివారం బెంగళూరు, హైదరాబాద్, కర్నూల్ నగరాలకు వెళ్లాల్సిన మూడు విమానాలను ఇండిగో సంస్థ ఆకస్మికంగా రద్దు చేసింది. దీనిపై ప్రయాణికులకు ముందుగా సమాచారం ఇవ్వలేదు. చెకింగ్ పూర్తి చేసుకొని, బోర్డింగ్ పాస్ తీసుకున్న తరువాత విమానం ఎక్కించడానికి బస్సులో తీసుకువెళ్లి, అక్కడ కొద్దిసేపు వెయిటింగ్‌లో ఉంచి...తరువాత సాంకేతిక కారణాలతో సర్వీస్ రద్దయిందని చెప్పి తిరిగి టెర్మినల్‌కు తీసుకువచ్చారు. విశాఖ నుంచి బెంగళూరు, కర్నూలుకు సంక్రాంతి పండుగ కోసం కుటుంబాలతో సహా వెళ్లాల్సిన వారు మరో విమానం లేక, రైళ్లకు వెళ్లే అవకాశం లేక ఇబ్బంది పడ్డారు.

విద్యార్థుల్లో మత విద్వేష బీజాలు నాటితే దేశానికే ప్రమాదకరం

- వైజ్ఞానిక స్పృహ లేకుండా చేస్తారా?: ఆచార్య దేవరాజు మహారాజ్
- గుంటూరులో ప్రారంభమైన యుటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు



యుటీఎఫ్ కౌన్సిల్ సమావేశాల్లో మాట్లాడుతున్న ఆచార్య దేవరాజు మహారాజ్, హాజరైన ఉపాధ్యాయులు

గుంటూరు (విద్య), జనవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో మత విద్వేష బీజాలు నాటితే అది భవిష్యత్తుకే ప్రమాదకరమని.. నైతికత, జాతీయత లేకుండా విద్యార్థులను సత్యశీలురుగా మార్చడం సాధ్యం కాదని ఉస్మానియా యూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య దేవరాజు మహారాజ్ స్పష్టం చేశారు. శనివారం గుంటూరు ఏసీ కళాశాలలో యుటీఎఫ్ 51వ కౌన్సిల్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. దేవరాజు మహారాజ్ మాట్లాడుతూ పాఠ్యాంశాల్లో హేతుబద్ధమైన అంశాలను తొలగించి, కవులు, రచయితలను నిర్బంధాలకు గురిచేయడం సరికాదన్నారు. విద్యార్థుల్లో వైజ్ఞానిక స్పృహ ఉండకూడదని పాఠ్యాంశాల్లో 1800 అంశాలను మార్చివేశారని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠ్యాంశాల్లో చరిత్రకారుల పేర్లు తొలగించినంత మాత్రాన చరిత్రకారుల కట్టడాలు ఆనవాళ్లు చెరిపి వేయలేరని తెలిపారు. దేశంలో ముస్లింలు, క్రైస్తవుల డీఎన్ఏలలో ఆయా మతాల మూలాల్లేవని వీళ్లందరూ భారతీయ మూలాలు ఉన్నవారేనని, వాళ్ల స్వీయ రక్షణ కోసం మతం మారారు తప్ప బలంగా మతమార్పిడి చేయలేదని చరిత్ర చెబుతోందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఊరు బడిని కాపాడుకుంటేనే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్రాంతిలోగా పీఆర్సీ కమిటీ నియమించాలని లేకపోతే జనవరి 20 నుంచి యుటీఎఫ్ ఉద్యమాలకు సిద్ధమవుతుందని స్పష్టం చేశారు. సమావేశాలకు ముందు గుంటూరులో భారీ ర్యాలీ నిర్వహించారు.

తెలుగు వెలుగుతోంది

- గత వెయ్యేళ్లలోనే తెలుగు సాహిత్యం అభివృద్ధి చెందింది
- భాష రూపం, ఉచ్చరణ, అక్షర నిర్మాణం అన్నీ అద్భుతమే
- ప్రపంచ వ్యాప్తంగా తెలుగు మాట్లాడేవారి సంఖ్య 12కోట్లు
- ఆవకాయ్-అమరావతి చర్చా వేదికలో ప్రముఖ రచయితలు



‘ఆవకాయ్-అమరావతి’ కార్యక్రమంలో మాట్లాడుతున్న కస్తూరి మురళీకృష్ణ, మామిడి హరికృష్ణ, వర ముళ్లపూడి, వేదాంతం శ్రీపతి శర్మ, ఎం.అనూరాధ

విజయవాడ సిటీ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): గడిచిన వెయ్యి ఏళ్లలోనే తెలుగు సాహిత్యం అద్భుతంగా విరాజిల్లిందని పలువురు రచయితలు అభిప్రాయపడ్డారు. నేటి సోషల్ మీడియా యుగంలోనూ భాష దినాదినాభివృద్ధి చెందుతోందని తెలిపారు. ‘ఆవకాయ్-అమరావతి’ కార్యక్రమంలో ‘సుందరమైన తెలుగు- తెలుగు సాహిత్యం, సినిమా వైభవం’ అంశంపై శనివారం విజయవాడలోని భవానీ ద్వీపంలో జరిగిన చర్చలో ప్రముఖ రచయితలు కస్తూరి మురళీకృష్ణ, మామిడి హరికృష్ణ, మౌనశ్రీ మల్లిక్, శ్రీపతి శర్మ వేదాంతం పాల్గొన్నారు. స్పష్టత, వైవిధ్యంతో కూడిన విశిష్టతను సొంతం చేసుకుని, రూపం, ఉచ్చరణ, అక్షర నిర్మాణం, భావార్థం, పదార్థం (పదం, అర్థం సమానంగా వ్యక్తీకరించడం) మేళవింపులతో సుందరీకరణ చెంది, పదాల పోహలింపు, అమరికతో తెలుగు రోజురోజుకు ఎంతో అందంగా తయారవుతోందని స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా తెలుగు మాట్లాడే వారి సంఖ్య 12 కోట్లకు చేరిందని వెల్లడించారు. భావాలకు పుట్టినిల్లుగా తెలుగును కీర్తించారు. ఎలా చదువుతున్నామో, ఎలా మాట్లాడుతున్నామో అనే విషయాలకు దూరమవుతున్న పరిస్థితుల్లోనూ తెలుగు వెలుగులు విరజిమ్ముతుండటం సంతోషించదగిన విషయమన్నారు. పదేళ్లకు ఒకసారి తరం మారుతుంటుందని, ప్రతి తరంలోనూ భాష ఉచ్చరణలో మార్పులు సంభవిస్తుంటాయని, ఈ తరుణంలోనే భాష దిగజారి పోతుందనే భావన పాత తరం వారిలో కలుగుతుండటం సర్వసాధారణమని వివరించారు. తరాలకు తగినట్లుగా పదాలు మారుతుంటాయని, కొన్ని అక్షరాలు, పదాలు మాయమై, కొత్తవి పుట్టుకువస్తాయని, దీన్ని రచయితలు ఆహ్వానించాలని హితవు పలికారు. మాండలికాలను గౌరవించుకుంటూ, నైతిక విలువలను అర్థం చేసుకుంటూ.. కొత్త తరం పుట్టించిన పదాలకు పాత తరం పదాలను జోడించి రచనలను కొనసాగిస్తూ భాషను ముందుకు నడిపించాలని సూచించారు.

పున్నమి ఘాట్‌లో..:

ఆవకాయ్-అమరావతి ఉత్సవాల్లో భాగంగా పున్నమి ఘాట్‌లో తెలుగు భాష యాసలు అన్నింటినీ కూర్చి చౌరస్తా బృందం చేసిన గానం ఆకట్టుకుంది. ఎన్.టి.రామారావు జీవిత ప్రస్థానంపై ఏవీ ప్రదర్శించారు. ఎన్టీఆర్ జీవిత వైభవాన్ని నేటి తరానికి వేదికలపై ఉన్న ప్రముఖులు గుర్తు చేశారు. 300కు పైగా సినిమాల్లో నటించి, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందమే కాకుండా తెలుగువారి ఆత్మగౌరవానికి చిరునామాగా మారారని కీర్తించారు. అనంతరం ప్రేమ కథా చిత్రమ్ అనే సంగీత నాటికను ప్రదర్శించారు. చివరిగా జావెద్ ఆలీ సంగీత కచేరీతో కార్యక్రమం ముగిసింది.

తెలుగు అనువాదాలకు ప్రాధాన్యం పెరగాలి

‘అనువాద కళ’ చర్చలో రచయితలు కె.శ్రీనివాసరావు, జయప్రద, విజయ్‌కుమార్, మరియా పూరి(పోలాండ్) మాట్లాడుతూ అనువాద రచనలకు ప్రాధాన్యం పెరగాలని అభిప్రాయపడ్డారు. బెంగాలీ నవలలే అధికంగా అనువాదం అవుతున్నాయని, ఆ ధోరణి తెలుగు నవలలకూ రావాలని ఆకాంక్షించారు. మన రచనలు ప్రపంచవ్యాప్తంగా అన్ని భాషల్లోకి వెళ్లాలని, ఇతర భాషల నుంచి తెలుగుకు అనువాదమైన రచనలకు ఆదరణ పెరగాలని, అందుకు పబ్లిషర్లు ముందుకు రావాలని కోరారు. ‘నీటిపై రాతలు-తెలుగులో కథ చెప్పే కళ’ అంశంపై రచయితలు బ్నిం, సున్నపురెడ్డి వెంకట్రామిరెడ్డి మధ్య, ‘శుక్రవారం విడుదల-సినిమా, పాత్రికేయ వృత్తి’ అనే అంశంపై రచయితలు చల్లా భాగ్యలక్ష్మి, వర ముళ్లపూడి, వడ్డి ఓంప్రకాశ్ నారాయణ మధ్య సంభాషణలు సాగాయి. స్టోరీ అవర్ యుకే బృందం ప్రదర్శించిన సార్వత్రిక కథలు ఆకట్టుకున్నాయి.

డిసెంబరులో మళ్లీ ఆవకాయ్ ఉత్సవాలు

- నంది నాటకోత్సవాలను పునరుద్ధరిస్తాం: మంత్రి దుర్గేశ్

‘ఆవకాయ్- అమరావతి’ ఉత్సవాలను ఒక బ్రాండ్‌గా తీర్చిదిద్దుతామని పర్యాటక మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. ఈనెల 8 నుంచి 10 వరకు ఉత్సవాలను వైభవంగా నిర్వహించామని, తిరిగి డిసెంబరు 17, 18, 19 తేదీల్లో అధికారికంగా నిర్వహిస్తామని ప్రకటించారు. ముగింపు సభకు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమాలకు 45 వేల మంది వచ్చినట్లు తెలిపారు. నంది నాటకోత్సవాలను తిరిగి నిర్వహించి, ప్రతిభావంతులకు నంది అవార్డులు అందజేస్తామని ప్రకటించారు. కళాకారులకు కందుకూరి, ఉగాది పురస్కారాలను అందజేస్తామని తెలిపారు. ఉత్సవాలను విజయవంతం చేసిన అధికారులు, టీం వర్క్స్ ఆర్ట్స్ ప్రతినిధులను ఆయన అభినందించారు. ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, వసంత కృష్ణప్రసాద్, షాజహాన్ బాషా పాల్గొన్నారు.

భోగి మంటల్లో కాలుష్య కారక వ్యర్థాలు వేయొద్దు

- పీసీబీ చైర్మన్ కృష్ణయ్య సూచన

అమరావతి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): భోగి పండుగను పర్యావరణ హితంగా జరుపుకోవాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ పి.కృష్ణయ్య సూచించారు. భోగి మంటల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, ప్రమాదకరమైన రబ్బర్, ఎలక్ట్రానిక్, రసాయన పూతలున్న వస్తువులను వేయొద్దని కోరారు. ‘తెలిసీ, తెలియక భోగి మంటల్లో టైర్లు, ఫ్లెక్సీలు, ప్లాస్టిక్ వస్తువులు, రంగులేసిన ఫర్నిచర్, నిరుపయోగమైన ఎలక్ట్రానిక్ వస్తువులు వేస్తుంటారు. వాటిని కాల్చినప్పుడు డయాక్సిన్లు, ఫ్యూరాన్లు, కార్బన్ మోనాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్లు, సీసం క్యాడ్మియం, మెర్క్యురీ వంటి విష వాయువులు వాతావరణంలోకి చేరతాయి. ఫలితంగా చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు ఈ ప్రమాదకరమైన విష వాయువులతో ప్రాణాంతకమైన వ్యాధుల ముప్పు ఉంటుంది’ అని శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

రీసర్వే విజయవంతానికి రెవెన్యూ ఉద్యోగులు సిద్ధం: బొప్పరాజు



సమావేశంలో మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

విజయవాడ (గాంధీనగర్), జనవరి 10 (ఆంధ్రజ్యోతి): భూ యాజమానులు, రైతుల హితమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన రీసర్వే ప్రక్రియను విజయవంతం చేసేందుకు రెవెన్యూ ఉద్యోగులు సిద్ధంగా ఉన్నారని ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. దీనికి సరిపడా సమయం, సిబ్బంది, కనీస శిక్షణ, సాంకేతిక మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. విజయవాడలోని రెవెన్యూ భవన్‌లో అసోసియేషన్ కార్యవర్గ సమావేశం శనివారం నిర్వహించారు. రెవెన్యూ శాఖ ద్వారా ప్రజలకు అందిస్తున్న వివిధ సేవల అమలు తీరు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న పరిపాలనా, సాంకేతిక, సంక్షేమ సంబంధిత సమస్యలపై విస్తృతంగా చర్చించారు. రీసర్వే అమలులో భాగంగా భూ సరిహద్దులు, భూమి విస్తీర్ణం, ఖాతాదారుల వివరాలు తదితర అంశాల్లో ఎదురవుతున్న ఇబ్బందులు, సాంకేతిక కారణాలతో జరిగే తప్పిదాలు, వాటివల్ల భూ యజమానులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, తప్పిదాలను సరిదిద్దడంలో రెవెన్యూ సిబ్బందిపై పడుతున్న అధిక భారం వంటి అంశాలపై సమీక్షించారు.

శ్రీలంకలో తీరం దాటిన వాయుగుండం

- బలహీనపడి దక్షిణ తమిళనాడు వైపు పయనం
- నేడు, రేపు రాయలసీమ, దక్షిణ కోస్తాలకు వర్షసూచన
- రాష్ట్రంలో కొనసాగుతున్న చలి వాతావరణం

విశాఖపట్నం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం శనివారం ఉదయం వాయుగుండంగా బలహీనపడింది. మధ్యాహ్నం ఉత్తర శ్రీలంకలోని జాఫ్నా, ట్రింకోమలై మధ్య తీరం దాటింది. ఇది పశ్చిమంగా పయనిస్తూ దక్షిణ తమిళనాడు వైపు వచ్చే క్రమంలో మరింత బలహీనపడనుంది. దీని ప్రభావంతో శనివారం ఉదయం నుంచి తమిళనాడులో వర్షాలు కురుస్తున్నాయి. శనివారం రాత్రి నుంచి ఆదివారం వరకూ తమిళనాడులో భారీ నుంచి అతిభారీవర్షాలు కురుస్తాయి. ఆది, సోమవారాల్లో తిరుపతి, చిత్తూరు, కడప, అనంతపురం, అన్నమయ్య, నంద్యాల, శ్రీసత్యసాయి, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని ఇస్రో వాతావరణ నిపుణుడు ఒకరు తెలిపారు. వాయుగుండం దిశగా ఉత్తర భారతం నుంచి గాలులు వీస్తుండడం, మేఘాలు ఆవరించడంతో కోస్తా, రాయలసీమల్లో చలి తీవ్రత కొనసాగింది. పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి నాలుగు డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టులో 6.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఆదివారం కూడా చలి ప్రభావం కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది.

వీఆర్వోలపై వేధింపులు సరికాదు

- ఏపీ వీఆర్వోల సంఘం అధ్యక్షుడు రవీంద్రరాజు

విజయవాడ (గాంధీనగర్)/ఏలూరు రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ అధికారులను ఉన్నతాధికారులు వేధింపులకు గురి చేయడం సరికాదని ఏపీ వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బీహెచ్.రవీంద్రరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వం 100 రోజుల్లో రీసర్వే పూర్తి చేయాలనడంతో తప్పులతడకలుగా రీసర్వే జరిగిందని పేర్కొన్నారు. వాటిలోని తప్పులను సరి చేయకుండా, ఇప్పుడు మళ్లీ రీసర్వే పూర్తయిన 6,680 గ్రామాలకు గాను 4,784 గ్రామాల్లో 23.33 లక్షల కొత్తగా రాజముద్ర ప్రింట్ చేసిన పాస్ పుస్తకాలను ఈ నెల 2 నుంచి గ్రామ సభలు నిర్వహించి ఇవ్వాలని అధికారులు ఆదేశాలిచ్చారని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయాలకు నాలుగు నెలల క్రితమే ఈ పాస్ పుస్తకాలు వచ్చాయని.. క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకోకుండా వారం రోజుల్లోగా పంపిణీ పూర్తి చేయాలని వీఆర్వోలను ఒత్తిడి చేయడం సరికాదన్నారు. వీఆర్వోలను ఇబ్బంది పెడుతూ, ప్రభుత్వానికి దూరం చేసేందుకు కొందరు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు.



చీపురుపల్లిలో ప్రారంభించిన రైల్వేఫ్లైఓవర్

ఐదేళ్ల నిరీక్షణకు తెర

- చీపురుపల్లిలో రైల్వేఫ్లైఓవర్ ప్రారంభం.. తీవ్ర నిర్లక్ష్యం చేసిన వైసీపీ ప్రభుత్వం
- 18 నెలల్లోనే పూర్తిచేసిన కూటమి ప్రభుత్వం

విజయనగరం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఓ వంతెన కోసం ఐదేళ్లుగా రెండు రాష్ట్రాల ప్రజలు, ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాల వాసులు ఆశగా ఎదురుచూశారు. ఎట్టకేలకు అది అందుబాటులోకి రావడంతో వారి ఆనందానికి అవధుల్లేవు. విజయనగరం జిల్లా చీపురుపల్లిలో రైల్వే ఫ్లైఓవర్‌ను ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే కళా వెంకటరావు శనివారం ప్రారంభించారు. దశాబ్దాల కిందట నిర్మించిన ఈ వంతెన శిథిలావస్థకు చేరడంతో రైల్వేశాఖ ఉన్నతాధికారులు 2021 డిసెంబరు నుంచి రాకపోకలను నిలిపివేశారు. విశాఖ నుంచి పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండకు ఇదే ప్రధాన రహదారి. అంతేకాకుండా ఒడిశా వెళ్లే అంతర్రాష్ట్ర రహదారి కూడా. విజయనగరం జిల్లాలోని రాజాం, బొబ్బిలి నియోజకవర్గాలకు, శ్రీకాకుళంలోని ఎచ్చెర్ల, ఆమదాలవలస, పాతపట్నం నియోజకవర్గాలకు కూడా ఇదే ప్రధాన రహదారి. ఫ్లైఓవర్ నిర్మాణం విషయంలో గత వైసీపీ ప్రభుత్వం కనీస చొరవ చూపలేదు. దీంతో రెండు రాష్ట్రాలు, మూడు జిల్లాల ప్రజలకు ప్రయాణభారం తప్పలేదు. శ్రీకాకుళం జిల్లా చిలకపాలెం మీదుగా విశాఖకు రాకపోకలు సాగించేవారు. దీనివల్ల 50 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వచ్చేది. ప్రతిపక్షాల నుంచి ఒత్తిడి, ప్రజల నుంచి విమర్శలు రావడంతో కేంద్ర ప్రభుత్వం ఈ రైల్వే వంతెన నిర్మాణానికి 2023 మార్చిలో రూ.13 కోట్లు మంజూరు చేసింది. వంతెన నిర్మాణం పూర్తయినా, అప్రోచ్ రోడ్డుతో పాటు అనుసంధాన పనులు చేయించడంతో వైసీపీ ప్రభుత్వం విఫలమైంది. 2024 జూన్‌లో అధికారంలోకి వచ్చిన కూటమి ఈ ఫ్లైఓవర్‌పై ప్రత్యేకంగా దృష్టిపెట్టింది. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే కళా వెంకటరావు రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రం దృష్టికి దీన్ని తీసుకెళ్లడంతో 18 నెలల కాలంలో పనులు పూర్తయ్యాయి. కాగా.. ఈ వంతెన విషయంలో క్రెడిట్ కొట్టేయ్యాలని భావించిన వైసీపీ నేతలు కొద్దిరోజుల క్రితం నూతన నిర్మాణం వద్ద కొబ్బరికాయలు కొట్టి హడావుడి చేయడంతో స్థానికులు ముక్కున వేలేసుకున్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనలో ఆర్ఎంపీలది కీలక పాత్ర

- మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్ వెల్లడి



సదస్సులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్

గుంటూరు మెడికల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నేటికీ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల వైద్యసేవల విషయంలో ఆర్ఎంపీ, పీఎంపీ, గ్రామీణ వైద్యులదే కీలక పాత్ర అని మాజీ ఎమ్మెల్సీ, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్ తెలిపారు. శనివారం గుంటూరు సమీపంలోని బుడంపాడు బైపాస్ రోడ్డులో జరిగిన ఆర్ఎంపీ వైద్యుల రాష్ట్ర సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమానికి ఆర్ఎంపీ వైద్యుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్, యూరాలజిస్ట్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి అధ్యక్షత వహించారు. ఆర్ఎంపీ వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని జనార్దన్ హామీ ఇచ్చారు. సమావేశంలో శాసన మండలి సభ్యులు మర్రి రాజశేఖర్, ఆలపాటి రాజేంద్రప్రసాద్, శాసన సభ్యులు బూర్ల రామాంజనేయులు, మొహమ్మద్ నసీర్ అహ్మద్, చదలవాడ అరవిందబాబు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఆదిత్య మెడికవర్ హాస్పిటల్ డైరెక్టర్లు డాక్టర్ పాకనాటి కృష్ణ ప్రవంత్, డాక్టర్ చదలవాడ అమూల్య తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు రెండు వేల మంది ఆర్ఎంపీ వైద్యులు పాల్గొన్నారు.

రేపే నింగిలోకి పీఎస్ఎల్వీ-సీ62

- కక్ష్యలోకి ఈవోఎస్-ఎన్1, మరో 15 చిన్న ఉపగ్రహాలు
- ‘ఈవోఎస్’తో వాతావరణ మార్పులు, పర్యావరణ పరిశోధన
- శ్రీహరికోటలో ప్రయోగానికి నేడు కౌంట్‌డౌన్ ప్రారంభం
- కొత్త ఏడాదిలో ఇస్రోకు తొలి లాంచింగ్ ఇదే..



ప్రయోగ వేదికపై ఉన్న పీఎస్ఎల్వీ-సీ 62 రాకెట్

సూళ్లూరుపేట/తిరుమల, జనవరి 10(ఆంధ్రజ్యోతి): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో ప్రతిష్టాత్మక ప్రయోగానికి సిద్ధమైంది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్-షార్ నుంచి సోమవారం ఉదయం 10.17 గంటలకు పీఎస్ఎల్వీ-సీ62 రాకెట్‌ను ప్రయోగించనుంది. దీని ద్వారా అధునాతన భూపరిశీలన ఉపగ్రహం ఈవోఎస్-ఎన్1తో పాటు మరో 15 చిన్న ఉపగ్రహాలను రోదసిలోకి పంపనుంది. కొత్త ఏడాదిలో ఇస్రోకు ఇదే తొలి ప్రయోగం. దీనికి సంబంధించిన మిషన్ సంసిద్ధత సమీక్షా సమావేశం (ఎంఆర్ఆర్) శనివారం షార్‌లో జరిగింది. అనంతరం షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్ అధ్యక్షతన లాంచింగ్ ఆథరైజేషన్ బోర్డు (ల్యాబ్) సమావేశమై ప్రయోగానికి సంసిద్ధత తెలిపింది. ఈ ప్రయోగానికి సంబంధించిన కౌంట్‌డౌన్‌ను 22 గంటల ముందు అంటే.. ఆదివారం మధ్యాహ్నం 12.17 గంటలకు ప్రారంభించనున్నారు. కౌంట్‌డౌన్ ముగియగానే సోమవారం ఉదయం 10.17 గంటలకు షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్వీ-సీ62 రాకెట్ నిప్పులు చిమ్ముతూ నింగిలోకి ఎగరనుంది. కౌంట్‌డౌన్ ముందు ప్రయోగ వేదికపై ఉన్న రాకెట్‌కు తుది దశ పరీక్షలు నిర్వహించి, ప్రీ కౌంట్‌డౌన్ నిర్వహించారు. షార్‌కు ఇస్రోలోని అన్ని సెంటర్ల డైరెక్టర్లు విచ్చేసి ప్రయోగ ఏర్పాట్లలో నిమగ్నమై ఉండడంతో సందడి వాతావరణం నెలకొంది.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఇస్రో చైర్మన్

పీఎస్ఎల్వీ-సీ 62 ప్రయోగం విజయవంతం కావాలని ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ శనివారం శాస్త్రవేత్తలతో కలిసి తిరుమల శ్రీవారిని, శ్రీకాళహస్తీశ్వర స్వామిని, సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రీవారి పాదాల చెంత ఉపగ్రహం నమూనాను ఉంచి పూజలు చేశారు. ఇస్రో చైర్మన్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు ప్రయోగించిన ఉపగ్రహాల్లో ఈవోఎస్-ఎన్ 1 అత్యంత అధునాతనమైదని, వాతావరణ మార్పులు, పర్యావరణ పరిశోధన నిమిత్తం దీనిని కక్ష్యలోకి పంపుతున్నామన్నారు. దీంతో పాటు పంపే మిగతా 15 ఉపగ్రహాలనూ ధ్రువ కక్ష్యలోకి రాకెట్ ప్రవేశపెడుతుందన్నారు. వీటిలో 8 విదేశీ ఉపగ్రహాలు ఉన్నాయని పేర్కొన్నారు. వీటితో భారత్ నుంచి ఇప్పటి వరకు ప్రయోగించిన విదేశీ ఉపగ్రహాల సంఖ్య 442కి చేరుతుందని తెలిపారు. ఇది 2026లో భారత్ చేపడుతున్న తొలి అంతరిక్ష ప్రయోగమని ఆయన చెప్పారు. పీఎస్ఎల్వీ శ్రేణిలో ఇది 64వ ప్రయోగంగా నిలవనుందన్నారు.



వేడుకలను ప్రారంభిస్తున్న రాజేశ్‌కుమార్, అమరావతి చాప్టర్ ప్రతినిధులు

కొత్త బిల్లుతో సరికొత్త ‘కార్పొరేట్ ప్రమాణాలు’

- విస్తృత సేవలు అందిస్తున్న ఐసీఎస్ఐ అమరావతి చాప్టర్
- 10వ ఫౌండేషన్ డే వేడుకల్లో వక్తల హర్షం

విజయవాడ అర్బన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ‘ఐసీఎస్ఐ అమరావతి చాప్టర్ పదేళ్లుగా విస్తృత స్థాయిలో సేవలు అందిస్తోందని చాప్టర్ చైర్మన్ సీఎస్ఎన్‌వీఎస్ నాగరాజు పేర్కొన్నారు. 2016లో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభమైన చాప్టర్ ఇప్పుడు పదేళ్లు పూర్తి చేసుకుందన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ) అమరావతి చాప్టర్ 10వ ఫౌండేషన్ డే వేడుకలు శనివారం విజయవాడలోని నిర్వహించారు. చాప్టర్ ప్రారంభమైన నాటి నుంచి నిర్వహించిన వృత్తి అభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు, సెమినార్లు, వర్క్‌షాపులు, విద్యార్థుల మార్గదర్శక కార్యక్రమాలు, కార్పొరేట్ రంగానికి అందించిన విలువైన సేవలను నాగరాజు వివరించారు. ఇటీవల ప్రతిపాదించిన కొత్త సెక్యూరిటీస్ మార్కెట్ కోడ్ బిల్లు 2025 బిల్లు అమలులోకి వస్తే కార్పొరేట్ అనుసరణ, గవర్నెన్స్ ప్రమాణాలు మరింత బలోపేతం అవుతాయని ఐసీఎస్ఐ ఉపాధ్యక్షుడు సీఎస్ ఆహ్లాద రావు తెలిపారు. కంపెనీ సెక్రటరీలు కంపెనీలకు మార్గదర్శకులుగా వ్యవహరిస్తున్నారని ముఖ్యఅతిథిగా హాజరైన హైకోర్టు న్యాయవాది గుండపు రాజేష్ కుమార్ అన్నారు. ఎంసీఏ వీ3 వంటి డిజిటల్ సంస్కరణల అమలులో కంపెనీలకు మార్గదర్శకులుగా కంపెనీ సెక్రటరీలు కీలకంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు.

పాడైన పరికరాలతో వైద్యమెలా?

- బోధనాస్పత్రుల్లో నిర్వహణ అస్తవ్యస్తం
- సకాలంలో మరమ్మతులు చేయని కంపెనీ
- వైద్యమంత్రికి, ఆ శాఖ కార్యదర్శికి సూపరింటెండెంట్ల ఫిర్యాదు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఆస్పత్రుల్లో వైద్య పరికరాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది! ఏ పరికరం ఎప్పుడు పని చేస్తుందో.. ఎప్పుడు మోరాయిస్తుందో.. పాడైతే వాటిని ఎప్పుడు బాగు చేస్తారో చెప్పలేని పరిస్థితి. వాస్తవానికి మరమ్మతుల కోసం ప్రభుత్వం నిర్వహణ కంపెనీకి రూ.కోట్లు చెల్లిస్తోంది. అయినా ఆశించిన స్థాయిలో వైద్య పరికరాల మరమ్మతులు జరగడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా 17 బోధనాసుపత్రుల్లోనూ ఇదే పరిస్థితి! ఈ నేపథ్యంలో పాడైన వైద్య పరికరాలతో వైద్యం చేసేదెలా? అని వైద్యులు నేరుగా సూపరింటెండెంట్లను ప్రశ్నిస్తున్నారు. దీంతో రెండేళ్ల నుంచి ఓపిక పట్టిన ఆస్పత్రుల సూపరింటెండెంట్లు తాజాగా శుక్రవారం జరిగిన ఉన్నతస్థాయి సమీక్షలో మంత్రి సత్యకుమార్‌కు, వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్‌కు సమస్యలను ఏకరువుపెట్టారు. ప్రభుత్వం నేరుగా వైద్య పరికరాల నిర్వహణ చేపట్టడం సాధ్యం కాదని ఒక ప్రయివేటు కంపెనీకి ఆ బాధ్యత అప్పగించింది. సదరు కంపెనీకి ప్రభుత్వం ఏటా రూ.65 కోట్ల వరకూ బిల్లులు చెల్లిస్తోంది. ఎంవోయూ నిబంధనల ప్రకారం.. పాడైన వైద్య పరికరాల సకాలంలో రిపేరు చేయలేని పక్షంలో వెంటనే మరో వైద్య పరికరాన్ని దాన్ని స్థానంలో ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ఆయా కంపెనీకి ఉంది. కంపెనీ ఆ పని కూడా సక్రమంగా చేయడం లేదని సూపరింటెండెంట్లు స్పష్టం చేశారు. ఏదైనా ఒక వైద్య పరికరాన్ని రిపేరు చేయాల్సి వస్తే, దాని స్థానంలో పని చేస్తున్న వైద్య పరికరాన్ని తెరిచి చూస్తున్నారంటూ నైపుణ్యం లేని బయో మెడికల్ ఇంజనీర్ల తీరును వివరించారు. ఈ విషయం విన్న ఉన్నతాధికారులు షాక్ అయ్యారు. వైద్య పరికరాల నిర్వహణపై మరో సమావేశంలో సుదీర్ఘంగా చర్చిద్దామని అధికారులు దాటవేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

ఆర్కే RK

జగన్ రెడ్డి ఆంతర్యం బయటపడింది కనుక అమరావతి ఆయువు అర్ధంతరంగా ముగియకూడదంటే... కూటమి ప్రభుత్వంపై గురుతర బాధ్యత ఉంది. వీలైనంత త్వరగా రాజధానిలో పౌర సౌకర్యాలు కల్పించడంతో పాటు నిర్మాణాలను పూర్తి చేయాలి. అమరావతిని ఆవాసయోగ్యంగా మార్చగలిగితే ఎవరు అధికారంలో ఉన్నా అభివృద్ధి దానంతటదే జరుగుతుంది. ప్రభుత్వ భవనాల నిర్మాణం పూర్తి చేయడం ఎంత ముఖ్యమో ఇళ్ల నిర్మాణం జరగడం కూడా అంతే ముఖ్యం. ఉపాధి అవకాశాలను మెరుగు పరచాలి. అప్పుడే జనసాంద్రత పెరుగుతుంది. జగన్ రెడ్డి మళ్లీ అధికారంలోకి అంటూ వస్తే, అమరావతి మళ్లీ కళ తప్పడం ఖాయం కనుక అటువంటి పరిస్థితి ఏర్పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఒక్క మాటలో చెప్పాలంటే జగన్ రెడ్డి వంటి వారు అధికారంలోకి వచ్చినా అమరావతిని రాజధానిగా కొనసాగించాల్సిన అనివార్యతను కల్పించాలి. కేవలం చట్టం చేసినంత మాత్రాన ముప్పు తొలగిపోదు.

అమరావతిపై అవే కుట్రలు!


'ముఖ్యమంత్రి ఎక్కడ కూర్చుంటే అదే సచివాలయం'... అధికారంలో ఉన్నప్పుడు తెలంగాణ ముఖ్యమంత్రిగా కేసీఆర్ అన్న మాట ఇది. 'ముఖ్యమంత్రి ఎక్కడ కూర్చుంటే అదే రాష్ట్ర రాజధాని అవుతుంది' ముఖ్యమంత్రిగానూ, మాజీ అయ్యాకా జగన్మోహన్ రెడ్డి అన్న మాట, అంటున్న మాట ఇదే! కేసీఆర్–జగన్‌ల మధ్య ఎన్నో సారూప్యతలు ఉన్నాయి. అందుకే కాబోలు ఇద్దరి మధ్య విడదీయలేని బంధం ఏర్పడింది. అదే సమయంలో ఆలోచనలు కూడా అదే విధంగా సాగుతున్నాయి. ఇరువురికీ మొదటి నుంచి ఉమ్మడి శత్రువు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే కనుక వారు ఒకే దృక్పథంతో వ్యవహరిస్తున్నారు. ముఖ్యమంత్రి సచివాలయానికి వెళ్లడం నామోషీగా కేసీఆర్ భావించగా, విభజిత ఆంధ్రప్రదేశ్‌కు రాజధానే అవసరం లేదని జగన్మోహన్ రెడ్డి భావిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎంతో మంది ముఖ్యమంత్రులుగా పనిచేశారు. వారందరూ విధుల నిర్వహణకు సచివాలయానికి వెళ్లేవారు. మంత్రివర్గ సమావేశాలు కూడా అక్కడే నిర్వహించేవారు. దేశంలోని ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా ఇదే విధానాన్ని అనుసరించారు. కేసీఆర్ ఒక్కరే సచివాలయం ఉనికిని గుర్తించడానికి ఇష్టపడలేదు. 'ప్రగతి భవన్' పేరిట ఖరీదైన భవనాన్ని నిర్మించుకొని అక్కడే నివాసం–కార్యాలయం ఏర్పాటు చేసుకున్నారు. అధికారిక సమావేశాలు, మంత్రివర్గ సమావేశాలు కూడా అక్కడే నిర్వహించేవారు. పాత సచివాలయ భవనాలను కూలగొట్టి ఆర్భాటంగా నూతన సచివాలయ భవనాన్ని నిర్మించినప్పటికీ అక్కడికి కూడా వెళ్లలేదు ఇలాంటి పోకడల వల్లనే రెండేళ్ల క్రితం జరిగిన శాసనసభ ఎన్నికల్లో కేసీఆర్ అధికారాన్ని కోల్పోయారు. 1989కి ముందు ముఖ్యమంత్రిగా ఉన్న ఎన్టీఆర్ తరచూ గండిపేట వద్ద నిర్మించుకున్న ఆశ్రమానికి వెళ్లేవారు. అప్పుడు దానిపై విమర్శలు వచ్చాయి. 2023 ఎన్నికలకు ముందు కేసీఆర్ కూడా ప్రగతి భవన్‌లో ఉండకుండా తన ఫాం హౌస్‌లో ఎక్కువగా గడిపేవారు. ఇలాంటి చర్యల వల్ల ఇరువురూ అధికారం కోల్పోయారు. ఇప్పుడు జగన్ రెడ్డి విషయానికి వద్దాం! 'ఏ రాష్ట్రానికైనా రాజధాని అవసరమా? రాజధాని అన్న పదం రాజ్యాంగంలో ఎక్కడుంది?' అని ఆయన తాజాగా ప్రశ్నిస్తున్నారు. అమరావతిని 'సోకాల్డ్' రాజధాని అని ఎద్దేవా చేశారు. విజయవాడ–గుంటూరు మధ్య కాకుండా నదీ పరీవాహక ప్రాంతంలో రాజధానిని నిర్మించడమేమిటని ప్రశ్నించారు. రాజ్యాంగంలో రాజధాని అన్న పదం ఉందా? లేదా? అన్న విషయం పక్కన పెడితే ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో రాజధాని అన్న పదం ఉంది కదా? ప్రపంచంలో రాజధాని లేని దేశం ఏదైనా ఉందా? మన దేశంలో రాజధాని లేని రాష్ట్రం ఏదైనా ఉందా? ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఉత్తరాఖండ్ వంటి కొత్తగా ఏర్పడిన రాష్ట్రాలకు కూడా రాజధానులు ఉన్నాయి కదా? ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే రాజధాని అవసరం లేదని జగన్ రెడ్డి ఎందుకు భావిస్తున్నారో తెలియదు. అధికారంలో ఉన్నప్పుడు మూడు రాజధానులు అని ప్రకటించారు. అది కార్యరూపం దాల్చక ముందే అధికారం కోల్పోయారు. తమ పార్టీ విధానం మూడు రాజధానులు అని ప్రకటించడంలో తప్పులేదు. 2019కి ముందు అసెంబ్లీ సాక్షిగా తాను కూడా బలపరిచిన అమరావతిపై ఆయనకు అంత ద్వేషం, పగ, అసూయ ఎందుకో? అన్నదే అంతు చిక్కని ప్రశ్న! రాజధాని అమరావతిపై తన మనసులోని ద్వేషాన్ని ఆయన గురువారం నాడు మరోమారు వెళ్లగక్కారు. ఆంధ్రప్రదేశ్‌కు అమరావతిని రాజధానిగా ప్రకటిస్తూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో బిల్లు పెట్టబోతోందన్న వార్తలు వస్తున్నాయి. బహుశా ఈ కారణంగా సదరు బిల్లును అడ్డుకోవడానికి... సందర్భం కాకపోయినా జగన్ రెడ్డి అమరావతిని వ్యతిరేకిస్తూ మాట్లాడి ఉండవచ్చు. రాష్ట్రం విడిపోయి పదకొండున్నర సంవత్సరాలు అయింది. ఇప్పటికీ రాజధాని విషయమై వివాదం కొనసాగడాన్ని మించిన విషాదం ఏముంటుంది?

నదులూ... నాగరికత..

రివర్ బేసిన్‌లో, అంటే నదీ పరీవాహక ప్రాంతంలో రాజధానిని నిర్మించడం ఏమిటి? అని జగన్ రెడ్డి తాజాగా ప్రశ్నిస్తున్నారు. నదులకు, నాగరికతకు మధ్య విడదీయరాని బంధం అనాదిగా ఉంది. నదులు ఉన్న చోటే నాగరికత వెల్లివిరిసింది. ప్రపంచంలో అనేక మహా నగరాలు నదీ తీరాలలోనే నిర్మితమయ్యాయి. అనేక నగరాల మధ్య నుంచి నదులు ప్రవహిస్తున్నాయి. అమెరికా ఆర్థిక రాజధానిగా పేరొందిన న్యూయార్క్ నగరం హడ్సన్ నదీ తీరం వెంబడి నిర్మితం కాలేదా? సీన్ నదీ తీరం వెంట ఫ్రాన్స్ రాజధాని ప్యారిస్, ఇంగ్లండ్ రాజధాని లండన్ నగరం థేమ్స్ నదీ తీరం వెంట, ఇటలీ రాజధాని రోమ్ నగరం టైబర్ నది వెంట, నైలు నదీ తీరంలో ఈజిప్టు రాజధాని కైరో, చైనాలోని షాంఘై నగరం యాంగ్జి నదీ తీరం వెంట నిర్మితమైనవే కదా? ఇలా చెప్పుకొంటూ పోతే ఎన్నో ఉదాహరణలు. నదుల వెంటే నాగరికత పరిఢవిల్లిన విషయం జగన్ రెడ్డికి తెలియదా? ప్రజలు ఎడారులను నివాస ప్రాంతాలుగా ఎంచుకోరు కదా? నీరున్న చోటే నివాసాలు ఏర్పాటు చేసుకుంటారు. వ్యవసాయం చేస్తుంటారు. ఎడారి దేశాలు కూడా డీ శాలినేషన్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకొని నీటి అవసరాలు తీర్చుకుంటున్నాయి కదా! తరచుగా లండన్ వెళ్లే జగన్ రెడ్డి అక్కడ థేమ్స్ నదిని చూసే ఉంటారు కదా? ఇంతెందుకు, గోల్కొండ నవాబులు హైదరాబాద్ నగరాన్ని మూసీ నది ఒడ్డునే నిర్మించారు కదా? మూసీ నది ఇప్పుడు మురికి కూపంగా మారి ఉండవచ్చునుగానీ, ఒకప్పుడు ఆ నదికి వరదలు వచ్చేవి కదా? మూసీ ప్రక్షాళనకు ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది కదా?

జగన్ రెడ్డి.. నాడూ నేడూ

అమరావతి గురించి ఇప్పుడు అవాకులు చెవాకులు పేలుతున్న జగన్ రెడ్డి 2019కి ముందు ఏం చెప్పారో ఒకసారి గుర్తుచేసుకుందాం. తాగునీటి అవసరాలు తీరడానికి రాజధాని నదీ తీరంలో నిర్మించాలని చెప్పలేదా? రాష్ట్రానికి మధ్యలో రాజధాని ఉండాలని, కనీసం 30 వేల ఎకరాల భూమి ఉండాలని, అమరావతిని రాజధానిగా ప్రకటించినందున తాను కూడా తాడేపల్లిలో ఇల్లు నిర్మించుకున్నానని చెప్పలేదా? అదే పెద్దమనిషి 2019లో అధికారంలోకి రాగానే రాజధానిని ఒక కులం వారి కోసమే కడుతున్నారని నిందలు వేయడమే కాకుండా మూడు రాజధానుల అంశాన్ని తెర మీదకు తెచ్చారు. అమరావతిని శ్మశానంతో, ఎడారితో పోల్చారు. భూములు ఇచ్చిన రైతులను అనేక విధాలుగా వేధించి అవమానాలకు గురిచేశారు. ఇప్పుడు రివర్ బేసిన్ అనే కొత్త రాగం అందుకున్నారు. అమరావతి విషయంలో ఆయన బాధ ఏమిటో తెలియదు. అమరావతి ప్రాంతంలో ఇప్పుడు ఒక్క కులానికి చెందిన వారే ఎక్కువగా ఉన్నారని అనుకుందాం. అక్కడ రాజధాని ఏర్పడితే ఇప్పుడు హైదరాబాద్‌లో వలె దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు ఉద్యోగాలు, వ్యాపారాలకోసం వచ్చి స్థిరపడిపోతారు. అప్పుడు భూమి పుత్రులు మైనారిటీలు అయిపోతారు. భూమి కూడా చేతులు మారుతుంది. ఒకప్పుడు హైదరాబాద్‌లో అధిక శాతం భూమి ముస్లింల ఆధీనంలో ఉండేది. హైదరాబాద్ విస్తరణతోపాటు భూమి కూడా చేతులు మారింది. ఇంకా చెప్పాలంటే, హైదరాబాద్‌లోని భూమి పుత్రులు అస్తిత్వం కోసం పోరాడాల్సిన పరిస్థితి. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారే ధనికులయ్యారు. ముస్లింలు సంఖ్యాపరంగా గణనీయంగా ఉన్నప్పటికీ సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిపోయారు. ఇప్పుడు హైదరాబాద్ అసలు సిసలైన కాస్మోపాలిటన్ నగరం. ఈ కారణంగానే హైదరాబాద్‌లో మత కలహాలు కూడా మటుమాయమయ్యాయి. హైదరాబాద్‌కు ఇప్పుడు ఉన్న విశిష్టత దక్షిణాదిన మరే నగరానికీ లేదు. అంతా సవ్యంగా సాగితే అమరావతి కూడా హైదరాబాద్ అంత కాకపోయినా ఒక పెద్ద నగరంగా అభివృద్ధి చెందుతుంది. అప్పుడు కులాల కుంపట్లు కూడా ఆరిపోతాయి. సంకుచిత భావజాలం కూడా నశిస్తుంది. బయటి ప్రాంతాల వారి సంఖ్య పెరిగే కొద్దీ స్థానికుల ఆధిపత్యం పోతుంది. జగన్ రెడ్డి ద్వేషించే ఆ కులం వారి ఆధిపత్యం కూడా పోతుంది. అభివృద్ధితో పాటు సామాజికంగా వచ్చే మార్పులు ఏమిటో జగన్ రెడ్డికి తెలియవా? అయినా ఐదేళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి ఇంత సంకుచితంగా ఎలా వ్యవహరించగలరన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా ఉంటోంది. స్థానిక విలేకరులతో మాట్లాడిన తర్వాత జగన్ రెడ్డి జాతీయ మీడియా ప్రతినిధులతో ప్రత్యేకంగా ఆంగ్లంలో మాట్లాడారు. అంటే, తాను అమరావతిని రాజధానిగా వ్యతిరేకిస్తున్నానని ఢిల్లీ స్థాయిలో చెప్పాలన్నది ఆయన ఉద్దేశం. రివర్ బేసిన్‌లో రాజధాని నిర్మించకుండా అవసరమైతే సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలని కూడా ఆయన అన్నారు. దీన్నిబట్టి అమరావతి నిర్మాణాన్ని ఏదో ఒక విధంగా అడ్డుకోవాలన్న కృతనిశ్చయంతో ఆయన ఉన్నట్టు అర్థమవుతోంది. అసూయా ద్వేషాలు ఎంతటి వారినైనా దహించి వేస్తాయి. బహిరంగంగా చెప్పుకోలేని కారణాలతో జగన్ రెడ్డి అంతర్గతంగా దహించుకుపోతున్నారు. అందుకే రాష్ట్ర శాశ్వత రాజధానిగా అమరావతిని ప్రకటించకుండా అడ్డుకొనే ప్రయత్నాలకు తెర లేపారు. అందులో భాగంగానే రివర్ బేసిన్ అనే వాదాన్ని తెరమీదకు తెచ్చారు. తమాషా ఏమిటంటే, రాజధాని అమరావతిపై జగన్ రెడ్డి నోటి వెంట వెలువడిన విష గుళికలు ఆయన సొంత మీడియాలో ఎక్కడా కనిపించలేదు. వింతల్లోకెల్లా వింత ఇది. జగన్ ఏమి మాట్లాడినా ఆయన షిక్కటి షిరునవ్వులు చిందించే ఫొటో



పెట్టి తాటికాయంత అక్షరాలతో ప్రచురించే, ప్రసారం చేసే నీలి మీడియా, కూలి మీడియా కూడా మౌనం వహించడం ఆశ్చర్యంగా ఉంది. అంటే, అమరావతిపై జగన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు వారికే రోతగా అనిపించాయా? జగన్ రెడ్డి తొందరపడి నోరు జారారని భావించారా? లేక ఆయన వ్యాఖ్యల వల్ల రాజకీయంగా నష్టం జరుగుతుందని భావించారా? ఇంతకు మించిన నిగూఢ రహస్యం ఏమైనా ఉందా? మొత్తం మీద జగన్ రెడ్డి అమరావతి మీద కక్కిన విషాన్ని కప్పి పెట్టాలని చూశారు. అయితే, రెండు మూడు మీడియా సంస్థలు అనుకున్నంత మాత్రాన వాస్తవాలను దాచిపెట్టే పరిస్థితులు ఇప్పుడు లేవు. రాజధానిపై జగన్ రెడ్డి కడుపులో ఎంత విద్వేషం ఉందో ప్రజలందరికీ తెలిసిపోయింది. అందుకే కాబోలు అమరావతిపై జగన్ అన్న మాటలను వక్రీకరించారని పేర్ని నానితో చెప్పించే ప్రయత్నం చేశారు. ఇది కూడా వికటించింది. జగన్ నోటి వెంట వెలువడిన మాటలను కళ్లారా చూసి చెవులారా విన్న ప్రజలు పేర్ని నాని వంటి వారి వక్రభాష్యాలను నమ్మే పరిస్థితిలో లేరు.

మారని బుద్ధి...

పదకొండున్నర సంవత్సరాల తర్వాత రాజధానిని చర్చనీయాంశం చేయాలనుకోవడమే విషాదం. కపట నాటక సూత్రధారి అయిన జగన్ రెడ్డి తొందరపడ్డారని ఆయన పార్టీ నాయకులు తలలు పట్టుకుంటూ ఉండవచ్చునుగానీ ఆయన బుద్ధి మారలేదని మరోమారు రుజువైంది. అమరావతి విషయంలో సజ్జల రామకృష్ణా రెడ్డి వంటి వారు ఎన్ని కవరింగ్ కబుర్లు చెప్పినా జగన్ రెడ్డి మనసులో ఏముందో తేలిపోయింది. కూటమి ప్రభుత్వం తప్పుల మీద తప్పులు చేసి 2029లో జగన్ రెడ్డికి మళ్లీ అధికారం దక్కే పరిస్థితి కల్పిస్తే అమరావతికి ఆయువు మూడుతుందని స్పష్టమవుతోంది. రాష్ట్రానికి శాశ్వత రాజధానిగా అమరావతిని ప్రకటిస్తూ పార్లమెంటులో చట్టం చేసినా జగన్ రెడ్డి అంటూ అధికారంలోకి వస్తే ఆ చట్టాన్ని చుట్టచుట్టి మూలన పడేస్తారు.

> **తెలంగాణకు అన్యాయం జరుగుతోందని కేసీఆర్ అండ్ కో విమర్శించడం మొదలుపెట్టగానే, ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరుగుతోందని జగన్ అండ్ కో అందుకుంటారు. ఏకకాలంలో రెండు రాష్ట్రాలకు అన్యాయం ఎలా జరుగుతుంది? అలా అయితే లాభ పడుతోంది ఎవరు? ఇదంతా గమనిస్తే, వారెవ్వా ఏమి రాజకీయం! అనిపిస్తుండవచ్చునుగానీ తెలుగునాట రాజకీయాలు మునుముందు మరింత వికృతంగా మారవచ్చు. తస్మాత్ జాగ్రత్త!**

అమరావతి ఉసురు తీయడానికి ఆయన మళ్లీ సిద్ధపడతారు. ఇందులో సందేహం లేదు. గత ఎన్నికల్లో పదకొండు సీట్లకే పరిమితమైనప్పటికీ రాజధాని విషయంలో ఆయన వైఖరి మారలేదని ఇప్పుడు స్పష్టమైంది. రాజకీయంగా నష్టం జరుగుతుందని పార్టీ నాయకులు ఆయన మాటలకు ప్రచారం కల్పించకుండా నీలి, కూలి మీడియాను కట్టడి చేసి ఉంటే చేసి వుండొచ్చు. అధికారం అంటూ వస్తే జగన్ రెడ్డి మనసు మార్చగలరా? 'బాషా ఒక్కసారి చెబితే వందసార్లు చెప్పినట్టు' అన్న సినిమా డైలాగు మాదిరిగా జగన్ రెడ్డి ఒకసారి అనుకుంటే దానికి తిరుగుండదని ఆ పార్టీ వారే చెబుతారు. ముఖ్యమంత్రి ఎక్కడ కూర్చుంటే అదే రాజధాని అవుతుందని చెప్పడంలోనే ఆయన ఆలోచనలు ఏ దిశగా సాగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. వివిధ దేశాలను పాలించిన అధ్యక్షులు, ప్రధానులకు బుద్ధి, జ్ఞానం లేనందునే వారు రాజధానులను నిర్మించారనుకోవాలా? ఇప్పటి వరకు ముఖ్యమంత్రులుగా పనిచేసిన వారికి కూడా ఇంగితం లేనందునే రాజధానులను నిర్మించారా? అభివృద్ధి చేశారా? రాచరిక వ్యవస్థలో కూడా రాజధానులు ఉన్నాయి కదా? రాజులు ఎవరూ అంతఃపురాలకే పరిమితమై పాలించలేదు కదా? పాలనా వ్యవహారాల పర్యవేక్షణతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి దర్బారు హాళ్లకు వచ్చేవారు కదా? రాజధాని అవసరమే లేదని చెబుతున్న జగన్ రెడ్డి... ముఖ్యమంత్రి చంద్రబాబుకు బుద్ధీ జ్ఞానం లేవని అనడమంటే, అంతకు మించిన తెంపరితనం ఉంటుందా? ఆంధ్రప్రదేశ్ ప్రజలంటే జగన్‌కు ఎంత చులకన భావం ఉందో రాజధానిపై ఆయన అన్న మాటలతో స్పష్టమవుతోంది.

> **అమరావతి నిర్మాణాన్ని ఏదో ఒక విధంగా అడ్డుకోవాలన్న కృతనిశ్చయంతో జగన్‌రెడ్డి ఉన్నట్టు అర్థమవుతోంది. బహిరంగంగా చెప్పుకోలేని కారణాలతో జగన్ రెడ్డి అంతర్గతంగా దహించుకుపోతున్నారు. అందుకే రాష్ట్ర శాశ్వత రాజధానిగా అమరావతిని ప్రకటించకుండా అడ్డుకొనే ప్రయత్నాలకు తెర లేపారు. అందులో భాగంగానే రివర్ బేసిన్ అనే వాదాన్ని తెరమీదకు తెచ్చారు. తమాషా ఏమిటంటే, రాజధాని అమరావతిపై జగన్ రెడ్డి నోటి వెంట వెలువడిన విష గుళికలు ఆయన సొంత మీడియాలో ఎక్కడా కనిపించలేదు. నీలి మీడియా, కూలి మీడియా కూడా మౌనం వహించడం ఆశ్చర్యంగా ఉంది. అంటే, అమరావతిపై జగన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు వారికే రోతగా అనిపించాయా? జగన్ రెడ్డి తొందరపడి నోరు జారారని భావించారా? లేక ఆయన వ్యాఖ్యల వల్ల రాజకీయంగా నష్టం జరుగుతుందని భావించారా? మొత్తం మీద జగన్ రెడ్డి అమరావతి మీద కక్కిన విషాన్ని కప్పి పెట్టాలని చూశారు. అయితే, రెండు మూడు మీడియా సంస్థలు అనుకున్నంత మాత్రాన వాస్తవాలను దాచిపెట్టే పరిస్థితులు ఇప్పుడు లేవు. రాజధానిపై జగన్ రెడ్డి కడుపులో ఎంత విద్వేషం ఉందో ప్రజలందరికీ తెలిసిపోయింది.**

పనులు పరుగులు తీయించాలి...

అమరావతిని అద్భుతమైన నగరంగా నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కలలు కంటున్నారు. మయసభను నిర్మించిన విశ్వకర్మగా పేరొందాలని ఆయన భావిస్తూ ఉండవచ్చు. అదే సమయంలో అమరావతి ఆయువు తీసే అవకాశం కోసం

జగన్ రెడ్డి ఎదురుచూస్తున్నారు. ఈ ఇరువురిలో ఎవరు విజయం సాధిస్తారన్నది కాలమే నిర్ణయిస్తుంది. ఇప్పుడు చంద్రబాబు అధికారంలో ఉన్నారు. ఆయన అధికారానికి ఇంకో మూడున్నరేళ్ల వ్యవధి ఉంది. ఇప్పుడు జగన్ రెడ్డి ఆంతర్యం బయటపడింది కనుక అమరావతి ఆయువు అర్ధంతరంగా ముగియకూడదంటే... కూటమి ప్రభుత్వంపై గురుతర బాధ్యత ఉంది. ఒట్టి మాటలు కట్టిపెట్టి గట్టి మేలు తలపెట్టవోయ్ అన్న గురజాడ మాటలను గుర్తుకు తెచ్చుకొని కూటమి ప్రభుత్వం అమరావతిలో నిర్మాణాల వేగాన్ని పెంచాలి. వీలైనంత త్వరగా రాజధానిలో పౌర సౌకర్యాలు కల్పించడంతో పాటు నిర్మాణాలను పూర్తి చేయాలి. అమరావతిని ఆవాసయోగ్యంగా మార్చగలిగితే ఎవరు అధికారంలో ఉన్నా అభివృద్ధి దానంతటదే జరుగుతుంది. ప్రభుత్వ భవనాల నిర్మాణం పూర్తి చేయడం ఎంత ముఖ్యమో ఇళ్ల నిర్మాణం జరగడం కూడా అంతే ముఖ్యం. రాజధాని అంటే కార్యాలయాలు మాత్రమే కాదు, ప్రజలతో కళకళలాడాలి. ఇందుకోసం ఇళ్ల నిర్మాణాలను ప్రోత్సహించాలి. ఆవాస ప్రాంతాలలో పౌర సౌకర్యాల కల్పనకు ప్రాముఖ్యతను ఇవ్వాలి. ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలి. అప్పుడే జనసాంద్రత పెరుగుతుంది. జగన్ రెడ్డి మళ్లీ అధికారంలోకి అంటూ వస్తే, అమరావతి మళ్లీ కళ తప్పడం ఖాయం కనుక అటువంటి పరిస్థితి ఏర్పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపైనే ఉంది. ఒక్క మాటలో చెప్పాలంటే జగన్ రెడ్డి వంటి వారు అధికారంలోకి వచ్చినా అమరావతిని రాజధానిగా కొనసాగించాల్సిన అనివార్యతను కల్పించాలి. కేవలం చట్టం చేసినంత మాత్రాన ముప్పు తొలగిపోదు. మారీచులు, సుబాహులు ఏ కాలంలోనైనా ఉంటారు. ఇది ప్రజాస్వామ్య యుగం కనుక ప్రజలను అర్ధసత్యాలు, అసత్యాలతో మభ్యపెట్టవచ్చు. దుష్ప్రచారాలతో తప్పుదారి పట్టించవచ్చు.

అటు జగన్... ఇటు కేసీఆర్

ఆంధ్రప్రదేశ్ సమాజంలో విద్వేషాలు రగిలించడానికి పెద్దగా శ్రమ పడాల్సిన అవసరం లేదు. తెలంగాణ–ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రస్తుతం నడుస్తున్న జల వివాదమే తీసుకుందాం. రాయలసీమ ఎత్తిపోతల పథకం ప్రారంభమైనది జగన్ రెడ్డి హయాంలోనే అన్నది ఎంత నిజమో, ఆగిపోయింది కూడా ఆయన హయాంలోనే అన్నది అంతే నిజం. అయినా ఈ పథకాన్ని చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఆపేశారని ఏమాత్రం వెరపు లేకుండా జగన్ రెడ్డి ఆరోపించారు. జగన్ రోత మీడియాలో ఆంధ్రప్రదేశ్ ద్రోహిగా చంద్రబాబును చిత్రీకరిస్తుండగా, తెలంగాణలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సొంత మీడియాలో చంద్రబాబును నీటి దొంగగా, తెలంగాణ ద్రోహిగా చిత్రీకరిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు అక్రమంగా నీటిని తరలించుకుపోవడం ద్వారా చంద్రబాబు తెలంగాణకు ద్రోహం చేస్తున్నారని తాటికాయంత అక్షరాలతో ప్రచురిస్తున్నారు. ఈ ఇరువురు నాయకుల సొంత మీడియాలో చేస్తున్న ప్రచారంలో ఏది నిజం? ప్రజలు ఎవరు చెప్పేదాన్ని నమ్మాలి? కేసీఆర్ మీడియా ప్రకారం స్వరాష్ట్రం కోసం చంద్రబాబు జల చౌర్యానికి పాల్పడుతున్నారు. జగన్ మీడియా ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు ద్రోహం చేస్తూ తెలంగాణకు చంద్రబాబు మేలు చేస్తున్నారు. తమ రాజకీయ ప్రయోజనాల కోసమే వారు అలాంటి కథనాలను వండి వారుస్తున్నారన్నది ప్రజలు అర్థం చేసుకోలేకపోతే పరిస్థితి ఏమిటి? నీళ్ల పంచాయితీ అన్నది సున్నితమైన అంశం. చంద్రబాబు అయినా, రేవంత్ రెడ్డి అయినా– ఆ మాటకొస్తే కేసీఆర్, జగన్ రెడ్డి కూడా తమ స్వరాష్ట్రాల ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించలేరు. ఎంతటి జటిలమైన సమస్యనైనా చర్చల ద్వారా పరిష్కరించుకోవచ్చు. జల వివాదాలపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు శుక్రవారం నాడు చేసిన ప్రకటనలు హుందాగా ఉన్నాయి. వివాదం పరిష్కారం కాకూడదన్న కోరిక కేసీఆర్, జగన్ రెడ్డిలకు ఉండవచ్చునుగానీ వారికి ఆ అవకాశం ఇవ్వకుండా సంయమనంతో వ్యవహరించవలసిన బాధ్యత చంద్రబాబు–రేవంత్‌పై ఉంది. లేని వివాదాలు తెర మీదకు వస్తున్నాయి. ఎన్నికలు సమీపించే కొద్దీ ఇలాంటివి మరికొన్నింటిని తెరమీదకు తెస్తారు. ఎవరి రాజకీయం వారిది. ప్రజల్లో భావోద్వేగాలను రెచ్చగొట్టగలిగినప్పుడే కదా రాజకీయ నాయకులు తమ పబ్బం గడుపుకోగలిగేది. తెలంగాణ ప్రజలు నీళ్లతో త్వరగా కనెక్టవుతారు. అందుకే కేసీఆర్ అండ్ కో జల వివాదాన్ని తెర మీదకు తెచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలను కులాల వారీగా విభజించడం తేలిక కనుక జగన్ రెడ్డి మళ్లీ అమరావతిపై నోరు పారేసుకున్నారు. పనిలో పనిగా రాయలసీమ ప్రజలను రెచ్చగొట్టడానికి తన హయాంలో నిలిచిపోయిన రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని చంద్రబాబు ఆపారని ప్రచారం చేస్తున్నారు. ఎప్పుడో నిలిచిపోయిన ఈ పథకం గురించి కేసీఆర్ అండ్ కో ఇప్పుడు పెడబొబ్బలు పెడుతున్నారు. తెలంగాణకు అన్యాయం జరుగుతోందని కేసీఆర్ అండ్ కో విమర్శించడం మొదలుపెట్టగానే, ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరుగుతోందని జగన్ అండ్ కో అందుకుంటారు. ఏకకాలంలో రెండు రాష్ట్రాలకు అన్యాయం ఎలా జరుగుతుంది? అలా అయితే లాభ పడుతోంది ఎవరు? ఇదంతా గమనిస్తే, వారెవ్వా ఏమి రాజకీయం! అనిపిస్తుండవచ్చునుగానీ తెలుగునాట రాజకీయాలు మునుముందు మరింత వికృతంగా మారవచ్చు. తస్మాత్ జాగ్రత్త! పెట్టుబడులు పెట్టే వారిని చంద్రబాబు నాయుడు ఏ స్థాయిలో ఆదరించి గౌరవిస్తారో అందరికీ తెలిసిందే. ఈ విషయంలో చంద్రబాబును తీవ్రంగా వ్యతిరేకించేవారు కూడా విమర్శించలేరు. కానీ జగన్ రెడ్డి మాత్రం చంద్రబాబు పారిశ్రామికవేత్తలను పారిపోయేలా భయపెడుతున్నారని అభాండాలు వేశారు. దీన్నిబట్టి కూటమి ప్రభుత్వంపై మునుముందు ఏ స్థాయిలో దుష్ప్రచారం చేయబోతున్నారో అర్థం చేసుకోవచ్చు. ఈ క్రమంలో అమరావతిపై జగన్ అన్న మాటలు శాంపిల్ మాత్రమే! అయితే, ప్రజల విజ్ఞతను తక్కువ అంచనా వేయకూడదని ఉభయ తెలుగు రాష్ట్రాలలో గత శాసనసభ ఎన్నికలు రుజువు చేశాయి. ప్రస్తుతానికి ఇదే ఉపశమనం. సంఘం శరణం గచ్ఛామి అని బుద్ధుని బోధనలను గుర్తుచేసుకుందాం!


జీవితాన్ని శాసించిన అక్షర యోధుడు

ప్రపంచ సాహిత్యంలో ప్రత్యేక స్థానం కలిగిన విలక్షణ రచయిత జాక్ లండన్. లెక్కలేనన్ని సార్లు పడి లేచిన ప్రవాహ కెరటం అతడి జీవితం. ఎన్నో ఎదురుదెబ్బలు తిని కూడా పట్టు విడవని మొండి పంతం అతడి సొంతం. బతుకు విసిరిన సవాళ్లపై సవారీ చేసి, ఆ సంఘర్షణలని అక్షరీకరించిన అరుదైన రచయిత. బాల్యం నుంచి భరించిన కష్టాలతోనే పుస్తక రచనలు చేసిన విశిష్ట వ్యక్తి. అసంఖ్యాక అనుభవాల సముద్రాన్ని ఆత్మవిశ్వాసమనే ధైర్యంతో ఒంటరిగానే ఈదిన సాహసి.

1876, జనవరి 12న అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో జాన్ గ్రిఫిత్ చానీ (జాక్ లండన్) జన్మించాడు. బాల్యంలో ఒక్క డాలరు కోసం తిండి లేకుండా ఒళ్ళు హూనం చేసుకుని రోజంతా పని చేసిన జాక్, ఆ తర్వాత రోజుకు వేల డాలర్లు సంపాదించే స్థాయికి చేరాడు. బాల కార్మికుడిగా, రోజువారీ వేతన కూలీగా, సముద్రపు దొంగగా, ఆకతాయిగా, బొగ్గుగని పనివాడిగా, జ్యూట్ మిల్లు కార్మికునిగా, మంచుకొండల్లో బంగారపు గని శ్రామికుడిగా, నావికుడిగా, పాత్రికేయుడిగా, ప్రజాపక్ష ఉద్యమకారుడిగా, జంతు ప్రేమికుడిగా ఎన్నో అవతారాలు ఎత్తాడు. కాలిఫోర్నియా యూనివర్సిటీలో విద్యార్థిగా ప్రవేశించినా ఎక్కువ కాలం ఉండలేదు. పద్దెనిమిదేళ్లకే జైలు పాలయ్యాడు.

యుద్ధ విలేఖరిగా పని చేస్తున్నపుడు పలుమార్లు అరెస్టయ్యాడు. జపాన్ సైన్యం కూడా ఓసారి అదుపులోకి తీసుకుంది. ఇలా ఎన్నో ఎదురుదెబ్బలు తిన్నాడు. ఇన్నింటిలోకి అతడు నిరంతరం కొనసాగించిన వ్యసనం రచనా వ్యాసంగం. రోజుకి వెయ్యి పదాలకి తగ్గకుండా తన జీవన ప్రస్థానానికి కాల్పనికత జోడించి గుప్పించిన జాక్ లండన్ రచనలన్నీ దట్టించిన మందుగుండులా పేలాయి. అతడిని తిరుగులేని మహా రచయితను చేశాయి. ముప్పై ఏళ్ళకే ప్రపంచ వ్యాప్తంగా రచయితగా గుర్తింపు పొందాడు. వందేళ్ల క్రితమే అక్షరాలా ఇరవై ఐదు వేల డాలర్లు పుచ్చుకుని పత్రికలకి వ్యాసాలు రాసి, అమెరికా లోనే అత్యంత ఖరీదైన రచయితగా ఎదిగాడు. రచనకి కాకుండా రాసిన పదానికి ఇంత పారితోషికమని డిమాండ్ చేసిన ఏకైక వ్యక్తి ఆయన. అంతర్జాతీయ స్థాయిలో సెలబ్రిటీ హోదాను పొందిన తొలి అమెరికన్ రచయితగా ఎర్నెస్ట్ హెమ్మింగ్వే నుంచి జాన్ స్టెయిన్ బ్యాక్ వరకూ, అప్టన్ సింక్లైర్ మొదలుకొని జార్జ్ ఆర్వెల్ దాకా ఎందరో మేధావుల్నీ ప్రభావితం చేశాడు. బడా కార్పొరేట్ కంపెనీలు సైతం వ్యాపార ప్రకటనలతో జాక్ ఆకర్షణను సొమ్ము చేసుకున్నాయి.

జీవితాన్ని గాఢంగా కాచి వడబోసిన జాక్ లండన్, స్పష్టంగా తాను సోషలిస్టునని ప్రకటించాడు. 'హౌ ఐ బికం సోషలిస్ట్?' (నేనెలా సామ్యవాదిని అయ్యాను) అనే వ్యాసంలో జీవితమే తనను సోషలిస్టుగా మలిచిందని రాశాడు. ద కాల్ ఆఫ్ ది వైల్డ్ (ప్రకృతి పిలుపు), ద ఐరన్ హీల్ (ఉక్కుపాదం), వైట్ ఫాంగ్, టు బిల్డ్ ఎ ఫైర్, లవ్ ఆఫ్ లైఫ్, సీ వోల్ఫ్ వంటి రోమాంచిత నవలలే కాకుండా అనేక కథలు, కవితలు, ఆత్మ కథాత్మక రచనలు... మొత్తం 300 వరకూ చేశాడు. సాహితీ చరిత్రలో మొదటిసారిగా సైన్స్ ఫిక్షన్ రాశాడు. ఒక దశలో జాక్ రచనలని సినిమాలుగా రూపొందించడానికి పోటీ పడే స్థితి నెలకొంది. వాటిల్లో కొన్ని చిత్రాలకి అతడే స్వయంగా స్క్రీన్ ప్లే కూడా రాశాడు.




అలా అహర్నిశలు కష్టపడి సంపాదించిన డబ్బుతో సోనోమా లోయలో పరవశింప చేసే ప్రకృతి ఒడిలో ఏకంగా పద్నాలుగు వందల ఎకరాలలో వ్యవసాయ క్షేత్రం నిర్మించాడు. అక్కడే వందలాది నిపుణుల పర్యవేక్షణలో ఇల్లు కట్టుకున్నాడు. ఆ కళాత్మక కలల సౌధానికి 'వోల్ఫ్ హౌస్' అని పేరు పెట్టుకున్నాడు. మర్నాడు గృహప్రవేశం అనగా, ఆ భవనంలో అగ్ని ప్రమాదం జరిగింది. ప్రమాదం నుంచి బయటపడ్డ జాక్ కృంగిపోలేదు. పైగా అక్కడే రెట్టించిన ఉత్సాహంతో చివరి వరకూ జీవించాడు. అసలు నిరాశ అనే పదం అతడి జీవితంలో లేనే లేదు. అందుకే మద్యపానానికి బానిసై, అనారోగ్యం వెంటాడి వేధిస్తున్నా సరే, కాలానికి ఎదురీదాడే కానీ ఎన్నడూ వెన్ను చూపలేదు. రెండు సార్లు వివాహం చేసుకున్నాడు. వైవాహిక జీవితంలో కూడా అనేక ఒడిదుడుకులు ఎదుర్కొన్నాడు. జీవితాంతం అలుపెరుగని చైతన్యంతో అద్వితీయ సాహిత్యాన్ని సృష్టించిన జాక్ లండన్, 1916, నవంబర్ 22న అనారోగ్యంతో మరణించాడు. అతడి జీవితం లాగానే మరణం కూడా వివాదాస్పదమైంది.

తదనంతర కాలంలో అతడి వ్యవసాయ క్షేత్రంలో కొంత భాగాన్ని అమెరికా ప్రభుత్వం కొనుగోలు చేసింది. అక్కడే అతడి స్మృతిలో, 'జాక్ లండన్ స్టేట్ హిస్టారిక్ పార్క్' అభివృద్ధి చేసింది. కాలి బూడిదైన జాక్ లండన్ ఇంటి శిథిలాలు, అతడి సమాధితో పాటు అక్కడే ఉన్నాయి. తదనంతరం కూడా అతడి భార్య, పిల్లలతో పాటు ఎందరో పరిశోధకులు జాక్ జీవితం, కృషి గురించి ఎన్నో పరిశోధనాత్మక, కాల్పనిక రచనలు చేశారు. తెలుగులో కూడా ఆయన రచనలు అనువాదం అయ్యాయి. కొడవటిగంటి కుటుంబరావు తదితరులు అతడి రచనల్ని తెలుగులో పరిచయం చేశారు. అలా అతి తక్కువ కాలంలో దేశదేశాల్లోని ఆలోచనాపరులను తన అక్షరాలతో ప్రభావితం చేసిన యువ రచయిత మరొకరు లేరు. దాదాపు అన్ని ప్రపంచ భాషల్లోకి జాక్ రచనలు అనువాదం అయ్యాయి. రాహుల్ సాంకృత్యాయన్, మాక్సిం గోర్కీ వంటి వారితో మాత్రమే పోల్చదగ్గ రచయిత జాక్ లండన్. అవిశ్రాంతంగా సాగిన జీవనయానంలో అతడు ఎన్ని పాత్రలు పోషించినా అంతిమంగా మానవీయ యాత్రికుడిగా, సామ్యవాద స్వాప్నికుడిగానే మిగిలాడు. ఒకచోట అతడు అన్న మాటలే బహుశా మానవాళికి ఆయన ఇచ్చిన ఆత్మీయ సందేశం కావొచ్చు. అది–

"నేను మట్టి కావడం కంటే బూడిద కావడానికే ఇష్టపడతాను. కుళ్లి, కృశించి, నశించడానికి బదులు నాలోని ప్రతి అణువూ భగభగ మండే మంటల్లో ఆహుతి కావాలని అనుకుంటాను. మందకొడిగా ఒక శాశ్వతమైన గ్రహంగా ఉండటం కంటే, దేదీప్యమానంగా వెలిగి పతనమయ్యే అద్భుతమైన ఉల్కగా మారాలని అనుకుంటాను. మనిషన్నవాడు జీవించాలి, బతుకీడ్చడం కాదు!"


• గౌరవ్

(జనవరి 12: జాక్ లండన్ 150వ జయంతి)



జనాభా లెక్కలకు ఏర్పాట్లు

- కార్యనిర్వాహక అధికారుల నియామకం
- ప్రిన్సిపల్, అడిషనల్ సెన్సస్ అధికారులుగా కలెక్టర్, జేసీ
- జిల్లా అధికారిగా డీఆర్‌వో.. సబ్ డివిజన్ స్థాయిలో ఆర్డీవో



గుంటూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వివిధ కారణాలతో వాయిదా పడిన జనాభా లెక్కలపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఎట్టకేలకు 2027 జనాభా లెక్కల నిర్వహణకు నిర్ణయించింది. ఇందుకోసం వివిధ స్థాయిలో అధికారులను నియమిస్తూ శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. దీంతో కొన్ని నెలల పాటు జనాభా లెక్కలు గ్రామాల్లో, పట్టణ ప్రాంతాల్లో జరగనున్నాయి. చివరిసారిగా 2011లో జనాభా లెక్కలు జరిగాయి. 2021కి ముందే జరగాల్సిన జనాభా లెక్కలు ఎన్‌పీఆర్, సీఏఏ వంటి చట్టాలపై ఆందోళనలతో వాయిదా పడుతూ వచ్చాయి. ఇప్పుడు పరిస్థితులు సద్దుమణిగిన రీత్యా జనాభా లెక్కలను (మిగతా 8వ పేజీలో)

జిల్లా స్థాయి కార్య నిర్వాహక బృందం

జిల్లా స్థాయిలో కలెక్టర్ ప్రిన్సిపల్ సెన్సస్ అధికారిగా, జాయింట్ కలెక్టర్ అదనపు ప్రిన్సిపల్ సెన్సస్ అధికారిగా, జిల్లా రెవెన్యూ అధికారి డిస్ట్రిక్ట్ సెన్సస్ అధికారిగా వ్యవహరిస్తారు. అలానే అదనపు సెన్సస్ అధికారులుగా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్, జిల్లా విద్యా శాఖ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా అటవీశాఖ అధికారి, జడ్పీ సీఈవో, సర్వే శాఖ ఏడీలు వ్యవహరిస్తారు. ఉప జిల్లా సెన్సస్ అధికారిగా సీపీవో కార్యాలయంలో విధులు నిర్వహించే స్టాటిస్టికల్ అధికారి బాధ్యతలు నిర్వహిస్తారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

పీఆర్సీ కమిషన్‌ను నియమించాలి

- బోధనేతర విధులతో నాణ్యమైన విద్య దూరం
- యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్‌లో నేతల డిమాండ్

గుంటూరు(విద్య), జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతిలోగా పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని లేని పక్షంలో విడతల వారీగా ఆందోళన చేస్తామని యూటీఎఫ్ నాయకులు తెలిపారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) 51వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు గుంటూరు ఏసీ కళాశాలలో శనివారం జరిగాయి. ఈ సందర్భంగా (మిగతా 8వ పేజీలో)

డాక్టర్.. గూగుల్

ఆరోగ్య సందేహాలకు ఆధారం



సండే స్పెషల్

అనారోగ్య సమస్యలు వస్తే గతంలో డాక్టర్‌ను ఆశ్రయించే వాళ్లు. సాధారణ రోగమైతే సమీపం లోని మందుల దుకాణానికి పరిగెత్తేవాళ్లు.. కానీ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిన తర్వాత ఇప్పుడు సెల్‌ఫోన్ అన్నిటికీ ఆధారమైంది. తిండి నుంచి వస్తువుల వరకు కొనుగోళ్లుకు సెల్‌ఫోన్లలోని యాప్‌ల్లో ఆర్డర్లు పెట్టి తెప్పించుకుంటున్నారు. ఇదే క్రమంలో అనారోగ్య సమస్యలకు సలహాలు.. మందులకు సంబంధించిన సందేహాలు.. వైద్య పరీక్షల నివేదికల్లో అంతుబట్టని విషయాలు తెలుసుకునేందుకు గూగుల్‌ను ఆశ్రయిస్తున్నారు. ఇప్పుడు గూగుల్ ఓ డాక్టర్‌గా మారిపోయింది. వైద్య శోధనలు గతంలో కంటే 15 శాతం పెరిగాయి. దీనినిబట్టి గూగుల్‌పై జనం ఏ స్థాయిలో ఆధారపడుతున్నారో తెలుసు కోవచ్చు. పైగా శోధనలతో సరిపెట్టకుండా గూగుల్ ఇచ్చే సలహాల ను అత్యధికమంది పాటిస్తున్నారంటే ఆశ్చర్యం కాదు. సమస్య వచ్చినప్పుడే కాకుండా ఆర్యోగంగా ఉండేందుకూ ఏమిచేయాలో కూడా దానినే అడుగుతున్నారు. ఆయుర్వేదం, హోమియోపతి మందులు, అక్యుపంక్చర్, డిటాక్స్ టీ, బయో హ్యాకింగ్ వంటి వాటి గురించి కూడా పలువురు గూగుల్ ద్వారా తెలుసుకుంటున్నారు.

- నమ్మకమైన వైద్యుడిగా గుర్తింపు
- అది చెప్పిన దానినే పాటిస్తున్న నెటిజన్లు
- గతంలో కంటే 15 శాతం పెరిగిన శోధనలు

గుంటూరు(తూర్పు), జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అనా రోగ్య సమస్యలే కాకుండా ఆరోగ్యంగా ఉండాలంటే పాటించాల్సిన నియమాలు, తినాల్సిన ఆహార పదార్థాల గురించి గతంలో డాక్టర్‌పైనో, మందుల దుకాణదారులపైనో, లేదంటే పెద్దలు ఇచ్చే సలహాలపైనే ఆధారపడేవారు. అయితే ప్రస్తుతం ఈ పరిస్థితి పూర్తిగా మారింది..అంతా గూగులమయమైంది. చిన్న సమస్య వచ్చినా వెంటనే గూగుల్‌ను అడిగే వారు పెరిగిపోతున్నారు. చాలామంది ఆరోగ్యానికి సంబంధించి సమస్యలు, అనుమానాలను.. ఇతరులతో చర్చించేందుకు ఇష్టపడరు. అంతేగాక ఆస్పత్రులకు వెళ్తే అయ్యే ఖర్చుకు భయపడి వెనకడుగు వేస్తారు. గూగుల్ అందుబాటులోకి వచ్చిన తర్వాత ఇలాంటి వారికి పెద్ద ఉపశమనం లభించింది. చిన్న సమస్య తలెత్తినా, అనుమానం ఉన్నా, వేరొకరికి చెప్పలేని సమస్య అయినా గూగుల్ని అడిగేస్తున్నారు. గత సంవత్సరంలో నెటిజన్లు గూగుల్లో



వెతికిన అంశాల్లో ఆరోగ్యంపై శ్రద్ధ, అనారోగ్య సమస్యలపై శోధించిన అంశాలు ప్రథమ స్థానంలో ఉన్నాయి. చర్మ సంరక్షణ, శరీర బరువు నిర్వహణ, వ్యాయామంపై దాదాపు 3 కోట్ల సెర్చులు నమోదయ్యాయి. వివిధ రకాల జబ్బులకు సంబంధించి ఏ ఔషధాన్ని వాడుతున్నారు.. దానిని ఎంతమంది కొన్నారు.. వారిచ్చిన రేటింగ్ ఏమిటి.. రివ్యూలు ఏం చెబుతున్నాయో తెలుసుకున్న తర్వాత గూగుల్ సలహాలను ఆచరిస్తున్నారు.

ఎక్కువుగా శోధన చేసిన అంశాలు

బీ12 అధికంగా ఉండేవి, చక్కెర లేని ఆహార పదార్థాలు, నడకకు (మిగతా 8వ పేజీలో)

అప్రమత్తత అవసరం

చిన్నపాటి సమస్యలను గూగుల్ పరిష్కారం చూపుతోందేమో కానీ పెద్ద సమస్యలకు ఆధారపడటం మంచిది కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. రోగిని ప్రత్యక్షంగా పరిశీలించి.. సమస్య తెలుసుకుని శరీరతత్వానికి అనుగుణంగా డాక్టర్ మందులు ఇస్తారు. గూగుల్ అలాకాదు.. రెగ్యులర్, మందులు, ఇతర నిపుణులు అభిప్రాయాలను మాత్రమే చెప్తుంది. అందువల్ల గూగుల్ సలహాల విషయంలో అప్రమత్తంగా ఉండాలంటున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ డాక్టర్ల సలహా లేకుండా ఔషధాలు వినియోగించవద్దని సూచిస్తున్నారు.

రౌడీషీటర్ల రోడ్‌షో

- పోలీస్ కార్యాలయంలో డార్మెటరీ కౌన్సెలింగ్
- రోడ్లపై కొట్టుకున్న గ్యాంగ్‌లకు పోలీస్‌మార్క్ ట్రీట్‌మెంట్



రౌడీషీటర్లతో రోడ్‌షో నిర్వహిస్తున్న పోలీసులు

గుంటూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న.. దాడులు, ప్రతిదాడులకు దిగుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న రౌడీషీటర్లపై పోలీసులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం డార్మెటరీ కౌన్సెలింగ్ ఇచ్చి అనంతరం రౌడీషీటర్లతో పోలీసులు రోడ్‌షో నిర్వహించి హెచ్చరికలు జారీ చేశారు. వివిధ కేసుల్లో నిందితులైన 57 మందితో బృందావన్ గార్డెన్స్ నుంచి లాడ్జి సెంటర్ వరకు మార్చ్ నిర్వహించారు. ప్రజా శాంతికి భంగం కలిగిస్తే సహించేది లేదని, ఎవరినీ ఉపేక్షంచబోమని, చట్టానికి లోబడి నడుచుకోవాలని ఎస్పీ వకుల్ జిందాల్ వారిని హెచ్చరించారు. రౌడీలు, కేడీలు, డీసీల కదలికలపై నిరంతర నిఘా ఉంటుందన్నారు. అవసరమైతే పీడీ యాక్ట్ వంటి కఠిన చట్టాలు అమలు చేస్తామని హెచ్చరించారు. గతంలో నేరాలకు పాల్పడిన వ్యక్తులపై నిఘా పెంచామని, భవిష్యత్తులో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



రెండు గంజాయి కేసుల్లో 11 మంది అరెస్టు

- 4.4 కేజీల గంజాయి స్వాధీనం.. పరారీలో మరో ఆరుగురు

గుంటూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రెండు వేర్వేరు గంజాయి కేసుల్లో 11 మందిని అరెస్టు చేసి 4.4 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. నిందితులను శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మీడియా ఎదుట హాజరుపరిచి వివరాలు తెలిపారు. గుమ్మ సాయి అనే అతడు ఒరిస్సా నుంచి గంజాయి తెచ్చి విక్రయిస్తుండగా అరండల్‌పేట పోలీసులు అరెస్టు చేశారు. రిమాండ్‌లో ఉన్న అతడు బెయిల్ డబ్బుల కోసం గంజాయి అమ్మి డబ్బులు సంపాదించి లాయర్‌కి ఇవ్వమని హేమచంద్రసాయి, ముత్తుకూరి సాయిరామ్, తన్నీరు నాగసాయి, షేక్ జాని బాషాలకి ముందుగానే గంజాయి ఇచ్చాడు. ఈ నెల 9న వీరు గంజాయి విక్రయిస్తుండగా నగరంపాలెం పోలీసులు అరెస్టు చేసి 1.200 గ్రాములు స్వాధీనం చేసుకున్నారు. తన్నీరు నాగసాయిపై పట్టాభిపురం స్టేషన్‌లో పోక్సో కేసు, అరండల్‌పేటలో దొంగతనం కేసు ఉందన్నారు. షేక్ జాని బాషాపై పట్టాభిపురం స్టేషన్‌లో పోక్సో కేసు, జొన్నలగడ్డ యువరాజుపై అరండల్‌పేట స్టేషన్‌లో దొంగ తనం కేసు ఉందని ఎస్పీ తెలిపారు.

మరో కేసులో ఐదుగురు అరెస్టు.. ఆరుగురు పరార్

మరో కేసులో ఈ నెల 9న ఐదుగుర్ని అరెస్టు చేసి వారి వద్ద ఉన్న 3.200 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. కాగా ఆరుగురు పరారీలో ఉన్నారన్నారు. అరెస్టు అయిన వారిలో శ్రీనివాసరావుతోటకు చెందిన పాలేటి సాల్మన్‌రాజు, సుంకర వంశీ కృష్ణ, గుంజి హేమంత్(నగరంపాలెం), పాముల రఘురామ్ కోటి(పట్టాభిపురం), షేక్ నాగుల్‌మీరా (అడపాబజార్) ఉన్నారు. సాల్మన్‌రాజు, హేమంత్ రాజు, వంశీ కృష్ణలపై అక్రమ మద్యం కేసులు ఉన్నాయన్నారు. పండ్ల



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్, పక్కన వెస్ట్ డీఎస్పీ అరవింద్, వెనుక నిందితులు

వ్యాపారం చేసే సాల్మన్‌రాజు ఆదాయం విలాసాలకు సరిపోక స్కూల్‌లో జూనియర్ అయిన హేమంత్‌రాజుతో కలిసి గంజాయి విక్రయిస్తున్నట్లు ఎస్పీ తెలి పారు. ఆయా కేసుల్లో నిందితులను అరెస్టు చేసిన నగరంపాలెం పోలీసులు, టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి ఎస్పీ రివార్డులతో పాటు ప్రశంసాపత్రాలను అందించారు. సీఐ సత్యనారాయణ, ఎస్ఐలు పి.రాంబాబు, ఎ.రామచంద్రారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ ఎం.దాసు, కానిస్టేబుళ్లు ఎస్‌కే.జాన్ సైదా, ఎ.శ్రీనివాసరావు, సిహెచ్. ఉదయచంద్, పి.గంగరాజు, ఎస్‌కే. షకీల్ అహ్మద్, టాస్క్ ఫోర్స్‌కు చెందిన హరి, ఎ.సాంబశివరావు, ఫణిరాజు, విజయ్‌కుమార్, సాంబశివరావు, రమేష్, జానీ, వి.శ్రీనివాస్ తదితరులను ఎస్పీ అభినందించారు.



స్టాళ్ల వద్ద చీరలు కొనుగోలు

ఆకట్టుకుంటున్న.. సరస్

- వివిధ రాష్ట్రాల ఉత్పత్తులపై ఆసక్తి
- మేళా సందర్శనకు పోటెత్తుతోన్న ప్రజలు

గుంటూరు సిటీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నోరూరిస్తోన్న ఆహార పదార్థాలు.. ఆకట్టుకుంటోన్న దుస్తులు.. ఆకర్షణీయంగా దర్శనమిస్తోన్న అలంకరణ వస్తువులతో స్థానిక నల్లపాడు రెడ్డి కళాశాల సమీపంలో ఏర్పాటు చేసిన సరస్ మేళా అఖిలభారత డ్వాక్రా బజార్‌కు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. శుక్రవారం నుంచి గుంటూరు వాసులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు కుటుంబసమేతంగా తరలి వస్తున్నారు. దీంతో సరస్ ప్రాంగణం సందడిగా మారింది. సంక్రాంతి సెలవులు కూడా తోడవడంతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన వివిధ రకాల ఉత్ప త్తులను చూసేందుకు, కొనుగోలు చేసేందుకు పెద్దసంఖ్యలో ప్రజలు తరలివస్తున్నారు. వివిధ రాష్ట్రాల ఆహార పదార్థాలను ఆస్వాదిస్తున్నారు. చీరలు, డ్రస్ మెటీరియల్స్, దుప్పట్లు, అలంకరణ వస్తువుల కొనుగోళ్లకు మహిళలు ఆసక్తి చూపుతున్నారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ రాష్ట్రాల్లోని అత్యంత ప్రాధాన్యం కలిగిన హ్యాండ్ క్రాఫ్ట్, వస్త్రాలు, ఆయుర్వే ద మందులు, నాచురల్ ఫుడ్ ఐటమ్స్, మెటల్, చెక్క, క్లాత్, పేపర్, లెదర్‌తో తయారు చేసిన వివిధ రకాల అలంకరణ వస్తువులతో ఏర్పాటు చేసిన స్టాళ్లు ఆకట్టుకుంటున్నాయి. సరస్ మేళాలో చిన్నారుల కోసం ప్రత్యేకంగా ఆట వస్తువులతో ఎమ్యూజమెంట్ పార్కును ఏర్పాటు చేయడంతో పిల్లల సందడితో ఆ ప్రాంతం నిండిపోయింది.

ఏఏ స్టాల్స్‌లో ఏఏ వస్తువులంటే..

16లో మిల్లెట్స్‌తో తయారు చేసిన చక్రాలు జంతికలు రాగి బూరెలు (మిగతా 8వ పేజీలో)



వివిధ రాష్ట్రాల వంటకాలతో ఫుడ్ కోర్టు

నేటి నుంచి సంక్రాంతి సంబరాలు

ఎన్టీఆర్ స్టేడియం, కాకుమానివారి తోటలో నిర్వహణ విజయవంతం చేయాలన్న మేయర్ రవీంద్ర

గుంటూరు కార్పొరేషన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి ఎన్టీఆర్ స్టేడియంలో, 13 నుంచి కాకుమానువారితోటలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. సంక్రాంతి సంబరాల నిర్వహణకు సంబంధించి శనివారం కౌన్సిల్‌లో జరిగిన విలేకర్ల సమా వేశంలో ఆయన వివరాలు ప్రక టించారు. ఆహ్లాద, ఆనందకర వాతావరణంలో సంస్కృతి, సంప్రదాయాలను చాటుతూ నిర్వహించే సంక్రాంతి సంబరాలను ప్రజలు విజయవంతం చేయాలన్నారు. ఈ సంబరాల సందర్భంగా క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుపుతామన్నారు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు 666 మంది కళాకారులతో నృత్య ప్రదర్శన ఉంటుందని కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. క్రికెట్, లెమన్ స్పూన్, మ్యూజికల్ చైర్స్, రంగోలి పోటీల్లో పాల్గొనే వారు 94928 71972, 96429 83416 నెంబర్లలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ మన గుంటూరు - మన సంక్రాంతి పేరుతో కాకుమానువారితోటలోని నారా వారి కళా ప్రాంగణంలో తొలి సారిగా సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నామన్నారు.



ప్రసంగిస్తున్న మేయర్ రవీంద్ర, ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, కమిషనర్

మట్టి నమూనా విశ్లేషణలో ఆటోమేషన్ తప్పనిసరి

● వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ మనజీర్ జీలాని

గుంటూరు సిటీ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మట్టి నమూనాల విశ్లేషణ ప్రక్రియను మరింత పారదర్శకంగా, వేగంగా నిర్వహించే ందుకు ఆటోమేషన్ సాంకేతికతను పూర్తి స్థాయిలో వినియోగించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ మనజీర్ జీలాని సమూన్ అధికారులను ఆదేశించారు. శనివారం గుంటూరు నగరంలోని భూసార పరీక్ష కేంద్ర ప్రయోగశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మట్టి నమూనాల స్వీకరణ నుంచి స్థూల, సూక్ష్మ పోషకాలకు సంబంధించిన 12 రకాల అంశాలపై నిర్వహిస్తున్న విశ్లేషణ విధానం, పరికరాల పనితీరు, పరీక్ష ఫలితాలను సాయిల్ హెల్త్ కార్డ్ పోర్టల్‌లో నమోదు చేసే వరకూ అమలులో ఉన్న పూర్తి ప్రక్రియను ఆయన పరిశీలించారు. భూసార ఆరోగ్య పత్రం (సాయిల్ హెల్త్ కార్డు) ఆధారంగా రైతులకు పంటల వారీగా ఎరువుల సిఫార్సులు ఏ విధంగా అందిస్తున్నారనే అంశంపై వ్యవసా య అధికారులను అడిగి తెలుసు కున్నారు. మట్టి నమూనాల సేకరణ నుంచి పరీక్ష ఫలితాల వరకు మొత్తం ప్రక్రియలో మానవ జోక్యాన్ని తగ్గించి.. పూర్తి ఆటోమేషన్‌గా చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పాత పరికరాల స్థానంలో ఆధునిక పరికరా లను ఏర్పాటు చేసి పరీక్షా ప్రక్రియను మరింత సమర్థంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. రైతులకు నాణ్యమైన సేవలు అందించేందుకు ఆర్‌కేవీవై పథకంలోని భూ ఆరోగ్య- భూసార పథకం కింద మంజూరైన నిధులను సత్వరమే వినియోగించాలని ఆదేశించారు. గుంటూరు, ఎన్‌టీఆర్ జిల్లాల ప్రయోగశాలల కొత్త భవనాల నిర్మాణానికి, అలాగే తొమ్మిది కొత్త జిల్లాల్లోని భవనాల మరమ్మతుల కోసం మంజూరైన రూ.3.18 కోట్ల నిధులను వెంటనే ఖర్చు చేయాలని స్పష్టం చేశారు.



మట్టి నమూనాలను పరిశీలిస్తున్న డాక్టర్ మనజీర్ జీలాని

పారిశ్రామిక అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

● ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

గుంటూరు(తూర్పు), జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక, ఉపాధి రంగాలలో పరిశ్రమలను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని.. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు పేర్కొన్నారు. గుంటూరులో ఏపీ టెక్స్‌టైల్స్ మిల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. తొలుత టెక్స్‌టైల్స్ పరిశ్రమలకు పెండింగ్‌లో ఉన్న సబ్సిడీలను విడుదల చేసిన ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి అసోసియేషన్ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సరిగ్గా లేనప్పటికీ పరిశ్రమలను పరిరక్షించేందుకు ఈ సబ్సిడీలను విడుదల చేశామని చెప్పారు. రాయితీలను సద్వినియోగం చేసుకుని టెక్స్‌టైల్స్ పరిశ్రమను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రభుత్వంపై ఎటువంటి భారం లేకుండా కర్నూలులలో ఏర్పాటు చేసిన పవర్ స్టోరేజ్ యూనిట్‌ను సందర్శించాలని సభ్యుల ను ఆయన కోరారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ మిగిలిన సబ్సిడీలను త్వరలోనే విడుదల చేయాలని కోరారు. గ్రీన్ ఎనర్జీ పాలసీను రాష్ట్రంలో ప్రవేశపెట్టాలని సూచించారు. అనంతరం ఎంపీని అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు పి కోటిరావు, వైస్ చైర్మన్లు ఎంవీ సత్యనారాయణ, ఉమామహేశ్వరరావు, పి చలపతిరావు, సలహాదారుడు లంకా రఘురామిరెడ్డి, సభ్యులు దండా బ్రహ్మానందం, కేవీ ప్రసాదు, సాయినీత్, సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, సామినేని కోటేశ్వరరావు

గుంటూరు ఆటోనగర్‌లో సెల్టోస్ ఆవిష్కరణ

గుంటూరు సిటీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ఆటోనగర్ సరికొత్త హంగులతో సింహ కియా షోరూం, కొత్త సెల్టోస్ కారును శుక్రవారం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ నసీర్ అహ్మద్, నగర మేయర్ కె. రవీంద్రబాబు ఆవిష్కరించారు. సింహా మోటార్స్ అధినేత రావెళ్ల సతీష్ మాట్లాడుతూ.. కొత్త సెల్టోస్ కే3 ప్లాట్‌ఫాంపై నిర్మించబడిందన్నారు. 24 సురక్షితమైన భద్రత ఫీచర్స్ కలిగిన ఈ కొత్త సెల్టోస్ సరికొత్త పది రంగులతో లభ్యమవుతుందని తెలిపారు. సింహా కియా జీఎం క్రాంతికుమార్ మాట్లాడుతూ రాజీలేని భద్రత, కొత్త ఫీచర్లతో వినియోగదారుల అభిరుచికి అనుగుణంగా కారు ఉందన్నారు. ఎక్స్‌షోరూం ధర రూ.10,99,000 నుంచి కారు అందుబాటులో ఉందని తెలిపారు.



సెల్టోస్ కారును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మహ్మద్ నసీర్ అహ్మద్, గుంటూరు నగర మేయర్ రవీంద్రబాబు

సింక్రోని గ్లోబల్‌తో వీవీఐటీయూ అవగాహన ఒప్పందం

పెదకాకాని, జనవరి 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు జనరేటివ్ ఏఐపై శిక్షణ, ఇంటర్న్ షిప్ అవకాశాలకు ప్రముఖ సింక్రోని గ్లోబల్ ఐటీ సొల్యూషన్స్‌తో వీవీఐటీ వర్సిటీ అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు చాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్ శనివారం తెలిపారు. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు, అధ్యాపకులకు జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, డేటా ఇంజనీరింగ్, డేటా అనలిటిక్స్, క్లౌడ్ డేటా ఇంజరింగ్ సాంకేతికపై శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఇంటర్న్ షిప్ అందించేందుకు తోడ్పాటు ఇవ్వనున్నట్లు తెలిపారు. సింక్రోని సీఈఓ భాను కొంగల, రిజిస్ట్రార్ వై.మల్లికార్జునరెడ్డి ఈ అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారని తెలిపారు. అకడమిక్ డీన్ కె.గిరిబాబు, ప్లేస్మెంట్ డైరెక్టర్ ఎ.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న అధ్యాపకులు

క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలి

● సబ్ రిజిస్ట్రార్ గీతాలక్ష్మి

గుంటూరు (విద్య) జనవరి 10 (ఆంధ్ర జ్యోతి): ప్రతి ఒక్క విద్యార్థి చదువుతో పాటు క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకుని జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అనకాపల్లి జిల్లా చోడవరం సబ్ రిజిస్ట్రార్ బలగ గీతాలక్ష్మి అన్నారు. శనివారం స్థానిక వికాస్‌నగర్‌లోని భాష్యం స్పోర్ట్స్ ఎరీనా గ్రౌండ్‌లో భాష్యం ఒలంపస్ పేరిట భాష్యం సెంట్రల్ లెవల్ ఒలంపస్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల ద్వారా నాయకత్వ లక్షణాలు పెంపొందించుకు ని ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ భాష్యం ఒలంపస్ పేరిట మూడు రోజులపాటు క్వార్టర్ ఫైనల్స్, సెమీ ఫైనల్స్ ఫైనల్స్ జరుగుతాయన్నారు. వీటిలో త్రో బాల్, కబడ్డీ, ఖోఖో, క్యారమ్స్ చెస్, రిలే రేస్ పోటీలు జరుగుతాయని వీటితో పాటు జరిగే భాష్యం క్రికెట్ లీగ్ పోటీల్లో 8 జోనల్ జట్లు పాల్గొంటాయన్నారు. వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న గీతాలక్ష్మి, భాష్యం రామకృష్ణ తదితరులు

చాకచక్యంగా మహారాష్ట్ర డెకాయిటీ గ్యాంగ్ అరెస్ట్

● రూ.6,72,700 నగదు, కత్తి, మొబైల్ ఫోన్లు స్వాధీనం

బాపట్ల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లాలోని బాపట్ల, చీరాల రైల్వేస్టేషన్లలో.. శనివారం సాయంత్రం ఉత్కంఠ నెలకొంది. కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో జిల్లా పోలీసులు ఆకస్మిక తనిఖీ చేపట్టి.. మహారాష్ట్రలో డెకాయిటీ చేసి వస్తున్న గ్యాంగ్‌ను అత్యంత చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.6,72,700 నగదు, కత్తి, మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ మాట్లాడుతూ.. మహారాష్ట్ర హింగోలిలోని మహారాష్ట్ర మధ్యవర్తి సహకారి కోఆపరేటివ్ బ్యాంక్ మేనేజర్ నుంచి రూ.8 లక్షలు లూటీ చేసిన గ్యాంగ్. ఏపీలోకి ప్రవేశిస్తుందనే సమాచారంతో మహారాష్ట్ర పోలీసులు ఇక్కడి పోలీస్‌శాఖకు అభ్యర్థించింది. దీంతో ప్రత్యేక బృందాలుగా.. బాపట్ల, చీరాల రైల్వేస్టేషన్‌ల వద్ద డీఎస్పీ స్థాయి అధికారితో నిఘా ఏర్పాటు చేశారు. బాపట్ల రైల్వే స్టేషన్‌లో కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో ఏకకాలంలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి.. రైలులో ప్రయాణిస్తున్న ఐదుగురు సభ్యుల ముఠాను అదుపులోకి తీసుకున్నారు. ముఠా సభ్యులను, స్వాధీనం చేసుకున్న నగదు, వస్తువులను మహారాష్ట్ర పోలీసులకు అప్పగించటం జరుగుతుందని తెలిపారు. జిల్లా పోలీసులను డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ప్రత్యేకంగా అభినందించినట్లు ఎస్పీ తెలిపారు. సీసీఎస్ డీఎస్పీ జగదీష్‌నాయక్, బాపట్ల పట్టణ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, ఎస్ఐ విజయ్‌కుమార్, స్పెషల్ బ్రాంచ్ సిబ్బందిని ఎస్పీ ఉమామహేశ్వర్ ప్రత్యేకంగా అభినందించారు.



మహారాష్ట్రకు చెందిన డెకాయిటి గ్యాంగ్ సభ్యులు

25న కృత్రిమ పాదాల ఎంపిక శిబిరం



పోస్టర్‌ని ఆవిష్కరిస్తున్న రోటరీ క్లబ్ నాయకులు

గుంటూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలు, దీర్ఘకాలిక వ్యాధుల వల్ల కాళ్లు కోల్పోయిన వారికి కృత్రిమ పాదాలను అమర్చేందుకు ఏకం యూఎస్ఏ సహకారంతో ఖమ్మం రోటరీ ట్రస్టు, రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు సెంటిన్నియల్, రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మంలు ముందుకొచ్చాయి. ఈ నెల 25న ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నగరంలోని కుందుల రోడ్డులో ఉన్న కమ్మ జన సేవా సమితి ప్రాంగణంలో కృత్రిమ పాదాల పంపిణీకి ఎంపిక శిబిరం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి శనివారం స్థానిక అరండల్‌పేటలో పోస్టర్ విడుదల చేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు సెంటిన్నియల్ అధ్యక్షుడు డాక్టర్ వీరా మాట్లాడుతూ కృత్రిమ పాదాలు అవసరమైన వారికి తొడ నుంచి ఎనిమిది అంగుళాల వరకు కాలు భాగం ఉండాలన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఎవరికైతే కృత్రిమ కాళ్లు అవసరమో వారు 96181 47082, 95735 57422 నంబర్లకు ఫోన్ చేసి వివరాలు తెలియజేయాలని సూచించారు. 100 మందికి తగ్గకుండా వీటిని పంపిణీ చేస్తామన్నారు. క్లబ్ కార్యదర్శి సంతోష్‌కుమార్ జవేరా, కోశాధికారి మురళీకృష్ణ, నూతన అధ్యక్షుడు నవీన్ చక్రవర్తి తొట్టెంపూడి, వేణుగోపాల్‌రావు వడ్డూరి, శంకరమంచి సాయికుమార్, సూర్య ధరణీష్ పెరుమాళ్ల పాల్గొన్నారు.

కాటూరిలో రెట్రోగ్రేడ్ టెక్నిక్‌తో
కిడ్నీలో రాళ్ల తొలగింపు

ప్రత్తిపాడు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కాటూరి మెడికల్ కాలేజీ హాస్పిటల్ యూరాలజీ వైద్య విభాగం శనివారం అత్యాధునిక రెట్రోగ్రేడ్ ఇంట్రా రీనల్ సర్జరీ (ఆర్ఐఆర్ఎస్) టెక్నిక్ ఉపయోగించి కిడ్నీలో రాళ్లను సునాయాశంగా తొలగించింది. యూరాలజీ వైద్య విభాగాధిపతి డాక్టర్ ప్రకాశ్‌రావు, డాక్టర్ కృష్ణారావు ఈ శస్త్ర చికిత్సలను నిర్వహించారు. మూత్రనాళం ద్వారా సన్నని పరికరం (యూరెత్రో స్కోప్) పంపి కిడ్నీలో రాళ్లను లేజర్, ఇతర సాధనాలతో పగులకొట్టి తొలగిస్తారు. ఇది పెద్ద కోతలు లేకుండా సురక్షితమైన విధానం. రోగులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కాటూరి జనరల్ హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వై కిరణ్‌కుమార్ కోరారు. చక్కటి వైద్య సేవలు అందించిన డాక్టర్ ప్రకాశరావును, డాక్టర్ కృష్ణారావును డాక్టర్ కిరణ్‌కుమార్‌తో పాటు హాస్పిటల్ డీన్ డాక్టర్ సీహెచ్ మోహన్‌రావు అభినందించారు. డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.అజయ్ పాల్గొన్నారు.



ఆపరేషన్‌లో డాక్టర్లు ప్రకాశరావు, కృష్ణారావు

తెనాలి శివారులో ఏసీ మెకానిక్ హత్య

తెనాలి క్రైం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): తెనాలి శివారు టీచర్స్ కాలనీ, యడ్లలింగయ్య కాలనీ ప్రాంతంలోని నిర్జన ప్రదేశంలో శుక్రవారం అర్ధరాత్రి పట్టణానికి చెందిన ఏసీ మెకానిక్ హత్యకు గురయ్యాడు. ఈ ఘటనపై త్రీ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నందులపేట నివాసి అయిన షేక్ ఫయాజ్ (51) ఏసీ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్న ఒంటరి మహిళతో సంబంధాలు ఉన్నాయి. శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో ఫయాజ్ ఆమె ఇంటి నుంచి బైక్‌పై వెళుతూ ఉన్న సమయంలో.. అక్కడి నిర్జన ప్రదేశంలో గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి పరారయ్యారు. అతని సన్నిహితులు ఫయాజ్‌ను తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు అతను అప్పటికే మృతి చెందారని నిర్ధారించారు. మృతుడి కొడుకు ఫిర్యాదు మేరకు ఘటనా స్థలాన్ని డీఎస్పీ జనార్దనరావు, సీఐ సాంబశివరావు, సిబ్బంది పరిశీలించారు. నిందితులను త్వరలోనే.. అదుపులోకి తీసుకుంటామని సీఐ సాంబశివరావు వెల్లడించారు.

కేఎల్‌యూలో జవహర్ నవోదయ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

తాడేపల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జవహర్ నవోదయ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం.. వడ్డేశ్వరంలోని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొని, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సభలో ఆయన మాట్లాడు తూ పూర్వ విద్యార్థులు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఐఏఎస్ అధికారులు మల్లిఖార్జున, జ్యోత్స్నలు తమతో కలిసి చదువుకున్న స్నేహితులను కలుసుకుని..కుశల ప్రశ్నలు వేసుకున్నారు. గౌరవ అతిథి కేఎల్‌యూ వీసీ సారథివర్మ నిర్వాహకులను అభినందించారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

రాష్ట్రాభివృద్ధి కూటమితోనే సాధ్యం

● నాపై ప్రేమాభిమానాలకు రుణపడి ఉంటా
● జన్మదిన వేడుకల్లో మంత్రి అనగాని
● మంత్రులు, పార్టీ శ్రేణులు అభినందనలు



శుభాకాంక్షలు తెలుపుతున్న మడకసిర ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు



శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యేలు ఏలూరి, నరేంద్రవర్మ



కేక్ కట్ చేస్తున్న మంత్రి అనగాని

రేపల్లె, జనవరి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. శనివారం ఉప్పూడి రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో నాయకులు, అభిమానులు, కార్యకర్తలు మధ్య మంత్రి అనగాని జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, వేగేశన నరేంద్ర వర్మ, మోదుకుమళ్ళ అశోక్‌రెడ్డి, ఎంఎస్‌రాజు, జిల్లా టీడీపీ అధ్యక్షుడు సలగల రాజశేఖర్, బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, జనసేన గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర్లు, బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, మంత్రి అనగానికి పుష్ప గుచ్చాలు అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక టీడీపీ నాయకులు గజమాలలతో మంత్రికి శుభాకాంక్షలు చెప్పారు. నియోజకవర్గం నుంచి బైక్‌ల ర్యాలీ ద్వారా టీడీపీ కార్యాలయానికి వేలాది మందిగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు చేరుకున్నారు. మంత్రికి శాలువలు కప్పి.. అభినందనలు తెలిపారు. మంత్రి అనగాని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన 19 నెలల్లో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజలకు అండగా నిలిచామన్నారు. రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేస్తూ ప్రజలకు భూ హక్కు కల్పించి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తున్నామన్నారు. రాజముద్రతో పాస్‌పుస్తకాలు అందిస్తూ పొలాల హక్కుదారులుగా చేస్తున్నామన్నారు. రాజధాని అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తున్నామని, రాష్ట్రంలోని అన్ని జిల్లాలను అభివృద్ధి చేసే దిశగా సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పాలన కొనసాగిస్తున్నారన్నారు. విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచబోదని.. రాష్ట్రాభివృద్ధి సీఎం చంద్రబాబునాయుడుతోనే సాధ్యమన్నారు. రెవెన్యూ మంత్రి అనగాని బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూసమస్యల పరిష్కారానికి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ వెనుకబడ్డ తీరప్రాంత అభివృద్ధికి కూటమి ప్రభుత్వం రావడంతోనే ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి ప్రజలకు మేలు జరిగేలా కృషి చేస్తున్నామన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	173, 182, 193
చికెన్ విత్ స్కిన్(కిలో)	336.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	346.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



ప్రశంసా పత్రాలు పొందిన చిన్నారులతో ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

కళలపై విద్యార్థులలో ఆసక్తిని పెంపొందించాలి

● తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

గుంటూరు(తూర్పు), జనవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో సంస్కృతి, సంప్రదాయ కళలపై ఆసక్తి పెంపొందించేలా కళా సంస్థలు కృషి చేయాలని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ అన్నారు. స్థానిక బ్రాడీపేట, బాలానంద కేంద్రంలో శనివారం మూడవ తెలుగు ప్రపంచ మహాసభలలో క్షేత్ర దర్శనీ ప్రదర్శించిన విద్యార్థులకు సర్టిఫికెట్స్, ప్రశంసా పత్రాలు అందజేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూచిపూడి, ఇతర కళలపై విద్యార్థులు మక్కువ పెంచుకోవాలని సూచించారు. ఆర్ట్ ఆఫ్ నటరాజ్ ఫౌండర్ విజయ గౌరీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బాలానంద కేంద్రం కార్యదర్శి గురుదత్, గంటా స్వామి, మాజీ డిప్యూటి మేయర్ గౌస్, రామ్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ, ట్రంప్ విధానాలతో ప్రజాస్వామ్యానికి ప్రమాదం

● సీపీఐ జాతీయ సమితి సభ్యుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు

గుంటూరు (తూర్పు), జనవరి 10 (ఆంధ్రజ్యోతి): భారత ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలతో ప్రజాస్వామ్యానికి ప్రమాదం ఏర్పడిందని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. స్థానిక కొత్తపేట మల్లయ్య లింగం భవన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తూ వెనిజువెలా అధ్యక్షుడిని ట్రంప్ నిర్బంధించారని మండిపడ్డారు. దేశంలో మాట వినని వారిపై సీబీఐ, ఈడీ, విజిలెన్స్ వంటి సంస్థలను ఉక్కుపాదంగా ఉపయోగిస్తూ బెదిరింపులకు మోదీ పాల్పడుతున్నాడని విమర్శించారు. వారి విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా పోరాడాల్సిన అవసరముందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోటా మాల్యాద్రి మాట్లాడుతూ, పార్టీ శత వార్షికోత్సవాల సందర్భంగా ఈ నెల 18న ఖమ్మంలో జరిగే భారీ ప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జంగాల అజయ్ కుమార్, మేడా హనుమంతురావు, ఆకిటి అరుణ్‌కుమార్, చిన్ని తిరుపతయ్య, పుప్పాల సత్యనారాయణ, రావుల అంజిబాబు, ఆరెటి రామారావు, ముప్పాళ్ళ శివ శంకరరావు, రెంటాల కుమారి, రామిశెట్టి ఆదేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు, పాల్గొన్న కోటా మాల్యాద్రి తదితరులు

నేడు పేద విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ



తులసీ గ్రూప్ ఎండీ యోగీష్‌చంద్ర

గుంటూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): చదువుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 110 మంది పేద విద్యార్థులకు రూ.4.90 లక్షల ఉపకార వేతనాలు పంపిణీ చేయనున్నట్టు తులసీ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ తులసీ యోగీష్ చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం పొన్నూరులోని మున్సిపల్ కార్యాలయం దగ్గరున్న సాయి దివ్య కళ్యాణ మండపంలో ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు జరుగుతుందని తెలిపారు. 'కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్-గుంటూరు', కావు సేవా సమితి-పొన్నూరు వారి సంయుక్త ఆధ్వర్యంలో ఉపకార వేతనాలు అందిస్తున్నట్టు చెప్పారు. ఇందులో 52 మంది విద్యార్థులకు రూ.2 లక్షల 50 వేలు తులసీ సీడ్స్ వారు కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్ ద్వారా పేద విద్యార్థులకు అందజేస్తున్నట్టు పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా తులసీ గ్రూప్ సంస్థల ఛైర్మన్ తులసీ రామచంద్రప్రభు హాజరై విద్యార్థులకు ఉపకార వేతనాలను పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

ఉపాధి హామీ పథకం పేరు మార్పుపై నిరసన

● నేడు కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ శ్రేణుల ఉపవాస దీక్షలు

గుంటూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకానికి మహాత్మాగాంధీ పేరును తొలగించడంపై కాంగ్రెస్ శ్రేణులు ఆదివారం కలెక్టరేట్ ఎదుట ఉపవాస దీక్షలు నిర్వహించనున్నాయి. రాజీవ్ గాంధీ భవన్‌లో శనివారం ఏఐసీసీ కార్యదర్శి, రాష్ట్ర ఇన్‌ఛార్జ్ డాక్టర్ పల క్రిస్టోఫర్ విలేకరులతో మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నతుడు మహాత్మాగాంధీ అని ఆయన పేరును తొలగించి చరిత్రను వక్రీకరించేలా కేంద్రంలోని బీజేపీ వ్యవహరిస్తోందని మండిపడ్డారు. దీనికి నిరసనగా కాంగ్రెస్ శ్రేణులు అన్ని జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్ ఎదుట ఉపవాస దీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ, పలుసార్లు నిబంధనలు సవరించి పథకాన్ని బలహీనపరిచారని, ఇప్పుడు పేరు మార్చేందుకు కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. పథకం పేరు మార్పుపై దేశవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు నిరసనలు చేపడుతున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, ఆర్‌జేఏఎస్ గుంటూరు గ్రూప్ కోఆర్డినేటర్ బర్నె చావా, ..., ఎండీ జలీల్, కాంగ్రెస్ నేతలు మదన మోహన్‌రెడ్డి, డాక్టర్ జాన్‌బాబు, సునీల్, బోడపాటి నాగేశ్వరరావు, కరిముల్లా పలువురు నాయకులున్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పల క్రిస్టోఫర్, మస్తాన్‌వలి, లింగంశెట్టి తదితరులు

వీనుల విందుగా కృష్ణ లీలా తరంగిణి

గుంటూరు(తూర్పు), జనవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురం శ్రీ త్యాగరాజ సంస్కృతి సంఘం త్యాగరాజ కళావేదికపై శనివారం ఏర్పాటు చేసిన కృష్ణ లీలా తరంగిణి కార్యక్రమం అలరించింది. తెలుగు కళా సమితి న్యూ జెర్సీ, శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం సంయుక్త నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగు కళా సమితి అధ్యక్షుడు ... హాజరై మాట్లాడుతూ, నారాయణ తీర్థ రచనలను గాత్రం, నృత్య రూపంలో ప్రదర్శించడంతో ఎంతో తృప్తిని పొందానన్నారు. సాహితీవేత్త డాక్టర్ కోగంటి వెంకట శ్రీరంగనాయకి, విశ్రాంత ఐపీఎస్ టీవీ రమణకుమార్, విశ్రాంత డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి జీవీ కృష్ణయ్య, సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు రామరాజు శ్రీనివాసరావు, కార్యదర్శి వల్లూరి కృష్ణ కిశోర్ ప్రసంగించారు.

అలరించిన తాళం భజన

గుంటూరు (తూర్పు), జనవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శనివారం శ్రీ మహేశ్వరమ్మ భజన సమాజం ఆధ్వర్యంలో తాళం భజన కార్యక్రమం ప్రేక్షకులను అలరించింది. తెలుగు భాషా వైభవాన్ని, భక్తిని జోడించిన కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాహితీవేత్త డాక్టర్ కోగంటి వెంకట శ్రీరంగనాయకి తిరుపావైలోని 26వ పాశురంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. అనంతరం గాజుల సుశీలమ్మ, మాధవి, మంగమ్మ, వెంకాయమ్మ, శైలమ్మ, వాణి తదితర సభ్యులు తాళం భజన ... కీర్తనలను తాళంభజన రూపంలో చక్కగా ఆలపించారు. దేవస్థానం తరఫున ... సహకారం అందించారు.

విద్యా సంస్థలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న జూపూడి రంగరాజు తదితరులు

గుంటూరు(విద్య), జనవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో శనివారం సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కళాశాల అధ్యక్షుడు జూపూడి రంగరాజు మాట్లాడుతూ, తెలుగు సంస్కృతి సాంప్రదాయాలను ఈతరం విద్యార్థులకు తెలియజేయడానికి సంక్రాంతి పండుగను కళాశాలలో ప్రతి సంవత్సరం జరుపుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులు రంగు రంగుల ముగ్గులు వేసి బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. భోగి మంటలు, గాలిపటాల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయ వస్త్రధారణతో సందడి చేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల పూర్వ అధ్యక్షుడు డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ నాగభూషణం, కమిటీ సభ్యులు ఎస్‌వీఎస్ లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ప్రత్యూష, ఫార్మాడీ డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య, కల్చరల్ కమిటీ కోఆర్డినేటర్లు డాక్టర్ జి.ఇందిరా ప్రియదర్శిని, డాక్టర్ వి.మౌనిక పాల్గొన్నారు

శ్రీ వికాస్ స్కూల్‌లో...

స్థానిక శ్రీవికాస్ స్కూల్‌లో శనివారం సంక్రాంతి సంబరాలు వైభవంగా జరిగాయి. పాఠశాల డైరెక్టర్ దాసరి రాజా మాష్టారు దంపతులు చిన్నారులపై భోగి పళ్లు పోసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా భోగి మంటలు వేసి సంక్రాంతి పండుగ విశిష్టతను చిన్నారులకు వివరించారు, ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి శ్రీదేవి రాజా మాష్టారు బహుమతులు అందజేశారు



శ్రీ వికాస్ స్కూల్‌లో జరిగిన వేడుకల్లో పాల్గొన్న విద్యార్థినులు

సీతారామయ్య హైస్కూల్లో...

గుంటూరు కార్పొరేషన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీపురంలోని శ్రీ పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల ప్రాంగణంలో శనివారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిద్ధార్థ అకాడమీ అఫ్ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ప్రెసిడెంట్ పాలడుగు లక్ష్మణరావు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు సంక్రాంతి పండుగ ప్రాముఖ్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, పాటలు, నృత్యాలు అతిధులను ఎంతోగానో అలరించాయి. ఈ సందర్భంగా పాఠశాల సెక్రెటరీ, కరెస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో సంప్రదాయాలు, సంస్కృతి పట్ల అవగాహన పెంపొందించడమే ఈ వేడుకల లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పాలక వర్గ గౌరవాధ్యక్షుడు, రాజ్యసభ మాజీ ఎంపీ డాక్టర్ యలమంచిలి శివాజీ, పాఠశాల పాలకవర్గ ఉపాధ్యక్షుడు డాక్టర్ సూర్యదేవర హనుమంతరావు, పాఠశాల పాలక వర్గ ట్రెజరర్ చేకూరి రామకోటేశ్వరరావు, పాఠశాల పాలకవర్గ సభ్యులు మదమంచి రవీంద్ర, గింజుపల్లి వరప్రసాదరావు, బొల్లేపల్లి శ్రీనివాస్, మాదల రాజేంద్రప్రసాద్, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్, కో-ఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



భోగీ మంటలను వేస్తున్న పాలడుగు లక్ష్మణరావు, పాటిబండ్ల విష్ణువర్ధన్ తదితరులు

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో...

గుంటూరు(విద్య),జనవరి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక సాంబశివపేటలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ బత్తుల ఉమాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో డాక్టర్ శనక్కాయల రాజకుమారి, కార్పొరేటర్ పోతురాజు సమత తదితరులు పాల్గొన్నారు. సంక్రాంతి సంబరాలు విద్యార్థినుల్లో ఆనందం, ఉత్సాహం, సాంస్కృతిక చైతన్యాన్ని నింపాయి.



వేడుకల్లో పాల్గొన్న అధ్యాపకులు, సిబ్బంది

ఆసక్తికరంగా నాటిక ప్రదర్శనలు

గుంటూరు(తూర్పు), జనవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ వేంకటేశ్వ విజ్ఞానమందిరంలో గుంటూరు కళాపరిషత్ నాటిక ప్రదర్శనలు రెండో రోజు కొనసాగాయి. శనివారం సభకు కళాపరిషత్ ఉపాధ్యక్షుడు నాయుడు గోపి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా సెంట్రల్ బ్యాంక్ డైరక్టర్ ఆర్ రాము, ప్రోగ్రెసివ్ ఫోరం సహాయ కార్యదర్శి సంగిరెడ్డి వాణి హాజరై నాటక రంగానికి కళా పరిషత్ చేస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం వైబి చౌదరి దర్శకత్వంలో చట్టాల లొసుగుల సమస్య నివారణపై వీరన్నపాలెం వారు ప్రదర్శించిన దీపంకింద చీకటి నాటిక ప్రేక్షకులను ఆలోచింపజేసింది. డి.వినయ్ దర్శకత్వంలో కాకినాడ వారు కన్నీటికి విలువెంత నాటికగా ప్రదర్శించారు. స్త్రీ శక్తి తిరుగుబాటు నేపథ్యంలో సాగే ఈ నాటిక అలరించింది. రైతు నోట్లో అందరూ మట్టి కొట్టేవాళ్లే అనే అంశంతో హైదరాబాద్ వారు కొల్లా రాధాకృష్ణ దర్శకత్వంలో ప్రదర్శించిన అన్నదాత నాటిక ప్రేక్షకులను కట్టిపడేసింది. సభకు కళాపరిషత్ కార్యవర్గ సభ్యుడు పోవూరి శివరామకృష్ణ ఆహ్వానం పలకగా, వక్తలుగా కార్యవర్గసభ్యులు ముత్యాల అమ్మిరాజు, ఆవుల సుబ్బారావు వ్యవహరించారు. కళాపరిషత్ అధ్యక్షుడు పి.మల్లికార్జునరావు, కార్యదర్శి గుమ్మడి నాగేశ్వరరావు, గౌరవ సలహాదారుడు అలోకం పెద్దబ్బయ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు.



కన్నీటికి విలువెంత నాటికలో ఓ సన్నివేశం

నేటి హిందూ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి

గుంటూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) శత వసంతాల వేడుకలను హిందూవులు జయప్రదం చేయాలని బీజేపీ అధికార ప్రతినిధి, గుంటూరు బాగ్ 1 ఆర్ఎస్ఎస్ ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఆదివారం అరండల్‌పేటలోని మాజేటి గురవయ్య పాఠశాలలో హిందూ సమ్మేళన కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా శృంగేరి విరూపాక్ష పీఠాధిపతులు, పర శివానంద భారతి స్వామి, జి.శివరామకృష్ణ ప్రసాద్, ఆర్ఎస్ఎస్ ప్రాంత సోషల్ మీడియా ప్రముఖ్ అవ్వారు శ్రీనివాస్ తదితరులు హాజరవుతున్నారన్నారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో ఆర్ఎస్ఎస్ స్థానిక పెద్దలు వక్కలగడ్డ రాజగోపాల్ రావు, మల్లాది రవికుమార్, సీలేరు సత్యనారాయణ, బండి లక్ష్మన్న, పెమ్మరాజు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న దర్శనపు శ్రీనివాస్, రాజగోపాలరావు, రవికుమార్ తదితరులు

రూ.12.50 లక్షలు కొట్టేసిన సైబర్ నేరగాళ్లు

● సీబీఐ అధికారులమంటూ విశ్రాంత పంచాయతీ సెక్రటరీకి బెదిరింపులు

గుంటూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : తాము ముంబై సీబీఐ అధికారులమని ఓ విశ్రాంత పంచాయతీ సెక్రటరీని బెదిరించి సైబర్ నేరగాళ్లు రూ.12.50 లక్షలు కొట్టేశారు. అరండల్‌పేట పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ముత్యాలరెడ్డి నగర్‌కు చెందిన విశ్రాంత పంచాయతీ సెక్రెటరీ కె రవిశంకర్ (64)కు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఫోన్ వచ్చింది. తాము ముంబై నుంచి వచ్చిన సీబీఐ అధికారులమని చెప్పారు. మీ కెనరా బ్యాంకు ఖాతా నుంచి పెద్ద మొత్తంలో హవాల లావాదేవీలు జరగాయని, దానికి సంబంధించి ఓ వ్యక్తిని గుర్తించగా ఆయన ఖాతాలో మీ వివరాలు వచ్చాయని, దీనిపై మీ మీద కేసు నమోదు చేస్తున్నామని రవిశంకర్‌ను, ఆయన భార్యను బెదిరించారు. వారిని డిజిటల్ అరెస్టు పేరుతో బెదిరించి వారి ఖాతాలో ఉన్న నగలతో పాటు ఒంటి మీద ఉన్న బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టించి సుమారు 12.50 లక్షలు కొట్టేశారు. మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌తో ఢీ కొట్టి సెల్‌ఫోన్ గుంజుకెళ్ళిన అగంతకులు

గుంటూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని మిర్చియార్డు వై జంక్షన్ వద్ద అగంతకులు రెచ్చిపోయారు. వై జంక్షన్ సమీపంలోని ఓ కంపెనీలో కూలి పని చేస్తున్న హనుమాన్ నగర్‌కు చెందిన తలపల నాగ గణేష్ గత నెల 26న ఉదయం రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనంపై వేగంగా వచ్చిన ముగ్గురు ఢీకొట్టారు. ఆయన కింద పడిపోవడంతో ఆయన చేతిలో ఉన్న సెల్‌ఫోన్ గుంజుకుని అగంతకులు ద్విచక్ర వాహనంపై పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వృద్ధుడు మృతి

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన శనివారం తాడేపల్లి సమీపంలో జరిగింది. సుమారు 70 నుంచి 75 సంవత్సరాల వయసున్న వృద్ధుడు రైల్లో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు జారి పడి మరణించాడు. ఈయన వివరాలు తెలిసిన వారు గుంటూరు జీఆర్‌పీ ఎస్ఐను 9247585719లో సంప్రదించాలని రైల్వే పోలీసులు కోరారు.



విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న డైరెక్టర్ నిమ్మగడ్డ వెంకటరావు తదితరులు

రెండో తరగతి విద్యార్థినికి వరల్డ్ రికార్డ్స్‌లో చోటు

● హనుమాన్‌చాలీసా, భగవద్గీత శ్లోకాల పఠనంలో రికార్డు

గుంటూరు(విద్య), జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రెండో తరగతి విద్యార్థిని వరల్డ్ రికార్డ్స్‌లోకి ఎక్కింది. స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని కుందుల రోడ్డు టైనీటాట్స్ స్కూల్‌లో రెండో తరగతి చదువుతున్న రేగుల ఖ్యాతి గాయిత్రి హనుమాన్‌చాలీసా, భగవద్గీత శ్లోకాలు చూడకుండా వల్లేవేసి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లోకి ఎక్కిందని పాఠశాల డైరెక్టర్ నిమ్మగడ్డ వెంకటరావు వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థినిని, ఆమె తల్లిదండ్రులు రేగుల దీప్తి, రాజశేఖర్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ వీణా, వైస్ ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, డైరెక్టర్లు సుధాకరరెడ్డి, ఆనంత తదితరులు అభినందించారు.

చదువుతోపాటు నైతిక విలువలు పెంపొందించాలి

గుంటూరు(విద్య), జనవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ప్రముఖ గుండెవైద్య నిపుణులు ఆళ్ళ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యాభవన్‌లో నిర్వహించిన 41వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ఏకాగ్రత, సమయపాలన ఎంతో ముఖ్యమని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి పి.రామచంద్రరాజు, కోశాధికారి కె.రామసుభాష్, ఎస్‌వీఎస్ లక్ష్మీనారాయణ, ప్రిన్సిపాల్ హేమాంబ, హెచ్ఎం సీహెచ్ ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒలంపియాడ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అకట్టుకున్నాయి.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఆళ్ళ శ్రీనివాసరెడ్డి తదితరులు



కాకుమాను వారి తోటలో గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర

తూర్పు నియోజకవర్గంలో సంక్రాంతి సంబరాలు

● ఏర్పాట్లను పరిశీలించిన నగర మేయర్ రవీంద్ర

గుంటూరు కార్పొరేషన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 13, 14, 15వ తేదీలలో సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని కాకుమాను వారి తోట 7వ లైన్‌లోని ప్రభుత్వ స్థలంలో జరుగుతున్న సంక్రాంతి సంబరాలు ఏర్పాట్లను గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిధిలో మొదటిసారిగా సంక్రాంతి సంబరాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, సంబరాల నిర్వహణలో ఎటువంటి లోపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.



ఉరుసు మహోత్సవంలో బాబాకు చాదర్ తీసుకెళ్తున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

ఉరుసు ఉత్సవాల్లో ఎమ్మెల్యే మాధవి

● మస్తాన్‌వలి బాబాకు చాదర్ సమర్పణ

గుంటూరుకార్పొరేషన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నగరంలో వైభవంగా నిర్వహిస్తున్న హజరత్ కాలేషా మస్తాన్ వలి బాబా ఉరుసు ఉత్సవాల్లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబా దర్గా వద్ద చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఉరుసు ఉత్సవాలు సాంస్కృతిక ఐక్యతకు ప్రతీక అని అన్నారు. ఇలాంటి వేడుకలు సమాజంలో సామరస్యం, సోదరభావాన్ని బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దర్గా నిర్వాహకులు, ముస్లిం పెద్దలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న షేక్ లాల్‌వజీర్, పాల్గొన్న టీడీపీ మైనార్టీ నాయకులు

అమరావతి అభివృద్ధిని అడ్డుకుంటున్న జగన్

● టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధానకార్యదర్శి లాల్‌వజీర్

గుంటూరు (తూర్పు), జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా రాజధాని అమరావతి అభివృద్ధిని అడ్డుకునేం దుకు వైసీపీ నేత జగన్ కుట్ర పన్నుతు న్నారని టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధానకార్యదర్శి షేక్ లాల్ వజీర్ ఆరోపించారు. స్థానిక అరండల్‌పేట టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజధాని అభివృద్ధిని ఓర్వలేక మతి భ్రమించి జగన్ మాట్లాడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం చేపట్టిన రెండో దఫా భూముల సేకరణను అడ్డుకునేందుకు కుటిల ప్రయత్నాలు మొదలు పెట్టారని ఆరోపించారు. అమరావతి అభివృద్ధిలో అధిక శాతం మైనార్టీలు ఉన్నారని, వారి ఉపాధిపై జగన్ దెబ్బకొడుతున్నారన్నారు. మైనార్టీ నాయకులు ఈ విషయాన్ని గ్రహించి జగన్‌కు తగిన బుద్ధి చెప్పాలన్నారు. అనంతరం షేక్ బాజి మాస్టర్ మాట్లాడుతూ, టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్‌కు భారతరత్న పురస్కారాన్ని ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావే శంలో ఆదాం షఫీ, అబ్దుల్ ఖాదర్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

14న పడి పూజా మహోత్సవం

గుంటూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): భోగీ పర్వదినం సందర్భంగా ఈనెల 14న చుట్టుగుంట పోలేరమ్మ తల్లి ఆలయం వద్ద అయ్యప్పస్వామి మహా పడి పూజా మహోత్సవం నిర్వహించనున్నట్లు అయ్యప్ప స్వామి భక్త బృందం సభ్యులు తాటి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. అరటి బోదె లతో ఐదు మండపాలు, 11 అభిషేకాలతో అంగరంగ వైభవంగా ఈ మహోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే సాయంత్రం మక ర జ్యోతి వెలిగించి భక్తులకు దర్శనం అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. ఈ సందర్భంగా చుట్టుగుంట పోలే రమ్మ తల్లి అయ్యప్పస్వామి భక్త బృందం వారితో ఆర్కెస్ట్రా నిర్వ హించి అయ్యప్ప గీతాలు ఆలపించనున్నట్లు చెప్పారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

హరివిల్లు.. విరిజల్లు

విజయవాడలో ఘనంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్



బాపట్ల మహిళకు ప్రథమ బహుమతి

కోనసీమ, చిత్తూరు, కర్నూలు, తమిళనాడుకు ద్వితీయ బహుమతులు

ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై: సన్‌ఫీస్ట్ మ్యాజిక్ మామ్స్ బిస్కెట్, టేస్ట్ పార్టనర్ స్వస్తిక్ మసాలా, ప్రేయర్ పార్టనర్ పరిమళ్ మందిర్ భారత్‌వాసి అగరబత్తీ.. ఫైనల్స్ శనివారం విజయవాడలోని ఎస్‌ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాల ప్రాంగణంలో అంగ'రంగుల' వైభవంగా జరిగాయి. రాష్ట్రంలోని 28 జిల్లాల్లో జరిగిన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వారితో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కలిపి మొత్తం 30 మంది మహిళలు ఫైనల్స్‌లో పాల్గొన్నారు. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వర రావు సతీమణి సుజాత జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించగా, బహుమతి ప్రదానోత్సవానికి రాష్ట్ర క్రియేటివిటీ అండ్ కల్చర్ అకాడమీ చైర్‌పర్సన్ పొడపాటి తేజస్వి హాజరయ్యారు. ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ టి.సురేష్ కుమార్, విజయవాడ యూనిట్ మేనేజర్ వేమూరి మురళీ పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, కొండ్రెడ్డి రమాదేవి వ్యవహరించారు. బాపట్ల జిల్లాకు చెందిన టి.నాగలక్ష్మి ప్రథమ బహుమతి పొందగా, కోనసీమ జిల్లాకు చెందిన మల్లేశ్వరి, చిత్తూరు జిల్లాకు చెందిన ఏ.సునీత, కర్నూలు జిల్లాకు చెందిన బి.వసంత, తమిళనాడుకు చెందిన కె.భార్గవి ద్వితీయ బహుమతులు పొందారు. 25 మందికి కన్సొలేషన్ బహుమతులు అందజేశారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ



సందడిగా ముగ్గుల పోటీల ఫైనల్స్ (ఇన్‌సెట్‌లో) పోటీదారులతో కలిసి జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభిస్తున్న బొండా సుజాత



ద్వితీయ బహుమతుల విజేతలు (కుడి నుంచి ఎడమకు) ఏ.సునీత (చిత్తూరు), మల్లేశ్వరి (కోనసీమ), బి.వసంత (కర్నూలు), కె.భార్గవి (తమిళనాడు)కు చెక్కులు అందజేస్తున్న రాష్ట్ర క్రియేటివిటీ అండ్ కల్చర్ అకాడమీ చైర్‌పర్సన్ తేజస్వి, ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ సురేష్‌కుమార్, న్యాయనిర్ణేతలు రత్నలక్ష్మి, రమాదేవి




కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న ఎన్.భవానీ, బి.అఖిల, పి.లావణ్య, టి.సింధుజ, కె.నాగమణి, బి.లక్ష్మి, పి.జగదీశ్వరి, ఎస్.రమ్య, పి.దేవి, పి.పావని, జి.అమ్మాజీ, జి.దుర్గాభవానీ, ఎన్.శాంతి, సీహెచ్ విజయలక్ష్మి, కె.చందన, కె.శ్రావణి, ఎం.ప్రత్యూష, కె.పద్మజ, జి.ప్రతిభ, పి.ఇందిర, పి.సుమలత, ఎ.జయంతి, ఎస్.సునీత, కె.ప్రసన్నలక్ష్మి, కె.శ్రీదేవి

డ్రగ్స్ ముట్టుకుంటే దేశద్రోహులవుతారు

● ఈగల్ ఐజీ రవికృష్ణ ● సిబార్ దంత వైద్య కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

పెదకాకాని, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ ముట్టుకుంటే దేశద్రోహులవుతారని... పోలీస్ అంటే భయం కాదు భరోసా అని ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ తెలిపారు. శనివారం తక్కెళ్ళపాడు సిబార్ దంత వైద్య కళాశాలలో జరిగిన ఫ్రెషర్స్ డే వేడుకలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐజీ రవికృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. ప్రతి వృత్తిలోనూ ఒత్తిడి ఉంటుందని, వాటన్నింటిని అధిగమించేందుకు యోగా, మెడిటేషన్ అవలంబించాలన్నారు. ఎవరైనా డ్రగ్స్‌కు బానిసయితే 1972కు కాల్ చేయాలని సూచించారు. ఏదైనా సమస్య ఉంటే 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ఒకసారి డ్రగ్స్‌కి అలవాటు పడితే జీవితం సర్వనాశనం అయిపోతుందన్నారు. తాను ఇంటర్మీడియట్ చదివేటప్పుడు మధ్యలో మానేశానని, ఆ తర్వాత మరలా చదవడం ప్రారంభించానని ఐజీ తెలిపారు. డ్రగ్స్ కేసులో ఇరుక్కుంటే కనీసం పదేళ్లు జైలు శిక్ష పడుతుందన్నారు. విద్యార్థులతో నో డ్రగ్ అంటూ నినాదాలు చేయించారు. కళాశాల డీన్ డాక్టర్ ఎల్.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ తమ కళాశాలలో నిరంతరం యాంటీ నార్కోటిక్‌పై కార్యక్రమాలు చేపడుతూ ఉంటామన్నారు. తమ కళాశాలలో డ్రగ్స్‌కి ఎటువంటి అవకాశం లేదన్నారు. అనంతరం జరిగిన ఫ్రెషర్స్ డే వేడుకల్లో విద్యార్థులు సినీ, జానపద, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరింపజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయి శంకర్, డాక్టర్ కృష్ణమోహన్, రమణారెడ్డి, డాక్టర్ ఎల్.దుర్గాప్రసాద్, డాక్టర్ మన్నే ప్రకాష్ పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఈగల్ ఐజీ రవికృష్ణ, వేదిక పైన డాక్టర్ కృష్ణ ప్రసాద్ తదితరులు

పీఆర్సీ కమిషన్‌ను నియమించాలి

(5వ పేజీ తరువాయి)

రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య ఉండాలంటే ఊరి బడిని రక్షించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ బకాయి ఉన్న డీఏలతో పాటు 29 శాతం ఐఆర్‌ను ప్రకటించాలన్నారు. ఉపాధ్యాయులకు బోధన కంటే బోధనేతర కార్యక్రమాలు ఎక్కువ కావడం వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని తెలిపారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీ గోపి మూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ ఎమ్మెల్సీ, జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ మూడు రకాలుగా ఉన్న పాఠశాలల వ్యవస్థను వైసీపీ ఆరు రకాలుగా మారిస్తే కూటమి ప్రభుత్వం తొమ్మిది రకాలుగా మార్చిందని విమర్శించారు. తొలుత గుంటూరులో యూటీఎఫ్ ఉపాధ్యాయులు ఏసీ కళాశాల నుంచి వెంకటేశ్వర విజ్ఞాన మందిరం మీదగా భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సమావేశంలో పీడీఎఫ్ మాజీ ఎమ్మెల్సీ, యూటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఐవీరావు, దేవరాజ్ మహారాజు, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కే శ్రీనివాసరావు, సహాధ్యక్షుడు కే సురేష్‌కుమార్, కుసుమ కుమారి, రాష్ట్ర ట్రెజరర్ రెడ్డి మోహన్ రావు, రాష్ట్ర కార్యదర్శులు బీ లక్ష్మీరాజా మురళిమనోహర్, అరుణకుమారి, నవ కోటేశ్వరరావు, ఉమామహేశ్వరరావు, ఎస్ఎస్ నాయుడు, జీవీ రమణ, శ్రీలక్ష్మి, కిశోర్, సుభాషిణి, చక్రవర్తి, దుర్గారావు, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న యూటీఎఫ్ నాయకులు

డాక్టర్ గూగుల్

(5వ పేజీ తరువాయి)

అవసరమైన షూ, జిమ్ పరికరాలు, సప్లిమెంట్లు, పోషకాలు, ప్రత్యామ్నాయ వైద్యం, చర్మంపై శ్రద్ధ, శారీరక దృఢత్వం, శరీర బరువు నిర్వహణ, మానసిక ఆరోగ్యం, నిద్ర, రోగ నిరోధక శక్తి, అధునాతన వైద్యం, డీటాక్సిఫికేషన్, ప్రొటీన్ దొరికే ఆహారం, పిల్లలకు అందాల్సిన పోషణ, సెలబ్రిటీల ఆహార అలవాట్లపై అధికంగా శోధన జరిగింది. బరువు తగ్గించే జీఎల్పీ-1 మందులు, జ్ఞాపకశక్తి పెంచే సప్లిమెంట్లు, హార్మోన్ల ట్రాకింగ్ కోసం భారీగా శోధనలు జరిగాయి. అందం, మానసిక స్థితి, పోషకాహారం, పేగు ఆరోగ్యం, రోగనిరోధక శక్తి, వృద్ధాప్యంతోపాటు చర్మం, జుట్టు ఆరోగ్యానికి సహకరించే ఔషధాలు, మల్టీవిటమిన్లపై శోధనలు జరిగాయి. చక్కెర రహిత, చక్కెర ప్రత్యామ్నాయాల కోసం చేసే సెర్చ్‌లలో గతంలో కంటే 14 శాతానికి పెరిగాయి. మహిళలు నెలసరి సమస్యలపై అనేక ప్రశ్నలను అడుగుతున్నారు. రుతుచక్రంలోని దశలపై ఆసక్తి 100 శాతానికి పైగా పెరిగింది. మెలటోనిన్ సంబంధిత ట్యాబ్లెట్లు, స్ప్రేలపై బాగా వెతికారు.

అవగాహన అవసరమే...



దినచర్య, ఇతర సమస్యలపై అవగాహన మంచి దే. ఆచరణలో నిపుణుల సలహాలు అవసరం. ఔషధాల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ప్రతి ఔషధానికి దుష్ప్రభావాలు ఉంటాయి. వైద్యుడి సూచనలే ముఖ్యం. శరీరస్థితి మేరకే మందులు తీసుకోవాలి. బరువు నియంత్రణ, శ్వాసకోశ, ఛాతి నొప్పి వంటి సమస్యలపై వైద్యుడ్ని సంప్రదించాలి. అంతే తప్ప సోషల్ మీడియా వేదికలను ఆశ్రయించవద్దు.

- ఎన్ ఉమాజ్యోతి, ప్రొఫెసర్, మానసిక వ్యాధుల నిపుణులు, జీజీహెచ్



సరస్‌లో స్టాళ్ల సందర్శనకు తరలి వచ్చిన ప్రజలు



స్టాల్‌లో కొనుగోలు చేస్తున్న మహిళలు

ఆకట్టుకుంటున్న.. సరస్

(5వ పేజీ తరువాయి)

ఇతర ఆహార పదార్థాలు

- 17లో బాడ్జెస్, కార్పొరేట్ గిఫ్టింగ్ ఐటమ్స్
- 20లో మధ్యప్రదేశ్ మల్బరీ సిల్క్‌తో తయారుచేసిన దుప్పట శారీస్, చుడీదార్స్
- 25లో విజయనగరం బీమిలి మామిడి తాండ్ర, పచ్చళ్లు, తాటి బెల్లం
- 28లో అనకాపల్లి జిల్లా వనసంజీవిని అయిర్ కుటీర్ ఆయుర్వేద మందులు
- 29లో అనకాపల్లి జిల్లా ఏటికొప్పాక అలంకరణ లక్క బొమ్మలు
- 62, 68లో జమ్మూకశ్మీర్ డిజైన్ శారీస్, టాప్స్ డ్రెస్ మెటీరియల్, చుడీదార్స్
- 64లో త్రిపుర నాచురల్ ప్రీమియం టీ పొడులు,బేబీకార్న్, పైనాపిల్, బ్యాంబో షాట్స్
- 66లో కర్ణాటకకు చెందిన ఆయుర్వేద వనమూలికలు
- 72,85లో వెస్ట్ బెంగాల్ హ్యాండ్ క్రాఫ్ట్ బెడ్‌షీట్స్ టేబుల్ క్లాస్ డ్రెస్ మెటీరియల్
- 80, 81లో గోవా చీరలు, చుడీదార్స్ డ్రెస్ మెటీరియల్స్
- 84, 88లో ఉత్తరప్రదేశ్ నుంచి లెదర్ షూస్, బెల్టులు పర్సులు, కోట శారీస్
- 102లో హర్యానా ప్రింటెడ్ బెడ్ షీట్లు
- 103లో జైపూర్ బ్లాంకెట్లు
- 126లో ఉత్తరాఖండ్ హ్యాండీ క్రాఫ్ట్ చెప్పులు లెదర్ ఉత్పత్తులు
- 127లో ఒరిస్సా కాయర్, ఉడెన్, క్లాత్ అలంకారణ వస్తువులు.

ధరలు అందుబాటులో ఉన్నాయి

-ఎండీ రియాజ్ వున్నీసా, పొన్నూరు

మేళాలోని వస్తువులు నాణ్యంగా ఉన్నాయి. ధరలు అందుబాటులో ఉన్నాయి. కుటుంబ సమేతంగా రావడం ఆనందంగా ఉంది. ఏటా ప్రభుత్వం ఇలాగే డ్వాక్రా బజార్ నిర్వహించాలి.



డ్వాక్రా సంఘాల నైపుణ్యం చూస్తున్నాం

-ప్రఫుల్లా దేవి, చిలకలూరిపేట

గుంటూరులో ఇంత పెద్ద ఎత్తున డ్వాక్రా బజార్ ఏర్పాటు చేయడం ప్రజలకు చాలా ఉపయోగకరం. డ్వాక్రా సంఘాల సభ్యుల వ్యాపార నైపుణ్యాన్ని ప్రజలు ప్రత్యక్షంగా చూడగలుగుతున్నారు.



కొయ్య బొమ్మలు ఆకట్టుకున్నాయి

-సాయి ప్రతిమ, తాడేపల్లిగూడెం



చేతివృత్తుల కొయ్య బొమ్మలు, ఇతర వస్తువులు ఎంతో ఆకట్టుకున్నాయి. పిల్లలకు అవసరమైన వస్తువులు విస్తృతంగా అందు బాటులో ఉన్నాయి.

జమ్ము, కశ్మీర్ వస్త్రాలు సూపర్

- భాను, విజయవాడ

కేరళ, జమ్ముకశ్మీర్, పంజాబ్, ఒడిశా రాష్ట్రాల చేనేత వస్త్రాలు ప్రత్యేకంగా నచ్చాయి. సెలవు దినాల్లో మేళా నిర్వహించడం వల్ల కుటుంబ సమేతంగా వచ్చి కొనుగోలు చేయగలుగుతున్నాం.



జనాభా లెక్కలకు ఏర్పాట్లు

(5వ పేజీ తరువాయి)

పూర్తి చేసేందుకు కేంద్రం ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వడంతో వివిధ స్థాయిలో కార్యనిర్వాహకులను చీఫ్ సెక్రెటరి విజయానంద్ శనివారం నియమించారు.

సబ్-జిల్లా స్థాయి బృందం

సబ్ కలెక్టర్/ఆర్డీవో సబ్ డివిజనల్ సెన్సస్ అధికా రిగా ఉంటారు. ఛార్జ్ సెన్సస్ అధికారిగా ఎంఆర్‌వో కార్యాలయాల్లోని తహసీల్దార్లు, అదనపు ఛార్జ్ సెన్సస్ అధికారులుగా ఎంపీడీవోలు, అసిస్టెంట్ ఛార్జ్ సెన్సస్ అధికారులు/సెన్సస్ క్లర్క్ ఇన్‌చార్జ్ అధికారులుగా డిప్యూటీ తహసీల్దార్/అంతకంటే తక్కువస్థాయి అధికారి ఉంటారు.

పట్టణ స్థాయిలో..

మున్సిపాలిటీ/నగర పంచాయతీ అధికారులు ఛార్జ్ సెన్సస్ అధికారులుగా వ్యవహరిస్తారు. అదనపు ఛార్జ్ సెన్సస్ అధికారులుగా టౌన్‌ప్లానింగ్ అధికారి/టీపీఎస్/డీ ఈఈ/ఏ ఈఈ/మున్సిపాలిటీలో రెవెన్యూ అధికారి ఉంటారు. మున్సిపల్ కార్పొరేషన్ స్థాయిలో కమిషనర్ ప్రిన్సిపల్ సెన్సస్ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తారు. అదనపు కమిషనర్ సిటీ సెన్సస్ అధికారిగా, జోనల్/డిప్యూటీ కమిషనర్/అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఛార్జ్ సెన్సస్ అధికారిగా బాధ్యతలు చూసుకొంటారు. అదనపు ఛార్జ్ సెన్సస్ అధికారిగా టీపీవో/టీపీఎస్/డీఈఈ/ఏఈఈ/ఆర్‌వో/ఆర్ఐ/ఏపీడీలు వ్యవహరిస్తారు. సహాయక ఛార్జ్ సెన్సస్ అధికారిగా టీపీవో/టీపీఎస్/డీఈఈ/ఏఈఈ/ఆర్‌వో/ ఆర్ఐ ఉంటారు.

బిజినెస్ ప్లస్

గుంటూరు ● ఆదివారం 11 జనవరి 2026

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,40,460 ▲	1,28,750 ▲	2,75,000 ▲
విజయవాడ	1,42,000 ▲	1,31,000 ▲	2,52,000 ▲
విశాఖపట్నం	1,40,460 ▼	1,28,750 ▲	2,75,000 ▲
రాజమండ్రి	1,40,450 ▲	1,28,750 ▲	2,49,000 ▲
ప్రొద్దుటూరు	1,41,450 ▲	1,30,130 ▲	2,54,000 ▲
ముంబై	1,37,122 ▲	1,28,200 ▲	2,42,808 ▲

కరీంనగర్‌లో సరికొత్తగా
మలబార్ గోల్డ్ షోరూమ్



హైదరాబాద్: జువెలరీ రిటైలర్ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ కరీంనగర్‌లో షోరూమ్‌ను ప్రారంభించింది. సరికొత్త రూపం, అప్‌గ్రేడెడ్ ఫార్మాట్‌లో ఈ షోరూమ్‌ను ప్రారంభించినట్లు మలబార్ ప్రకటించింది. కరీంనగర్ శాసన సభ్యులు గంగుల కమలాకర్ ఈ షోరూమ్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఉత్తర తెలంగాణలో ఆభరణాల కొనుగోలులో తమకంటూ ప్రత్యేక గుర్తింపు ఉండాలన్న ఆలోచనతో పాటు వినియోగదారులకు షాపింగ్ అనుభూతిని మరింతగా పెంచాలన్న ఆలోచనకు తగ్గట్టుగా సరికొత్త రూపంతో ఈ కొత్త షోరూమ్‌ను ప్రారంభించినట్లు తెలిపింది. ఈ కార్యక్రమంలో మలబార్ గోల్డ్ రిటైల్ ఆపరేషన్స్ హెడ్ సిరాజ్ పీకే, తెలంగాణ జోనల్ హెడ్ షానిబ్ పాల్గొన్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

11వ తేదీ			
హైదరాబాద్	560	విజయవాడ	600
వరంగల్	562	గోదావరి	585
చిత్తూరు	603	విశాఖపట్నం	585
		డజను గుడ్లు రూ.	84

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	156	విజయవాడ	152
వరంగల్	156	గుంటూరు	159
కరీంనగర్	156	ఒంగోలు	159
మహబూబ్‌నగర్	156	చిత్తూరు	158
కర్నూలు	156	నెల్లూరు	163
విశాఖపట్నం	148	అనంతపురం	163
గోదావరి	152		

గృహ రుణం తీసుకుంటున్నారా..
చార్జీల భారం తగ్గించుకోండిలా



జీవితంలో తొలిసారిగా గృహ రుణం తీసుకుంటున్నారా? అయితే చాలా జాగ్రత్తగా ఉండాల్సిందే. రుణం తీసుకునేటప్పుడు బ్యాంకులు, గృహ ఫైనాన్సింగ్ కంపెనీలు (హెచ్ఎఫ్‌సీ) మనకు సవాలక్ష నిబంధనలు పెడతాయి. ఒప్పందాలపై సంతకాలు పెట్టించుకుంటాయి. అయితే ఇందులో కొన్ని మనకు కొన్ని భారంగా ఉంటాయి. అందుకే రుణం తీసుకునే ముందు రుణ ఒప్పందాన్ని ఒకటికి రెండుసార్లు క్షుణ్ణంగా చదవండి. లేకపోతే గృహ రుణంపై వడ్డీతో పాటు కొన్ని రహస్య చార్జీల భారం తప్పదు. వీటి గురించి తెలిసినప్పుడే మనం ఆ భారాన్ని కొంత మేరకు తగ్గించుకోగలుగుతాం. ఆ వివరాలు మీ కోసం..

ప్రాసెసింగ్, లీగల్ చార్జీలు

దరఖాస్తు చేసిన వెంటనే గృహ రుణం రాదు. బ్యాంకులు లేదా గృహ ఫైనాన్స్ కంపెనీ (హెచ్ఎఫ్‌సీ) ఆ దరఖాస్తును, దాంతో పాటు సమర్పించిన కొన్ని పత్రాలను పరిశీలించి, నిర్ధారించాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రాసెసింగ్, లీగల్, అడ్మినిస్ట్రేటివ్ ఫీజుల పేరుతో ముందుగా కొన్ని ఫీజులు వసూలు చేస్తాయి.

- ప్రాసెసింగ్ ఫీజు ఒక పరిమితికి లోబడి రుణ మొత్తంలో 0.25 శాతం నుంచి 1 శాతం వరకు ఉంటుంది.
- కొనే ఇంటి యాజమాన్య హక్కు పత్రాల నిర్ధారణ, మార్కెట్ విలువ మదింపు చేసేందుకు రూ.5,000 నుంచి రూ.15,000 వరకు లీగల్ అండ్ టెక్నికల్ వెరిఫికేషన్ ఫీజుగా వసూలు చేస్తారు.
- పండగల సీజన్‌లో బ్యాంకులు, హెచ్ఎఫ్‌సీలు గృహ రుణాల ప్రాసెసింగ్, లీగల్ చార్జీలను మినహాయిస్తుంటాయి.

కన్వర్షన్ చార్జీలు

ఆర్‌బీఐ రెపో రేటు మారినప్పుడల్లా వడ్డీ రేట్లు మారిపోతుంటాయి. ఆ ప్రభావం గృహ రుణాలపైనా పడుతుంది. అలాంటప్పుడు గృహ రుణాలు తీసుకున్న చాలా మంది వడ్డీ ఆదా కోసం ఫిక్స్‌డ్ వడ్డీ రేట్ల నుంచి ఫ్లోటింగ్ రేట్లకు లేదా ఫ్లోటింగ్ నుంచి ఫిక్స్‌డ్ రేట్లకు మారుతుంటారు. ఇందుకు బ్యాంకులు ఇంకా చెల్లించాల్సిన రుణ మొత్తంలో 0.25 శాతం నుంచి 0.5 శాతం కన్వర్షన్ చార్జీగా వసూలు చేస్తాయి. కొన్ని బ్యాంకులు ఇలా మారడానికీ పరిమితులు పెడతాయి. ఇలా మారడం వల్ల అయ్యే వడ్డీ పొదుపు, కన్వర్షన్ చార్జీల కంటే ఎక్కువగా ఉంటేనే మారాలి.

ఆలస్యంగా చేసే చెల్లింపులపై చార్జీలు

ఆలస్యంగా జీతాలు అందడం, మెడికల్ ఎమర్జెన్సీ లేదా మర్చిపోవడం వల్ల ఒక్కోసారి నిర్ణీత గడువు లోపు గృహ రుణాల ఈఎంఐ చెల్లించలేకపోవచ్చు. అలాంటప్పుడు కూడా బ్యాంకులు ఐదు నుంచి పది రోజుల వరకు గడువు ఇస్తాయి. ఆ గడువు కూడా దాటిపోతే చెల్లించాల్సిన ఈఎంఐలపై 3 శాతం వరకు పెనాల్టీ చార్జీలు విధిస్తాయి. ఈఎంఐ చెల్లింపుల కోసం ఇచ్చిన చెక్కు బౌన్స్ అయినా చార్జీలు తప్పవు. ఈ ప్రభావం ఆయా వ్యక్తుల పరపతి స్కోరుపైనా పడుతుంది.

బీమా పాలసీలు అంటగట్టడం

గృహ రుణాలు తీసుకునే వారికి బ్యాంకులు సాధారణంగా ప్రాపర్టీ ఇన్సూరెన్స్, లోన్ ప్రొటెక్షన్ పేరుతో రెండు రకాల బీమా పాలసీలు అంటగడతాయి. ఇందులో ప్రాపర్టీ ప్రొటెక్షన్ పాలసీ ద్వారా తమ రుణంతో కొనుగోలు చేసిన ఇంటికి అగ్ని ప్రమాదం, ప్రకృతి వైపరీత్యాలు, ఇతర కారణాలతో జరిగే నష్టాల నుంచి రక్షణ లభిస్తుంది. రెండోది టర్మ్ పాలసీ. ఈ పాలసీ ద్వారా గృహ రుణం మొత్తం చెల్లించే లోపు చెల్లింపుదారునికి ఏదైనా జరగరానిది జరిగితే తన రుణ చెల్లింపులకు ఢోకా లేకుండా చేస్తుంది. ప్రాపర్టీ ఇన్సూరెన్స్ దాదాపు తప్పనిసరి. లోన్ ప్రొటెక్షన్ పాలసీని మాత్రం గృహ రుణం ఇచ్చే బ్యాంకు చెప్పిన బీమా కంపెనీ నుంచే తీసుకోవాల్సిన అవసరం లేదు. అదే రక్షణ ఫీచర్లతో తక్కువ ప్రీమియంతో ఇచ్చే బీమా కంపెనీ నుంచి కూడా తీసుకోవచ్చు.

గృహ రుణం తీసుకునే ముందే ఈ చార్జీల గురించి తెలుసుకోవాలి. వీలైనంత వరకు ఫెస్టివల్స్ సీజన్‌లో గృహ రుణాలకు వెళ్లడం మంచిది. అప్పుడైతే బ్యాంకులు, హెచ్ఎఫ్‌సీలు ప్రాసెసింగ్ ఫీజులు రద్దు చేసి మరీ రుణాలు ఇస్తుంటాయి.

ముందస్తు చెల్లింపులపై చార్జీలు

గృహ రుణాన్ని పూర్తిగా లేదా పాక్షికంగా ముందుగా చెల్లించేటప్పుడు ఈ ఫీజులు వర్తిస్తాయి. భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) నిబంధనల ప్రకారం ఫ్లోటింగ్ వడ్డీ రేటు గృహ రుణాల ముందస్తు చెల్లింపులకు ఈ చార్జీలు వర్తించవు. అయితే ఫిక్స్‌డ్ (స్థిర) వడ్డీ రేటు లేదా హైబ్రిడ్ వడ్డీ రేటు గృహ రుణాల ముందస్తు చెల్లింపులపై మాత్రం ఈ చార్జీలు తప్పవు. ఈ చార్జీలు ఇంకా చెల్లించాల్సిన అసలు అప్పుపై 4 శాతం వరకు ఉంటాయి. ఒకవేళ గృహ రుణాన్ని పాక్షికంగానే చెల్లిస్తే బ్యాంకులు లేదా హెచ్ఎఫ్‌సీలు, రుణ చెల్లింపు కాలాన్ని తగ్గించి ఈఎంఐలను యథాతథంగా ఉంచుతాయి. దీనివల్ల ఈఎంఐల భారం యథాతథంగా ఉన్నా, రుణం తీరేసరికి పెద్దమొత్తంలో వడ్డీ భారం తప్పుతుంది. అయితే ఖాతాదారులు చెల్లింపుల కాలవ్యవధిని అలాగే ఉంచమని కోరి, ఈఎంఐల చెల్లింపుల భారం తగ్గించుకోవచ్చు.

రుణ బదిలీ చార్జీలు

ప్రస్తుతం గృహ రుణాల కోసం బ్యాంకుల మధ్య పోటీ పెరిగింది. గృహ రుణ చెల్లింపులు సక్రమంగా ఉన్న ఖాతాదారులను గుర్తించి.. మీ మిగిలిన గృహ రుణాన్ని మా బ్యాంకుకు బదిలీ చేస్తే మరింత తక్కువ వడ్డీ రేటు ఆఫర్ చేస్తామని ఊరిస్తుంటాయి. దీంతో చాలా మంది నిర్ణీత కాలం తర్వాత తమ రుణ ఖాతాను ఒక బ్యాంకు నుంచి మరో బ్యాంకుకు బదిలీ చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. అయితే ఇక్కడ మళ్లీ కొత్తగా బదిలీ అయ్యే బ్యాంకుకూ ప్రాసెసింగ్, లీగల్, వాల్యుయేషన్ మదింపు చార్జీలు, మెమోరాండం ఆఫ్ డిపాజిట్ ఆఫ్ టైటిల్ డీడ్ (ఎంఓడీటీ) చార్జీలు చెల్లించక తప్పదు. గృహ రుణ ఖాతాను వేరే బ్యాంకుకు బదిలీ చేసేటప్పుడు ఈ ఫీజులన్నిటిని పరిగణనలోకి తీసుకోవాలి. ఇవన్నీ పోను కొత్త బ్యాంకు కనీసం 1 లేదా 1.5 శాతం తక్కువ వడ్డీ ఆఫర్ చేస్తేనే మీ గృహ రుణ ఖాతాను ఆ బ్యాంకుకు బదిలీ చేయాలి.

సీఈఆర్ ఎస్ఏఐ చార్జీలు

సెంట్రల్ రిజిస్ట్రీ ఆఫ్ సెక్యూరిటైజేషన్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ అండ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ ఆఫ్ ఇండియా (సీఈఆర్ఎస్ఏఐ) దీని పూర్తి పేరు. ఒక ఇంటి తాకట్టుపై పదే పదే రుణాలు పొందకుండా నిరోధించేందుకు గృహ రుణాలు ఇచ్చే బ్యాంకులు.. ఆ ఇంటి తాలూకా డాక్యుమెంట్లను సీఈఆర్ఎస్ఏఐలో రిజిస్టర్ చేస్తాయి. ఇందుకు వసూలు చేసే చార్జీలనే సీఈఆర్ఎస్ఏఐ చార్జీలు అంటారు. రూ.5 లక్షల వరకు ఉన్న గృహ రుణాలపై రూ.50+జీఎస్‌టీ, అంతకు మించిన గృహ రుణాలపై రూ.100+జీఎస్‌టీ చొప్పున ఈ భారం ఉంటుంది. గృహ రుణం మొత్తం తీర్చివేసిన వెంటనే ఈ రికార్డును అప్‌డేట్ చేయించుకోవాలి. లేకపోతే ఆ ఇంటిని తిరిగి అమ్మడం లేదా రీఫైనాన్సింగ్ కష్టమవుతుంది.

పబ్లిక్ ఇష్యూకి టెక్నో పెయింట్స్

- రూ.500 కోట్ల సమీకరణ లక్ష్యం
- బ్రాండ్ అంబాసిడర్‌గా సచిన్ టెండుల్కర్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న టెక్నో పెయింట్స్ అండ్ కెమికల్స్ పబ్లిక్ ఇష్యూకి వచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27)లో ఇందుకు సంబంధించి సెబీకి ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించనున్నట్లు కంపెనీ చైర్మన్ ఆకూరి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. శనివారం నాడిక్కడ సంస్థ బ్రాండ్ అంబాసిడర్‌గా మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండుల్కర్‌ను నియమించుకున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. ఐపీఓ ద్వారా రూ.500 కోట్లు సమీకరించాలని చూస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ నిధులను కొత్త ప్లాంట్ల ఏర్పాటుతో పాటు కార్యకలాపాల విస్తరణకు ఉపయోగించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రూ.2,000 కోట్ల టర్నోవర్ లక్ష్యం : గడిచిన ఆర్థిక సంవత్సరం (2024-25)లో కంపెనీ రెవెన్యూ రూ.210 కోట్లుగా ఉండగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.450 కోట్ల ఆదాయాన్ని ఆర్జించవచ్చని అంచనా వేస్తున్నట్లు శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. కాగా 2029-30 నాటికి కంపెనీ ఆదాయాన్ని రూ.2,000 కోట్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం కంపెనీ హైదరాబాద్ సహ ఆంధ్రప్రదేశ్‌లో ప్లాంట్లను నిర్వహిస్తోంది.

జోస్ అలుక్కాస్.. మై బెస్ట్ ఫ్రెండ్స్ వెడ్డింగ్ క్యాంపెయిన్



హైదరాబాద్: జువెలరీ రిటైలర్ జోస్ అలుక్కాస్.. 'మై బెస్ట్ ఫ్రెండ్స్ వెడ్డింగ్' పేరుతో సరికొత్త బ్రాండ్ క్యాంపెయిన్‌ను ఆవిష్కరించింది. టాలీవుడ్ నటులు దుల్కర్ సల్మాన్, కీర్తి సురేశ్, సుహాసినీ మణిరత్నంలతో ఈ క్యాంపెయిన్‌ను రూపొందించింది. ఆనందోత్సాహాల మధ్యన అందరు కలిసి వివాహాన్ని జరిపించటం, అనుభూతులను పంచుకోవటం వంటి విషయాలను దీని ద్వారా వివరించింది. గడచిన ఆరు దశాబ్దాలుగా జోస్ అలుక్కాస్.. దేశవ్యాప్తంగా అన్ని రీజియన్లలోని వివాహ మహోత్సవాల్లో భాగంగా మారిందని, వినియోగదారుల విశ్వాసాన్ని మరింతగా చూరగొనటానికి ఇది ఎంతగానో దోహదపడనుందని సంస్థ ఎండీ వర్ఘీస్ అలుక్కాస్ అన్నారు.

భారత్‌కు ఎదురుందా!

జోష్‌లో రో-కో ద్వయం

- కెప్టెన్ గిల్‌పై ఒత్తిడి
- శ్రేయా‌స్‌పై దృష్టి
- న్యూజిలాండ్‌కు సవాల్
- తొలి వన్డే నేడు



మధ్యాహ్నం 1.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..



బ్రేస్‌వెల్

వడోదర: టీ20 వరల్డ్‌కప్‌నకు నెల రోజుల సమయం కూడా లేదు.. కానీ టీమిండియా మరో వన్డే సిరీస్ కోసం బరిలోకి దిగబోతోంది. గత నెలలో దక్షిణాఫ్రికాపై 2-1తో సిరీస్ నెగ్గి జోష్‌లో ఉన్న భారత జట్టు.. ఆదివారం నుంచి న్యూజిలాండ్‌తో మూడు వన్డేలు ఆడనుంది. ఇక ఎప్పటిలాగే స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఆట చూసేందుకు అభిమానులు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. వన్డేలకు మాత్రమే పరిమితమైన వీరిద్దరూ సఫారీలతో సిరీస్‌లో చెలరేగారు. ఇటీవల విజయ్ హజారే ట్రోఫీలోనూ అదరగొట్టారు. వచ్చే ఏడాది వన్డే వరల్డ్‌కప్‌లో చోటును ఆశిస్తున్న ఈ జోడీ, ప్రస్తుత ఫామ్‌ను రాబోయే మ్యాచ్‌ల్లోనూ ప్రదర్శిస్తే ఫ్యాన్స్‌కు పండగే. అటు మైకేల్ బ్రేస్‌వెల్ కెప్టెన్సీలోని న్యూజిలాండ్ మాత్రం అనుభవలేమితో ఉంది. జట్టులోని 15 మంది ఆటగాళ్లలో 8 మందికిదే తొలి భారత పర్యటన కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో భారత్‌కు కివీస్ ఏమాత్రం పోటీనిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

గిల్ ఫామ్‌పై ఆందోళన: గాయాలు, ఫామ్‌లేమితో ఇబ్బందిపడుతున్న భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు ఈ సిరీస్ కీలకం కానుంది. ఇప్పటికే టీ20 వరల్డ్‌కప్ జట్టులోనూ అతడికి చోటు దక్కని విషయం తెలిసిందే. ఇక దక్షిణాఫ్రికాపై సెంచరీ బాదిన జైస్వాల్.. గిల్ రాకతో బెంచీకే పరిమితం కానున్నాడు. ఓపెనర్లుగా గిల్-రోహిత్ దిగనుండగా.. వన్‌డౌన్‌లో కోహ్లీ తర్వాత శ్రేయాస్ బ్యాట్ పట్టనున్నాడు. ఆసీస్ టూర్‌లో పక్కటెముకల గాయానికి గురైన అయ్యర్ విజయ్ హజారేలో ఫామ్ చాటుకున్నాడు. వికెట్ కీపర్‌గా రాహుల్ కొనసాగనున్నాడు. టీ20 వరల్డ్‌కప్ దృష్ట్యా బుమ్రా, హార్దిక్ పాండ్యాలకు ఈ సిరీస్ నుంచి విశ్రాంతినిచ్చారు. దీంతో సిరాజ్, హర్షిత్, అర్ష్‌దీప్‌లపై పేస్ బాధ్యత పడనుంది. స్పిన్ విభాగంలో కుల్దీప్, జడేజా, సుందర్ కీలకం కానున్నారు.

కివీస్ కాచుకునేనా?: ద్వితీయ శ్రేణి జట్టుతో బరిలోకి దిగుతున్న కివీస్‌కు టీమిండియా నుంచి గట్టి సవాల్ ఎదురవనుంది. గతేడాది చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో భారత్ చేతిలోనే కివీస్ ఓడింది. అలాగే ఈ జట్టు ఇక్కడ వన్డే సిరీస్ నెగ్గలేదు. కానీ, ఇటీవల కివీస్ వరుసగా 9 వన్డేలు గెలిచిన విషయాన్ని భారత్ గుర్తుంచుకోవాలి. సీనియర్లు శాంట్నర్, కేన్ విలియమ్సన్, లాథమ్ వివిధ కారణాలతో సిరీస్‌కు దూరమయ్యారు. రచిన్, డఫీకి విశ్రాంతినిచ్చారు. శాంట్నర్ లేకపోవడంతో బ్రేస్‌వెల్ జట్టు పగ్గాలు చేపట్టాడు. అయితే కాన్వే, మిచెల్, ఫిలిప్స్, నికోల్స్, యంగ్ రూపంలో జట్టు బ్యాటింగ్ కాస్త బలంగానే కనిపిస్తోంది. భారత సంతతి లెగ్ స్పిన్నర్ ఆదిత్య అశోక్ అందరి దృష్టిని ఆకర్షించనున్నాడు.

తుది జట్లు (అంచనా)

భారత్: గిల్ (కెప్టెన్), రోహిత్, విరాట్, శ్రేయాస్, రాహుల్, సుందర్, జడేజా, హర్షిత్, కుల్దీప్, అర్ష్‌దీప్, సిరాజ్.

న్యూజిలాండ్: కాన్వే, కెల్లీ, యంగ్, మిచెల్, నికోల్స్, ఫిలిప్స్, బ్రేస్‌వెల్ (కెప్టెన్), ఫౌక్స్, జేమిసన్, మైకేల్ రే, ఆదిత్య అశోక్.

పిచ్

స్థానిక కోటంబి స్టేడియంలో జరుగనున్న తొలి పురుషుల అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ ఇదే. గతంలో ఇక్కడ జరిగిన రెండు మహిళల డే/నైట్ వన్డేల్లో పిచ్ పేసర్లకు అనుకూలించింది. మంచు ప్రభావం కారణంగా చేజింగ్ జట్టుకు విజయావకాశాలున్నాయి.

స్పోర్ట్స్

డబ్ల్యూపీఎల్‌లో నేడు
ఢిల్లీ X గుజరాత్ (రా. 7.30)

విధిరాత ఎలావుంటే.. అలా

గిల్ వేదాంత ధోరణి

వడోదర: టీ20 ప్రపంచ కప్ జట్టులో చోటు దక్కకపోవడం వన్డే, టెస్ట్ జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌ను నిర్వేదానికి గురిచేసినట్టు కనిపిస్తోంది. 'నా జీవితంలో ఎక్కడ ఉండాలని రాసిపెట్టివుందో అక్కడే ఉన్నానని నమ్ముతున్నా. దానిని ఎవరూ నా నుంచి లాక్కోలేరు' అని న్యూజిలాండ్‌తో తొలి వన్డేకు ముందు శనివారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ గిల్ వ్యాఖ్యానించాడు. టెస్టులు, వన్డేలలో జట్టును ప్రశంసనీయంగా నడిపిస్తున్న 26 ఏళ్ల గిల్‌ను వచ్చే నెలలో ప్రారంభమయ్యే టీ20 వరల్డ్ కప్ జట్టుకు ఎంపిక చేయని సంగతి తెలిసిందే. సెలెక్టర్ల నిర్ణయాన్ని గౌరవిస్తానని, పొట్టి ఫార్మాట్‌లో అవకాశం వచ్చినపుడు దానిని సద్వినియోగం చేసుకుంటానని చెప్పాడు.

నిఖత్, హుస్సాం పసిడి పంచ్



గ్రేటర్ నోయిడా: జాతీయ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో తెలుగు బాక్సర్లు నిఖత్ జరీన్, మహ్మద్ హుస్సాముద్దీన్ స్వర్ణ పతకాలు కొల్లగొట్టారు. శనివారం జరిగిన మహిళల 51 కిలోల విభాగం ఫైనల్లో నిఖత్ 5-0తో ప్రపంచ మాజీ చాంపియన్ నీతు గంగాస్ (హరియాణా)పై గెలిచింది. నిఖత్‌కు ఇది మూడో జాతీయ టైటిల్. పురుషుల 60 కిలోల టైటిల్‌పోరులో 31 ఏళ్ల హుస్సాం 3-2తో డిఫెండింగ్ చాంపియన్ సచిన్ శివాచ్ (హరియాణా)ను ఓడించి ఐదోసారి జాతీయ చాంపియన్‌గా నిలిచాడు.

ముంబై భళా ఢిల్లీ డీలా

హర్మన్‌సేన ఆల్‌రౌండ్ షో

50 పరుగులతో విజయం



హర్మన్‌ప్రీత్ కౌర్ (74 నాటౌట్)



బ్రంట్ (70)

సంక్షిప్త స్కోర్లు

ముంబై: 20 ఓవర్లలో 195/4 (హర్మన్‌ప్రీత్ 74 నాటౌట్, బ్రంట్ 70; నందని శర్మ 2/26, శ్రీచరణి 1/45).
ఢిల్లీ: 19 ఓవర్లలో 145 ఆలౌట్ (హెన్రీ 56, నిక్కీ ప్రసాద్ 12; కెర్ 3/24, క్యారీ 3/37).

నవీ ముంబై: హర్మన్‌ప్రీత్ కౌర్ (42 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌లతో 74 నాటౌట్), నాట్ సివర్ బ్రంట్ (70) అర్ధ శతకాలతోపాటు పేసర్ నికోలా క్యారీ (3/37) నిప్పులు చెరగడంతో.. డిఫెండింగ్ చాంప్ ముంబై ఇండియన్స్ బోణీ చేసింది. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో శనివారం జరిగిన మ్యాచ్‌లో ముంబై 50 పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను చిత్తు చేసింది. ఆరంభ మ్యాచ్‌లో ఓడిన హర్మన్‌ప్రీత్ సేన.. ఈ మ్యాచ్‌లో అన్ని విభాగాల్లో కదం తొక్కింది. తొలుత ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 195/4 స్కోరు చేసింది. అరంగేట్రం పేసర్ నందని శర్మ రెండు వికెట్లు పడగొట్టగా.. శ్రీచరణి, చినెల్లీ హెన్రీ చెరో వికెట్ తీశారు. బ్రంట్, హర్మన్ మూడో వికెట్‌కు 66 పరుగుల భాగస్వామ్యంతో జట్టుకు భారీ స్కోరు అందించారు. అనంతరం ఛేదనలో ఢిల్లీ జట్టు 19 ఓవర్లలో 145 పరుగులకే కుప్పకూలింది. హెన్రీ (56) ఒంటరి పోరాటం చేయగా.. షఫాలీ (8), వోల్వార్ట్ (9), కెప్టెన్ జెమీమా రోడ్రిగ్స్ (1) సింగిల్ డిజిట్‌కే పెవిలియన్ చేరారు. అమేలియా కెర్ మూడు, బ్రంట్ రెండు వికెట్లు పడగొట్టారు. హర్మన్‌ప్రీత్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచింది.

గుజరాత్ బోణీ



గార్డ్‌నర్ (65)

పోరాడి ఓడిన యూపీ

నవీ ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్‌లో శనివారం జరిగిన తొలి మ్యాచ్ ఉత్కంఠ రేపింది. భారీ స్కోర్లు నమోదైన ఈ పోరులో గుజరాత్ జెయింట్స్ 10 పరుగులతో గెలిచింది. మొదట గుజరాత్ 20 ఓవర్లలో 207/4 స్కోరు చేసింది. కెప్టెన్ ఆష్లీ గార్డ్‌నర్ (41 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లతో 65), అనుష్క శర్మ (30 బంతుల్లో 7 ఫోర్లతో 44), సోఫీ డివైన్ (20 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 38), వేర్హామ్ (10 బంతుల్లో ఫోర్, 3 సిక్స్‌లతో 27 నాటౌట్) ధనాధన్ బ్యాటింగ్ చేశారు. ఎకెల్‌స్టోన్ రెండు వికెట్లు పడగొట్టింది. ఛేదనలో యూపీ వారియర్స్ 20 ఓవర్లలో 197/8 స్కోరుతో తుదికంటా పోరాడినా పరాజయం తప్పలేదు. లిచ్‌ఫీల్డ్ (40 బంతుల్లో 8 ఫోర్లు, 5 సిక్స్‌లతో 78) చెలరేగింది. కెప్టెన్ మెగ్ లానింగ్ (27 బంతుల్లో 5 ఫోర్లతో 30), చివర్లో ఆశా శోభన (10 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 27 నాటౌట్) దుమ్ము రేపింది. రేణుకా సింగ్, వేర్హామ్, డివైన్ తలా రెండేసి వికెట్లు తీశారు. వేర్హామ్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది.

సంక్షిప్తస్కోర్లు

గుజరాత్ జెయింట్స్: 20 ఓవర్లలో 207/4 (గార్డ్‌నర్ 65, అనుష్క 44, సోఫీ డివైన్ 38, వేర్హామ్ 27 నాటౌట్, ఎకెల్‌స్టోన్ 2/32);
యూపీ వారియర్స్: 20 ఓవర్లలో 197/8 (లిచ్‌ఫీల్డ్ 78, లానింగ్ 30, ఆశా శోభన 27 నాటౌట్, రేణుకా సింగ్ 2/25, జార్జియా వేర్హామ్ 2/30, సోఫీ డివైన్ 2/55).

అదో చీకటి దశ



మేరీ కోమ్

న్యూఢిల్లీ: భర్తతో విడాకులు, దివాలా దశకు వచ్చిన ఆర్థిక పరిస్థితి.. వెరసి అది తన జీవితంలో చీకటి దశగా దిగ్గజ బాక్సర్ మేరీ కోమ్ అభివర్ణించింది. మేరీకోమ్, మాజీ ఫుట్‌బాలర్ ఆన్లెర్ రెండు దశాబ్దాల తమ వైవాహిక జీవితానికి ముగింపు పలుకుతూ 2023లో విడాకులు తీసుకోవడం సంచలనం సృష్టించింది. అయితే విడాకుల ఉదంతంలో తప్పంతా తనదనే అపవాదును మేరీ ఎదుర్కొంది. కానీ, ఆన్లెర్ తనను కోట్ల రూపాయలకు మోసం చేశాడని వెల్లడించింది. 'నేను కష్టపడి సంపాదించిన ఆస్తులను కుదువపెట్టి లోన్లు తీసుకున్నాడు. తర్వాత ఆ ఆస్తులను తన పేరిట మార్చుకున్నాడు. చురాచాంద్‌పూర్ వాసుల నుంచి అప్పులు తీసుకున్నాడు. వాటిని రాబట్టుకొనేందుకు వారు అండర్‌గ్రౌండ్ గ్రూపుల ద్వారా నా భూమిని స్వాధీనం చేసుకున్నారు' అని మేరీ వివరించింది. ఇవన్నీ భరించలేకే ఎంతో ఆలోచించి అతడి నుంచి విడాకులు తీసుకున్నట్టు తెలిపింది.

క్రీడా వికాస కేంద్రాల ఏర్పాటు

శాప్ చైర్మన్ రవినాయుడు



న్యూఢిల్లీ (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో యువత భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టెక్నాలజీతో పాటు క్రీడలకు సమ ప్రాధాన్యం ఇస్తున్నారని అమలాపురం ఎంపీ జీఎం హరీష్, శాప్ చైర్మన్ రవినాయుడు తెలిపారు. టెక్నాలజీ, క్రీడల కలయికతో ఏపీ యువతను ప్రపంచ స్థాయి నాయకులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో శనివారం 'వికసిత్ భారత్ యువ నేతల సమ్మేళనం'లో ఏపీ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హరీష్, రవి నాయుడు, జాతీయ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ హాజరయ్యారు. రాష్ట్రంలో 'క్రీడా వికాస కేంద్రాలను' ఏర్పాటు చేస్తున్నామని రవినాయుడు వెల్లడించారు. క్రీడా మౌలిక వసతుల కల్పన కోసం ప్రతి ప్రభుత్వ పాఠశాలకు కనీసం రూ. 5 లక్షలు ఖర్చు చేస్తున్నామన్నారు.

ఆనంద్‌కు అర్జున్ షాక్

కోల్‌కతా: టాటా స్టీల్ చెస్ టోర్నీలో భాగంగా శనివారం మొదలైన బ్లిట్జ్ పోటీల్లో తొమ్మిది రౌండ్లు ముగిసేసరికి తెలుగు ఆటగాడు అర్జున్ ఇరిగేసి ఐదు పాయింట్లతో మూడోస్థానంలో నిలిచాడు. తొలి రెండు రౌండ్లలో ఓడిన అర్జున్ మూడో రౌండ్‌లో ర్యాపిడ్ విజేత నిహాల్ సరీన్‌పై, నాలుగో రౌండ్‌లో విశ్వనాథన్ ఆనంద్‌పై గెలవడం విశేషం. నిహాల్ 6.5 పాయింట్లతో టాప్‌లో ఉండగా, ఆనంద్ ఆరు పాయింట్లతో ద్వితీయ స్థానంలో కొనసాగుతున్నాడు. మహిళల బ్లిట్జ్‌లో హారిక నాలుగు పాయింట్లతో ఏడో స్థానంలో ఉంది.

సెమీస్‌లో సింధు అవుట్

కౌలాలంపూర్: మలేసియా ఓపెన్‌లో భారత ఏస్ షట్లర్ పీవీ సింధు పోరాటం ముగిసింది. శనివారం జరిగిన సెమీస్‌లో సింధు 16-21, 15-21తో రెండో సీడ్ వాంగ్ జియి (చైనా) చేతిలో పరాజయం పాలైంది.

కోచ్‌తో చోప్రా కటీఫ్



న్యూఢిల్లీ: స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా.. చెక్ కోచ్ యాన్ జెలెజ్నీ నుంచి విడిపోతున్నట్టు ప్రకటించాడు. అయితే, అందుకు గల కారణాలను చోప్రా వెల్లడించలేదు. వీరిద్దరూ ఒక సీజన్ మాత్రమే కలసి పనిచేశారు. జెలెజ్నీ శిక్షణలో చోప్రా 90 మీటర్ల మార్క్‌ను బ్రేక్ చేశాడు.

జేడీ లక్ష్మీనారాయణ భార్యకు
సైబర్ నేరగాళ్ల టోకరా

- రూ.2.58 కోట్లు కొట్టేసిన కేటుగాళ్లు
- స్టాక్ మార్కెట్ పెట్టుబడి చిట్కాల పేరిట మోసం
- విడతల వారీగా రూ.2.58 కోట్లు జమ చేసిన మాజీ ఐపీఎస్ భార్య
- హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు



హైదరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్(జేడీ), రిటైర్డ్ ఐపీఎస్ అధికారి వీవీ లక్ష్మీనారాయణ సతీమణి సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయారు. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి చిట్కాల పేరిట ఎర వేసిన సైబర్ నేరగాళ్లు ఆమె నుంచి ఏకంగా రూ.2.58 కోట్లు కొట్టేశారు. ఈ ఘటనకు సంబంధించి హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులకు అందిన ఫిర్యాదు ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మాజీ ఐపీఎస్ అధికారి వీవీ లక్ష్మీనారాయణ భార్య ఊర్మిళ వాట్సాప్‌కు 2025 నవంబరు చివరి వారంలో గుర్తు తెలియని నెంబర్ నుంచి ఓ సందేశం వచ్చింది. తాము సూచించిన విధంగా స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే అతి తక్కువ సమయంలో అధిక లాభాలు చూస్తారని ఆ సందేశం సారాంశం. దానిని నమ్మిన ఊర్మిళ తనకు ట్రేడింగ్‌పై అవగాహన లేకపోవడంతో.. సైబర్ నేరగాళ్లు సూచించిన 'స్టాక్ మార్కెట్ ప్రాఫిట్ గైడ్ ఎక్స్చేంజ్ 20' అనే వాట్సాప్ గ్రూపులో తన భర్త వీవీ లక్ష్మీనారాయణ నెంబర్‌ను నవంబరు 29న యాడ్ చేయించారు. గ్రూపులో చేరిన కాసేపటికే దినేష్ సింగ్ అనే వ్యక్తి ఆమెతో మాట్లాడాడు. తనని తాను ట్రేడింగ్ శిక్షకుడిగా పరిచయం చేసుకున్న దినేష్ సింగ్.. తాను ఐఐటీ ముంబై గ్రాడ్యుయేట్‌నని అమెరికాలో పీహెచ్‌డీ చేశానని చెప్పాడు. తాను రాసిన 'స్టాక్ మార్కెట్ ట్రెజర్ హంటింగ్ సీక్రెట్స్' అనే పుస్తకాన్ని అతి త్వరలో మార్కెట్‌లోకి తీసుకువస్తున్నానని నమ్మించాడు. తన మాటలతో మాయ చేసిన దినేష్ సింగ్.. వాట్సాప్ గ్రూపులోని సభ్యులకు ట్రేడింగ్‌పై శిక్షణ తరగతులు నిర్వహిస్తూనే పెట్టుబడులు పెట్టేందుకు కొన్ని స్టాక్స్ సిఫారసు చేసేవాడు. వాటిలో పెట్టుబడులు పెట్టినవారు అధిక మొత్తంలో లాభాలు పొందారని, ఆ వివరాలంటూ కొన్ని స్క్రీన్ షాట్లు గ్రూపులో పోస్టు చేసేవాడు. ఆయా స్టాక్స్‌లో పెట్టుబడిపెడితే మీరు 500 శాతం లాభాలు పొందుతారని చెప్పేవాడు. మరోపక్క, దినేష్ సింగ్ శిష్యురాలినంటూ ప్రియసఖి అనే మహిళ.. దినేష్ సింగ్ చిట్కాలను బలపరిచేలా వాట్సాప్ గ్రూపులో పోస్టులు పెట్టేది. అయితే, సామూహిక పెట్టుబడులు పెట్టాలని అలా చేస్తే 5 నుంచి 6 వారాల్లో 500 శాతం లాభాలు చూస్తారని దినేశ్‌సింగ్ గ్రూపులోని సభ్యులను ప్రోత్సహించేవాడు. సెబీ గుర్తింపు పొందిన మెకిన్లీ అనే సంస్థ ద్వారా బ్రోకరేజ్ సేవలు పొందుతున్నామని నమ్మించాడు. ఇందుకు సంబంధించి కొన్ని నకిలీ పత్రాలను పంపాడు. వీటన్నింటితో దినేష్ ముఠాను నమ్మిన బాధితురాలు.. సైబర్ ముఠా సూచన మేరకు యాపిల్ యాప్ స్టోర్ నుంచి 'ఎంసీకేఐఈవై సీఎం' అనే అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేసుకొని అందులో ట్రేడింగ్ ఖాతా తెరిచారు. సామూహిక పెట్టుబడులంటూ దినేశ్ సింగ్ చేసిన మాయన నమ్మి.. 2025 డిసెంబరు 24 నుంచి జనవరి 5వ తేదీల మధ్యలో 19 విడతలుగా మొత్తం రూ.2.58 కోట్లను ట్రేడింగ్ ఖాతాకు బదిలీ చేశారు. ఇందుకోసం తనతోపాటు తన భర్త వద్ద ఉన్న బంగారాన్ని కూడా తాకట్టు పెట్టి రుణం కూడా తీసుకున్నారు. యాప్‌లోని ట్రేడింగ్ ఖాతాలో పెట్టుబడులకు సంబంధించిన లాభాలు కనిపిస్తున్నాయి. కానీ విత్‌డ్రా అప్షన్ మాత్రం లేదు రోజులు గడుస్తున్నా లాభాలు ఇవ్వకపోగా మరింత డబ్బు పెట్టుబడి పెట్టకపోతే ఇప్పటి వరకు పెట్టిన డబ్బు పోతుందంటూ సైబర్ నేరగాళ్ల బెదిరింపులు అధికమయ్యాయి. దీంతో మోసపోయామని ఆలస్యంగా గుర్తించిన లక్ష్మీనారాయణ సతీమణి.. జనవరి 5న సైబర్ క్రైం పోర్టల్‌లో ఫిర్యాదు చేశారు. హైదరాబాద్ సైబర్‌క్రైం పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. సైబర్ నేరగాళ్లు మ్యూల్ ఖాతాలకు డబ్బును పంపారని, ఆ ఖాతాలను గుర్తించడానికి ప్రయత్నిస్తున్నామని పోలీసులు తెలిపారు.

విశాఖ పోర్టు పనితీరు భేష్

- ప్రపంచంలోని తొలి 100 పోర్టుల్లో స్థానం: శర్బానంద సోనోవాల్
- 230 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విశాఖపట్నం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పోర్టు ఈ ఏడాది 100 మిలియన్ టన్నుల సరకు రవాణాను అధిగమిస్తుందని కేంద్ర మంత్రి శర్బానంద సోనోవాల్ ఆశాభావం వ్యక్తం చేశారు. పోర్టులో రూ.230 కోట్ల విలువైన పలు ప్రాజెక్టులకు ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. స్థానిక సాలగ్రామపురంలోని సాగరమాల కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... 'విశాఖపట్నం పోర్టు చక్కటి పనితీరు ప్రదర్శిస్తోంది. ప్రపంచంలోని తొలి 100 పోర్టుల్లో ఒకటిగా నిలుస్తోంది' అని పేర్కొన్నారు. ఎంపీ ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ, 'పోర్టు చేపట్టిన ప్రాజెక్టులు పూర్తిచేసే బాధ్యతను ఆ శాఖపైనే వదిలేయకుండా ప్రజాప్రతినిధులుగా మా వంతు పాత్ర పోషిస్తాం. కాలుష్య నియంత్రణకు జిల్లా అధికారులతో కలసి మరింత సమర్థంగా పనిచేయాలి' అని సూచించారు. కేంద్ర కార్యదర్శి విజయకుమార్ మాట్లాడుతూ, సరకు రవాణా పెంచడంతో పాటు భద్రతకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పోర్టు ఇన్‌చార్జి చైర్మన్ అంగముత్తు మాట్లాడుతూ... ఉద్యోగుల పని, నివాస పరిస్థితులు మెరుగుపడేలా ఆధునిక పరిపాలనా కార్యాలయం, నివాస సముదాయం నిర్మిస్తున్నామన్నారు. నార్త్ నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ, సీఎస్ఆర్ ద్వారా ప్రజోపయోగ కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలన్నారు. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ, పోర్టు వల్ల విశాఖపట్నం ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. కార్యక్రమంలో పోర్టు డిప్యూటీ చైర్మన్ రోషిణి అపరంజి పాల్గొన్నారు. పోర్టు సహకారంతో పలు కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ఈ సందర్భంగా ధ్రువపత్రాలు అందజేశారు.

శంకుస్థాపన చేసిన అభివృద్ధి పనులు

- రూ.52.23 కోట్లతో ఎల్‌పీజీ బెర్తులో అగ్నిమాపక సదుపాయాల అభివృద్ధి
- రూ.35.87 కోట్లతో ఓఆర్ఎస్ డ్రైడాక్ ఆధునికీకరణ
- రూ.97.7 కోట్లతో జి+9 అంతస్థుల పరిపాలనా భవన నిర్మాణం
- రూ.44.2 కోట్లతో హార్బర్ పార్కులో నివాసానికి అపార్ట్‌మెంట్ల నిర్మాణం



అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సోనోవాల్. చిత్రంలో ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్ తదితరులు

విశాఖలో లైట్‌హౌస్ మ్యూజియం

లైట్‌హౌస్ టూరిజంపై మోదీ దృష్టి

- 266 కోట్లతో గుజరాత్‌లో అతిపెద్ద లైట్‌హౌస్
- మరో 75 లైట్‌హౌస్‌ల అభివృద్ధికి చర్యలు
- కేంద్ర మంత్రి శర్బానంద సోనోవాల్

విశాఖపట్నం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): దేశంలో అతిపెద్ద లైట్‌హౌస్‌ను గుజరాత్‌లోని నేషనల్ మారిటైమ్ హెరిటేజ్ కాంప్లెక్స్(లోథల్)లో రూ.266 కోట్లతో.. 77 మీటర్ల ఎత్తున నిర్మించనున్నట్టు కేంద్ర పోర్టులు, నౌకాయాన, జలరవాణా శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్ వెల్లడించారు. శనివారం విశాఖపట్నంలో జరిగిన లైట్‌హౌస్ ఉత్సవం ముగింపు సభలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. దేశంలో లైట్‌హౌస్ టూరిజాన్ని పెంచాలని ప్రధాని మోదీ సంకల్పించారని, ఈ నేపథ్యంలో 75 లైట్‌హౌస్‌లను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. దీనికి అదనంగా మరో 25 లైట్‌హౌస్‌లను గుర్తించామని, వాటిని కూడా పర్యాటకంగా ముందుకు తీసుకువెళతామని చెప్పారు. బ్రహ్మపుత్ర నదీ తీరాన అసోంలో బోగిబీల్, సిల్‌ఘాట్, పాండు, బిశ్వంత్‌ఘాట్‌లో నాలుగు లైట్‌హౌస్‌లు నిర్మిస్తామన్నారు. విశాఖపట్నంలో పాత లైట్‌హౌస్‌ను మ్యూజియంగా అభివృద్ధి చేయడానికి విశాఖపట్నం పోర్టు 3,156 చ.మీ. స్థలాన్ని అందిస్తోందని, అందులో డైరెక్టర్ జనరల్ ఆఫ్ లైట్ హౌసెస్ అండ్ లైట్‌షిప్స్ సంస్థ పనులు చేపడుతుందని ప్రకటించారు. దీనికి సంబంధించిన ఎంఓయూపై వేదికపైనే కేంద్ర మంత్రి సోనోవాల్ సంతకాలు చేశారు. అలాగే, అండమాన్‌లో జంగ్లిఘాట్‌లో సిబ్బంది క్వార్టర్ల పునర్నిర్మాణానికి మంత్రి సోనోవాల్ ఆన్‌లైన్‌లో శంకుస్థాపన చేశారు. గోవాలోని అగౌడా లైట్‌హౌస్‌లో లైట్ అండ్ సౌండ్ షోను ఇక్కడి నుంచే ప్రారంభించారు. కార్యక్రమంలో కేంద్ర పెట్రోలియం, గ్యాస్, పర్యాటకశాఖల సహాయ మంత్రి సురేశ్ గోపి, విశాఖపట్నం పోర్టు ఇన్‌చార్జి చైర్మన్ అంగముత్తు, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నెయ్యి కల్తీ కేసులో చివరి లెక్కలు!!

- తిరుపతికి సీబీఐ జాయింట్ డైరెక్టర్

తిరుపతి(నేరవిభాగం), జనవరి 10 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ నెయ్యి కల్తీ వ్యవహారంలో సీబీఐ దర్యాప్తు చివరి దశకు చేరిందన్న సంకేతాలు కనబడుతున్నాయి. దాదాపు 14 నెలలుగా కొనసాగుతున్న ఈ కేసు దర్యాప్తునకు సీబీఐ జాయింట్ డైరెక్టర్ వీరేష్ ప్రభు తొలిసారిగా శనివారం తిరుపతిలోని ప్రత్యేక సిట్ దర్యాప్తు కార్యాలయానికి రావడం అనేక ఊహాగానాలకు తావిస్తోంది. 2024 నవంబరులో ప్రారంభమైన ఈ కేసు సంచలనంగా మారింది. దేశ విదేశాల్లో శ్రీవారి భక్తులు ఈ కేసు దర్యాప్తును నిశితంగా పరిశీలిస్తున్నారు. కల్తీ నెయ్యిలో ఎవరి పాత్ర ఎంతన్న విషయంపై స్పష్టత వస్తే ఆ ప్రభావం రాజకీయంగా కూడా పెను మార్పులకు దారితీయెచ్చు. ఈ క్రమంలో సీబీఐ జేడీ స్థాయి అధికారి తిరుపతికి రావడం చార్జిషీట్ దాఖలుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చే ముందస్తు అడుగుగా కనిపిస్తోంది. ఈ కీలక పర్యటనలో వీరేష్ ప్రభుతో పాటు డీఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి, గోపీనాథ్ జెట్టి, ఎఫ్‌సీసీఐ అధికారి సత్యవర పాండా సహా పలువురు సిట్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీబీఐ జేడీ అధికారులు, సిట్ సభ్యులతో కేసుకు సంబంధించి ఉదయం నుంచి సాయంత్రం వరకు సాగిన సమీక్షలో ప్రతి అంశాన్నీ క్షుణ్ణంగా పరిశీలించినట్టు సమాచారం. సేకరించిన సాక్ష్యాలు, నిందితుల వాంగ్మూలాలు, దర్యాప్తు విధానంపై సీబీఐ జేడీ స్వయంగా సమీక్షించినట్టు తెలుస్తోంది. ముఖ్యంగా కోర్టులో కేసు నిలబడేలా ఎలాంటి న్యాయపరమైన లోపాలూ ఉండకూడదన్న అంశంపై చర్చ జరిగినట్టు సమాచారం. ఈ కేసులో దర్యాప్తునకు సహకరించే అవకాశం ఉన్న నిందితులు ఎవరు? ఎవరి వాంగ్మూలాలు కీలకమన్న కోణంలోనూ చర్చ జరిగినట్టు తెలుస్తోంది. అవసరమైతే కీలక సాక్షులను ప్రభుత్వ సాక్షులుగా మార్చే అంశంపైనా ప్రాథమికంగా సమీక్షించినట్టు సమాచారం. కేసులో సీబీఐ విచారణ దాదాపు పూర్తయినట్టే కాగా, 15-20 రోజుల్లో చార్జిషీట్ దాఖలయ్యే అవకాశాలు ఉన్నాయి.



అమరావతికి గ్రాంటు ఇవ్వండి
రాయలసీమ రాత మార్చండి

- నదుల అనుసంధానానికి చేయూతనివ్వండి
- నల్లమలసాగర్‌కు సహకరించండి
- ప్రీబడ్జెట్ సమావేశంలో కేంద్రానికి మంత్రి పయ్యావుల వినతి



న్యూఢిల్లీ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): 'రానున్న కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అత్యధిక స్థాయిలో రెవెన్యూ గ్రాంట్లు మంజూరు చేయాలి. సాస్కి, పూర్వోదయ పథకాల కింద నిధులు కేటాయించాలి' అని కేంద్ర ప్రభుత్వానికి ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ విజ్ఞప్తి చేశారు. శనివారం అన్ని రాష్ట్రాల, కేంద్రపాలిత ప్రాంతాల ఆర్థిక మంత్రులతో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమావేశం నిర్వహించారు. కేంద్ర బడ్జెట్ రూపకల్పనలో భాగంగా ప్రతిపాదనలు స్వీకరించేందుకు ఏర్పాటు చేసిన ఈ ప్రీబడ్జెట్ సమావేశంలో పాల్గొన్న మంత్రి పయ్యావుల రాష్ట్రానికి వివిధ అంశాల కింద నిధుల కేటాయింపునకై విజ్ఞప్తి చేశారు. 'రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, ప్రజల ఆశయాలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రానికి పెద్దపీట వేయండి. 2026 ఏప్రిల్ 1 నుంచి 16వ ఆర్థిక సంఘం సిఫార్సులు అమల్లోకి వస్తున్నందున అత్యధిక రెవెన్యూ గ్రాంట్లతో పాటు భారీ మొత్తంలో పన్నులు పంపిణీ చేయాల్సిన అవసరం ఉంది. దేశ ఆర్థిక సమాఖ్య స్ఫూర్తిని మెరుగ్గా అమలు చేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంది. సాస్కి పథకం కింద రాష్ట్రాల్లో మూల ధన పెట్టుబడులకు ప్రత్యేక సాయం చేయాలని కేంద్రం నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నాం. ఈ పథకాన్ని వచ్చే ఏడాది కూడా అధిక కేటాయింపులతో కొనసాగించండి. విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, జీవనోపాధి కల్పించే ప్రాజెక్టులకు అనుగుణంగా పూర్వోదయ మార్గదర్శక సూత్రాలను అమలు చేయాలి. వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీని అమలు చేయాలని రాష్ట్ర విభజన చట్టంలో సూచించారు. అందువల్ల రాయలసీమలో హార్టీకల్చర్ అభివృద్ధి ప్రణాళికలు అమలు చేయాలి. వచ్చే మూడేళ్లలో రూ.41 వేల కోట్లతో సీమ ప్రాంతంలో సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు అమలు చేయడం వల్ల అది అంతర్జాతీయ హార్టీ కల్చర్ కేంద్రంగా మారుతుంది. ఈ బడ్జెట్‌లోనే సీమ ప్రాంతీయ సమగ్రాభివృద్ధి ప్రణాళికను ప్రకటించి నిధులు కేటాయించాలి. విశాఖపట్నం ఆర్థిక ప్రాంతీయ అభివృద్ధి కేంద్రానికి కేంద్ర బడ్జెట్‌లో రూ.5 వేల కోట్లు కేటాయించాలి. గతేడాది కేంద్రం అందించిన రూ.15 వేల కోట్లతో అమరావతి నిర్మాణ పనులు వేగవంతమయ్యాయి. రాజస్థాన్ 11 నదులను అనుసంధానం చేసే రూ.40 వేల కోట్ల ప్రాజెక్టును కేంద్రం గతంలో జాతికి అంకితం చేసింది. అదేవిధంగా కరువు పీడిత ప్రాంతాలకు తాగనీరు అందించడంతో పాటు పారిశ్రామిక అవసరాలను తీర్చే పోలవరం-నల్లమల్లసాగర్ లింక్ ప్రాజెక్టుకు కేంద్రం తోడ్పాటు అందించాలి' అని పయ్యావుల కోరారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

సెన్సార్ సర్టిఫికేట్ జారీకి కాలపరిమితి విధించాలి!
- కమల్ హాసన్



ఒక సినిమాకు సెన్సార్ సర్టిఫికేట్‌ను జారీ చేయడానికి కాలపరిమితిని విధించాలని రాజ్యసభ సభ్యుడు, ఎంఎన్ఎం అధ్యక్షుడు, కోలీవుడ్ అగ్రహీరో కమల్ హాసన్ అన్నారు. విజయ్ నటించిన 'జన నాయగన్' చిత్రానికి 'సెన్సార్' వివాదం చుట్టుముట్టడంతో సినిమా విడుదల ఆగిపోయింది. ఈ విషయంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌తో పాటు తమిళ చిత్రపరిశ్రమకు చెందిన అనేక మంది ప్రముఖులు సెన్సార్ బోర్డు తీరును తీవ్రంగా తప్పుబడుతూ ట్వీట్స్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కమల్ హాసన్ శనివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. 'సినిమా అనేది ఒక వ్యక్తి పనికాదు. రచయితలు, సాంకేతిక నిపుణులు, కళాకారులు, థియేటర్ యజమానుల సమిష్టి కృషి. వారి జీవనోపాధిపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి సెన్సార్ సర్టిఫికేట్ జారీలో కాల పరిమితితో పాటు పారదర్శకత ఉండాలి' అని పేర్కొన్నారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

మన శంకరవరప్రసాద్‌కు ఊరట
బుక్ మై షోలో రివ్యూలపై నిషేధం



మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా నటించిన 'మన శంకరవరప్రసాద్' చిత్రానికి ఢిల్లీ హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఆన్‌లైన్ టికెటింగ్ ప్లాట్‌ఫామ్ బుక్ మై షోలో రివ్యూ, రేటింగ్స్‌లపై నిషేధం విధిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. సాధారణంగా చాలా మంది బుక్ మై షోలో టికెట్‌లు బుక్ చేసుకున్న తర్వాత సినిమాపై రివ్యూలు, రేటింగ్స్ ఇస్తుంటారు. అయితే ఇటీవల కాలంలో కొంత మంది ఈ పద్ధతిని తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. కావాలనే కొన్ని సినిమాలకు వ్యతిరేకంగా రేటింగ్స్ ఇస్తున్నారు. ఈ విషయంపై కొంత కాలంగా నిర్మాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కన్నడ సినిమాలకు సంబంధించి బెంగళూరు హైకోర్టు రివ్యూలు, రేటింగ్‌లను అనుమతించవద్దంటూ బుక్ మై షోను ఆదేశించింది. ఇదే క్రమంలో 'మన శంకరవరప్రసాద్' చిత్రానికి సంబంధించిన రివ్యూలను, రేటింగ్‌లను అనుమతించవద్దంటూ ఢిల్లీ హైకోర్టు బుక్ మై షోను ఆదేశించింది. దీంతో రివ్యూస్ గానీ, రేటింగ్స్ గానీ ఇచ్చే వీలులేకుండా బుక్ మై షో ఆప్షన్‌ను డిజేబుల్ చేసింది. కాగా, సంక్రాంతికి విడుదల కాబోతున్న మరో రెండు సినిమాలకూ ఇదే తరహా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ సదరు నిర్మాతలు కోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్టు తెలుస్తోంది. ప్రభాస్ నటించిన పాన్ ఇండియా చిత్రం 'ది రాజా సాబ్' విడుదల తర్వాత వచ్చిన ఫలితాలతో నిర్మాతలు మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

తెలంగాణలో టికెట్ రేట్ల పెంపునకు అనుమతి

మన శంకర వరప్రసాద్ గారు' సినిమా ప్రీమియర్ షో, టికెట్ రేట్లు పెంచుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం అనుమతించింది. నేడు ప్రదర్శించనున్న ప్రీమియర్ షో టికెట్ ధరను రూ.600(జీఎస్టీతో కలిపి)గా నిర్ణయించింది. 12వ తేదీ నుంచి ఏడు రోజుల పాటు సింగిల్ స్క్రీన్లలో రూ.50(జీఎస్టీతో కలిపి), మల్టీప్లెక్స్‌లలో రూ.100(జీఎస్టీతో కలిపి) అదనంగా వసూలు చేసుకునే వెసులు బాటు కల్పించింది.

రేట్ల పెంపుపై హౌస్‌మోషన్ తిరస్కరణ

'మన శంకర వరప్రసాద్ గారు' సినిమా టికెట్ రేట్లు పెంచుతూ ప్రభుత్వం తాజాగా జారీచేసిన మెమోను సవాల్ చేస్తూ దాచేపల్లి చంద్రబాబు అనే న్యాయవాది హైకోర్టులో హౌస్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఈ పిటిషన్‌ను హైకోర్టు విచారణకు స్వీకరించలేదని పిటిషనర్ తరపు న్యాయవాది విజయ్‌గోపాల్ తెలిపారు. ఇది అత్యవసర విషయం లేదా తిరిగి పునరుద్ధరించలేని విధంగా జరిగే నష్టానికి సంబంధించిన అంశం కానందున హౌస్‌మోషన్‌ను హైకోర్టు తిరస్కరించిందని.. సంక్రాంతి సెలవుల అనంతరం పిటిషన్ వేసుకోవచ్చని హైకోర్టు సూచించినట్లు తెలిపారు. అయితే 'రాజాసాబ్' టికెట్ రేట్ల పెంపు మెమోను సస్పెండ్ చేస్తూ శుక్రవారం హైకోర్టు సింగిల్ జడ్జి ధర్మాసనం ఆదేశాలు జారీచేసిందని.. భవిష్యత్తులో ఇలాంటి మెమోలు ఇవ్వరాదని స్పష్టంగా పేర్కొన్నప్పటికీ చాలా తెలివిగా హైకోర్టుకు సెలవులు ఉన్నప్పుడు మెమో జారీచేశారని ఆరోపించారు. ముందురోజు తేదీతో హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఇలా అక్రమంగా మెమోలు జారీచేయడం కోర్టు ఉత్తర్వులను అపహాస్యం చేయడం కిందకే వస్తుందని ఆరోపించారు. కోర్టుకు సెలవులు ఉన్నప్పుడు, వారాంతాల్లో మెమోలు ఇస్తున్న హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ప్రవర్తనను హైకోర్టు దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి)

బాధితుల గొంతుక



నేరాలు కేవలం పోలీసు రికార్డుల్లో సంఖ్యలుగా మిగిలిపోకూడదు, వాటి వెనుక ఉన్న కన్నీటి గాథలు, కుటుంబాల ఆవేదన బయటకు రావాలనే ఉద్దేశంతో తెలంగాణలోని యదార్థ సంఘటనల ఆధారంగా 'సైలెంట్ స్క్రీమ్స్' అనే క్రైమ్ సిరీస్‌ను రూపొందించినట్లు సన్ నెక్స్ట్ ఓటీటీ తెలిపింది. స్టార్ హీరోయిన్ శ్రుతీ హాసన్ వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ సిరీస్ తెలుగులో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సిరీస్‌కు శ్రుతీహాసన్ వాయిస్ బలంగా నిలుస్తుందని మేకర్స్ తెలిపారు. 'ఇలాంటి క్రైమ్ సిరీస్‌ను హోస్ట్ చేయడం శ్రుతీహాసన్‌కు ఇదే తొలిసారి. బాధితుల తరపున ఒక గొంతుకగా ఆమె ఈ కథలను ప్రేక్షకులకు వివరిస్తారు. గంభీరమైన గొంతుతో ఆమె కథనాన్ని నడిపించిన తీరు ప్రేక్షకులను ఆలోచింపజేస్తుంది, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను కేవలం వార్తలుగా గాకుండా, అరికట్టాల్సిన బాధ్యతగా గుర్తు చేసే ప్రయత్నం చేస్తున్నాం' అని మేకర్స్ చెప్పారు.



శ్రీసిటీలో శరవేగంగా పనులు జరుపుకుంటున్న ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ప్లాంట్ ఫొటో

ఏపీ అభివృద్ధిలో మరో మైలురాయి!

▸▸ శ్రీసిటీలో ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ప్లాంట్ పురోగతిపై లోకేశ్ స్పందన

అమరావతి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాలోని శ్రీసిటీలో ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ రూ.5,000 కోట్లతో చేపడుతున్న ప్రపంచస్థాయి ఉత్పత్తి కేంద్ర పురోగతిపై మంత్రి శనివారం ఎక్స్‌లో పోస్టు చేశారు. 2025 మేలో ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్‌కి భూములు కేటాయిస్తే కేవలం 7 నెలల కాలంలో పనుల్లో అద్భుతమైన పురోగతి కనిపిస్తోందని లోకేశ్ పేర్కొన్నారు. ఈమేరకు పనుల ఫొటోలను తన పోస్టుకు జత చేశారు. ఇక్కడ ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు తయారు చేయనున్నారని, ఏపీ తయారీ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఈ ఉత్పత్తి కేంద్రం ఉపయోగపడుతుందని అన్నారు. 2026 చివరి నాటికి ఉత్పత్తి ప్రారంభించాలన్న ప్రణాళికతో పనులు సాగుతున్నాయన్నారు. 2029 వరకు దశలవారీగా విస్తరణ కార్యక్రమాలు చేపడతారని తెలిపారు. ఇది ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి దిశగా మరో మైలురాయి అని లోకేశ్ అభివర్ణించారు.

అమరావతి పేరును ఉచ్చరించే అర్హత జగన్‌కు లేదు

▸▸ ఎట్రాక్షన్స్‌కు యువతులు దూరంగా ఉండాలి: మంత్రి అనిత

తాడేపల్లి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్‌కు రాజధాని అమరావతి పేరును ఉచ్చరించే అర్హత లేదని మంత్రి వంగలపూడి అనిత అన్నారు. శనివారం గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని కేఎల్‌యూకు విచ్చేసిన ఆమె విలేకరులతో మాట్లాడారు. రైతులు, మహిళలు అమరావతి రాజధాని కావాలని ఉద్యమాలు చేపడితే, న్యాయస్థానం నుంచి దేవస్థానంకు అంటూ టెంట్లు వేసుకుంటే... వారిని పోలీసులతో కొట్టించి, కేసులు పెట్టించి, టెంట్లు పీకేయించిన వ్యక్తి జగన్. ఉద్యమం చేస్తున్న అమరావతి రైతులను పరామర్శించేందుకు వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబు బస్సుపై రాళ్లు రువ్వించింది కూడా జగనే. అలాంటి జగన్‌కు అమరావతి పేరును పలికే అర్హత కూడా లేదు' అని అనిత స్పష్టం చేశారు. ఎట్రాక్షన్స్‌తో యువతులు తమ బంగారు భవిష్యత్తును పాడుచేసుకోవద్దన్న మంత్రి... డ్రగ్స్‌కు బానిసలైతే జీవితం నాశనమేనని చెప్పారు. తొలుత కేఎల్‌యూ సెట్ ఫలితాలను ఆమె విడుదల చేశారు. కార్యక్రమంలో కెఎల్‌ఈఎఫ్ కార్యదర్శి కోనేరు కాంచనలత, వీసీ సారథి వర్మ, డీన్ డాక్టర్ కిశోర్‌బాబు, అడ్మిషన్స్ డైరెక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీపై బెంగళూరులో కుట్ర: యనమల

అమరావతి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): బెంగళూరులో జగన్ మకాం వేయటంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు. శనివారం ఆయన ఈమేరకు ఓ ప్రకటన చేశారు. ఏపీలో కుట్రల అమలుకు జగన్ బెంగళూరులో బ్యాక్ ఆఫీస్ పెట్టారని ఆరోపించారు. తన అవినీతి కార్యకలాపాలకు బెంగళూరు ప్యాలెస్సునే కేంద్రంగా చేసుకున్నారని అన్నారు. పదే పదే బెంగళూరు వెళుతూ అక్కడే జగన్ మకాం వేయడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, జగన్ ఏపీలో దోచుకున్న తన అవినీతి సంపదను బెంగళూరు ప్యాలెస్సుకు తరలించారని అన్నారు. ఏడీఆర్ తాజా నివేదిక ప్రకారం జగన్ సహా పలువురు వైసీపీ కీలక నేతల ఆస్తులు ఉన్నట్టుండి 600% మేర పెరిగాయంటే వారి అవినీతి ఏపాటిదో అర్థం అవుతుందని యనమల అన్నారు.

ప్రజామోదం లేని వ్యక్తి సజ్జల: ఎమ్మెల్సీ నాయుడు

'సజ్జల రామకృష్ణా రెడ్డి.. వైసీపీలో హోదా లేని, ప్రజల్లో ఆమోదం లేని వ్యక్తి. కనీసం వార్డు మెంబర్ కూడా కానీ వ్యక్తి కూటమి ప్రభుత్వ విధానాలను విమర్శించడం సిగ్గుచేటు' అని ఎమ్మెల్సీ బీటీ నాయుడు విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'సొంత పార్టీలోనే తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటున్న సజ్జల ఏ హోదాలో రాజధానిపైన, సాగునీటి ప్రాజెక్టులపైన విమర్శలు చేస్తున్నారో చెప్పాలి. సజ్జల ఇచ్చిన సూచనల ఫలితంగానే వైసీపీ 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోయింది. టీడీపీ ఎప్పుడు అధికారంలో ఉన్నా సీమ సాగు ప్రాజెక్టులకు భారీగా నిధులు కేటాయిస్తూ వచ్చింది. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు పట్టించుకున్నదే లేదు' అని ఆవేదన వ్యక్తం చేశారు.

తిరుమల పవిత్రతపై వైసీపీ దాడి: వాసంశెట్టి

అమరావతి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): తిరుమలను లక్ష్యంగా చేసుకుని వైసీపీ ముష్కర మూక కూటమి ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తూ భక్తుల మనోభావాలతో చెలగాటమాడుతున్నారని మంత్రి వాసంశెట్టి సుభాశ్ ఆరోపించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు తిరుమలను వ్యాపార కేంద్రంగా మార్చేశారని విమర్శించారు. తిరుమలలో మద్యం బాటిళ్లు పెట్టి భక్తుల మనోభావాలను దెబ్బతీసేందుకు వైసీపీ మీడియా వ్యక్తులు, వారి నాయకులు కుట్రలకు తెరదీశారు.





టీడీపీ ప్రధాన కార్యాలయంలో శనివారం వృద్ధులు, దివ్యాంగుల నుంచి వినతులు స్వీకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

జగన్‌ది విద్వేషమే

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. లండన్, మాస్కో, మన దేశ రాజధాని ఢిల్లీ, కోల్‌కతా, వారణాశి, పట్నా, అహ్మదాబాద్, లఖ్‌నవ్ ఇలా పురాతనమైన, అభివృద్ధి చెందిన నగరాలన్నీ నదీ పరీవాహక ప్రాంతాల్లోనే ఉన్నాయన్నారు. ఇలాంటి అంశాలపై కనీస అవగాహన లేకుండా అమరావతిపై ద్వేషంతో జగన్ విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలు బుద్ధి చెప్పినా రాజధానిపై విషం చిమ్మడం మాత్రం ఆపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆలయాలనూ వదలకుండా కుట్రలు

"ఆలయాలను కూడా వదలకుండా వైసీపీ కుట్రలకు తెరతీస్తోంది. తిరుమల కొండపై వారి పార్టీ నేతలతో మద్యం బాటిళ్లను పెట్టించి కుట్ర పన్నారు. భూమనతో ప్రభుత్వంపై ఎదురుదాడి చేయించడం వైసీపీ కుట్రపూరిత రాజకీయాలకు పరాకాష్ఠ. స్వార్థ రాజకీయాల కోసం భక్తుల మనోభావాలతో, తిరుమల పవిత్రతతో ఆడుకుంటున్నారు. కల్తీ నెయ్యిలో వైసీపీ నేతల కుట్రలు బట్టబయలవుతున్న సందర్భంలో కొత్తగా మద్యం బాటిళ్లతో కొత్త కుట్రకు తెర దీశారు" అని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీసీకెమెరాలు, టెక్నాలజీ సాయంతో వైసీపీ కుట్రలు బయటపడుతున్నా ఆ పార్టీ మూకలు బరితెగించి వ్యవహరిస్తున్నాయని పలువురు నేతలు వ్యాఖ్యానించారు. అధికారంలో ఉన్నప్పటి నుంచి జగన్ తీరు హిందూ మతాన్ని నిర్వీర్యం చేసేలా ఉందని ఓ సీనియర్ నేత అభిప్రాయపడ్డారు. దేవాలయాలపై మహ్మద్ గజనీ వరుస దాడులు చేసినట్టు జగన్ కూడా హిందూ మతంపై దాడులు చేస్తూనే ఉన్నారని మరో సీనియర్ నేత వ్యాఖ్యానించారు. అధికారంలో ఉండగా దేవాలయాలపై దాడులను ప్రేరేపించడమే కాకుండా, ఆ దాడులపై వైసీపీ నేతలు చులకనగా మాట్లాడేవారని నేతలు అన్నారు. పరకామణి చోరీ కేసును జగన్ చిన్నపాటి దొంగతనంగా పేర్కొనడం కూడా హిందూమతంపై ఆయనకున్న చిన్నచూపును స్పష్టంచేస్తోందనిన్నారు. వైసీపీ చేస్తోంది రాజకీయ దాడి కాదని, హిందూ మతంపై దాడి అని, దీన్ని సీరియస్‌గా తీసుకోవాలని కొందరు నేతలు కోరారు. తిరుమల పవిత్రతను దెబ్బతీసేలా వ్యవహరిస్తే ఊరుకునేది లేదని, అలాంటి వారి విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని సీఎం స్పష్టం చేశారు. ఎవరు ఏ మతం ఆచరించినా ఇతర మతాలను గౌరవించాలని, ముఖ్యంగా కీలక స్థానాల్లో ఉన్న వ్యక్తులకు ఇది చాలా ముఖ్యమన్నారు. డిక్లరేషన్‌పై సంతకం పెట్టాల్సి వస్తుందని జగన్ తిరుమల దర్శనానికే రాలేదని సీఎం వ్యాఖ్యానించారు.

నాడు కమీషన్ల కోసమే రాయలసీమ లిఫ్టు

"పట్టిసీమ ద్వారా గోదావరి మిగులు జలాలను తరలించడంతో రాయలసీమకు కృష్ణా జలాలను అందివ్వగలిగాం. రాయలసీమ పట్ల టీడీపీకి ఉన్న చిత్తశుద్ధిని పట్టిసీమ ద్వారానే చాటుకున్నాం. ఆ ప్రాజెక్టు ఫలితంగానే రాయలసీమకు నీరు అంది.. అక్కడ ఉద్యాన రంగం అభివృద్ధి చెందింది. సీమ లిఫ్టు 2020లో వైసీపీ హయాంలోనే నిలిచిపోయింది. అప్పుడు ఏం మాట్లాడకుండా ఇప్పుడు స్వార్థరాజకీయాలు చేస్తున్నారంటే వారి చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమవుతుంది. నాటి వైసీపీ పాలకులు కమీషన్ల కోసం రాయలసీమ లిఫ్ట్ స్కీంలో కేవలం మట్టి పనులు చేసి రూ.900 కోట్లు బిల్లులు చేసుకున్నారు. టీడీపీకి రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం. నీటి విషయంలో రాజీ పడేది లేదు. వచ్చే రెండేళ్లలో రాష్ట్రంలో నీటి కొరత అనేది లేకుండా చేయడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం" అని చంద్రబాబు అన్నారు.

ఫేక్ ప్రచారాలను తిప్పికొట్టండి

నెలలో వారంరోజుల పాటు పట్టాదార్ పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు పాల్గొనాలని సీఎం సూచించారు. రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేసే దిశగా ప్రభుత్వం చేస్తున్న కృషిని ప్రజలకు వివరించాలని ఆదేశించారు. వైసీపీ చేసే ఆరోపణలకు, ఫేక్ ప్రచారాలకు గట్టిగా జవాబు ఇవ్వాలన్నారు. రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టు, భోగాపురం ఎయిర్‌పోర్టు వంటి అంశాలపై ఎమ్మెల్యేలు గట్టిగా జవాబు ఇచ్చారని సీఎం అభిప్రాయపడ్డారు.

గొడవలు వద్దు.. నీళ్లే ముఖ్యం

చర్చించుకుని నీటి సమస్యలను పరిష్కరించుకుందామన్న తెలంగాణ సీఎం రేవంత్ వ్యాఖ్యలపై నేతలతో చంద్రబాబు ప్రస్తావించారు. గొడవలు వద్దు.. నీళ్లు కావాలని తాను చాలాకాలం నుంచి చెబుతూనే ఉన్నానని అన్నారు. మీడియాతో చిట్‌చాట్‌లోనూ దీనిపై మాట్లాడారు. ప్రాజెక్టులు ప్రజల కోసమని, జగన్ కోసమో ఇంకొకరి కోసమో కాదని అన్నారు. కాళేశ్వరానికి లేని అభ్యంతరం నల్లమలసాగర్‌కు ఎందుకని, తెలుగు ప్రజల కోసం ఒకరికొకరం సహకరించుకోవాలని వ్యాఖ్యానించారు. నల్లమలసాగర్ పూర్తయితే శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలో నీటి లభ్యత పెరుగుతుందన్నారు. ఆ నీటిని తెలంగాణ కూడా వాడుకోవచ్చన్నారు. నీటి విషయంలో గొడవలకుపోతే నష్టపోయేది తెలుగు ప్రజలేనన్నారు. తెలుగు రాష్ట్రాలు బాగుండేలా చూడటం తప్పెలా అవుతుందని అన్నారు. మిగులు జలాల్ని సద్వినియోగం చేసుకుంటే రెండు తెలుగు రాష్ట్రాలు సుభిక్షంగా ఉంటాయని చంద్రబాబు అభిప్రాయపడ్డారు.

అమరావతిని ఎవరూ ఆపలేరు



రాజధాని అమరావతిని ఎవరూ ఆపలేరని ప్రపంచంలో బెస్ట్ సిటీ, మోడల్ సిటీగా అభివృద్ధి చెందుతుందని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. విజయవాడలోని సిద్ధార్థ అకాడమీ గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో సీఎం మాట్లాడారు. ప్రపంచం మెచ్చే అమరావతి నిర్మాణ వేగాన్ని చూసి కొందరు అసూయపడుతున్నారన్నారు. అమరావతిని ఆపేస్తామని అనుకుంటున్నారని, గత ఐదేళ్లలో ఆపినందుకు ఏమయ్యారో చూశారని వ్యాఖ్యానించారు. అమరావతిని ఎవరూ ఆపలేరని, మరో రెండేళ్లలో ఒక రూపు వస్తుందని చెప్పారు. విజయవాడ, గుంటూరు, మంగళగిరి, అమరావతి అన్నీ కలిసిపోయి బెస్ట్ లివబుల్ సిటీ, గ్లోబల్ సిటీగా తయారవుతుందన్నారు.



తనను ప్రభుత్వ సలహాదారుగా నియమించినందుకు కృతజ్ఞతలు చెప్పేందుకు సీఎం చంద్రబాబును కలిసిన మంతెన సత్యనారాయణ రాజు

సీఎంని కలసిన మంతెన

అమరావతి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైద్య విభాగానికి ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన మంతెన సత్యనారాయణ రాజు ముఖ్యమంత్రి చంద్రబాబును శనివారం కలిశారు. సీఎం క్యాంపు కార్యాలయంలో కలసిన మంతెన.. సలహాదారుగా తనకు అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మంతెనకు సీఎం శుభాకాంక్షలు చెప్పారు.

జీ రామ్ జీ తో ఆస్తుల సృష్టి

▸▸ 25 రోజులు అదనంగా ఉపాధి: చంద్రబాబు

▸▸ నీటి భద్రత, గ్రామాల్లో వసతులు: మంత్రి దుర్గేశ్

▸▸ అవినీతికి చెక్.. పేదలకు పని: బీజేపీ చీఫ్ మాధవ్

అమరావతి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): గ్రామీణ పేదలకు 25రోజుల పని అదనంగా కల్పించడంతో పాటు పల్లెల్లో శాశ్వత ఆస్తులు సృష్టించడమే లక్ష్యంగా కేంద్రం 'వికసిత్ భారత్ జీ రామ్ జీ' పథకాన్ని తీర్చిదిద్దిందని సీఎం చంద్రబాబు అన్నారు. ఈ పథకంపై అపోహలు తొలగించడంతో పాటు ఉపయోగాలపై రాష్ట్ర ప్రజలకు కూటమి తరపున వివరించే ప్రణాళికపై బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, జనసేన తరపున మంత్రి కందుల దుర్గేశ్ సీఎంతో క్యాంపు కార్యాలయంలో శనివారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. గతంతో పోలిస్తే కొత్త మార్గదర్శకాల ద్వారా పేదలకు 25రోజులు పాటు అదనంగా ఉపాధి లభిస్తుందని తెలిపారు. ఆస్తులు సృష్టించాలన్న పథకం లక్ష్యం నెరవేరాలన్నారు. మంత్రి దుర్గేశ్ మాట్లాడుతూ.. 2014-19మధ్య నరేగా నిధులతో సీఎం చంద్రబాబు గ్రామాల్లో ఆస్తులు సృష్టించారని, తాజా పథకం ద్వారా చెక్ డ్యామ్‌లు నిర్మించి నీటి భద్రత, ప్రజల అవసరాల కోసం మౌలిక వసతులు, గ్రామీణ పేదలకు జీవనోపాధి మరింత అధికంగా కల్పించవచ్చని తెలిపారు. జీ రామ్ జీలో బయోమెట్రిక్, జియో రెఫరెన్స్ అండ్ స్పేషియల్ టెక్నాలజీ పర్యవేక్షణ వల్ల అవినీతి ఆస్కారం ఉండబోదని బీజేపీ అధ్యక్షుడు మాధవ్ అన్నారు. సమావేశంలో పంచాయతీ రాజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.



హెరిటేజ్ ఫుడ్స్‌కు ఇండియన్ డెయిరీ అసోసియేషన్ ఇచ్చిన అవుట్ స్టాండింగ్ డెయిరీ ప్రొఫెషనల్ అవార్డు - 2025తో భువనేశ్వరి

భువనేశ్వరికి ఔట్ స్టాండింగ్ డెయిరీ ప్రొఫెషనల్ అవార్డు

▸▸ పాడి రైతుల సాధికారత, డెయిరీ ఎకో సిస్టం అభివృద్ధిపై కృషికి గుర్తింపు

▸▸ రైతుల సహకారం, హెరిటేజ్ బృందం కృషితోనే అవార్డు: భువనేశ్వరి

అమరావతి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): డెయిరీ రంగ అభివృద్ధికి విశేష సేవలు అందించినందుకుగాను హెరిటేజ్ ఫుడ్స్ వైస్ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ నారా భువనేశ్వరికి ప్రతిష్ఠాత్మక అవార్డు లభించింది. ఔట్‌స్టాండింగ్ డెయిరీ ప్రొఫెషనల్ అవార్డు - 2025ను భువనేశ్వరికి ఇండియన్ డెయిరీ అసోసియేషన్ ప్రదానం చేసింది. డెయిరీ పరిశ్రమ అభివృద్ధిలో ఆమె చూపిన చొరవ, దూరదృష్టి గల నాయకత్వం, రైతుల సాధికారతకు చేసిన విశేష కృషి, డెయిరీ ఎకోసిస్టంపై ఆమె కలిగించిన సానుకూల ప్రభావాన్ని గుర్తిస్తూ ఈ అవార్డు అందజేశారు. కేరళలోని కోజికోడ్‌లో కాలికట్ ట్రేడ్ సెంటర్, డాక్టర్ వర్గీస్ కురియన్ నగర్‌లో నిర్వహించిన సదరన్ డెయిరీ, ఫుడ్ కాన్‌క్లేవ్ - 2026 ప్రారంభ సమావేశంలో కేరళ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి జే.చించు రాణి చేతుల మీదుగా భువనేశ్వరి తరపున హెరిటేజ్ ఫుడ్స్ సంస్థ సీఈవో కేశవన్ ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ.. 'అవార్డు తీసుకోవడం సంతోషంగా ఉంది. ఇది హెరిటేజ్ ఫుడ్స్ బృందం చేసిన నిరంతర కృషికి, రైతులు, ఇతర భాగస్వాములతో ఉన్న బలమైన సంబంధాలకు లభించిన గుర్తింపు' అని పేర్కొన్నారు.

నిన్ను చూస్తే గర్వంగా ఉంది: సీఎం

తన సతీమణి భువనేశ్వరికి ఔట్ స్టాండింగ్ డెయిరీ ప్రొఫెషనల్ అవార్డు రావడంపై సీఎం చంద్రబాబు ఎక్స్ వేదికగా స్పందించారు. భువనేశ్వరిని చూస్తే గర్వంగా ఉందన్నారు. ఈ గౌరవం వెనుక ఏపీకి చెందిన వేలాది మంది పాడి రైతుల కృషి ఉదని, వారి అభ్యున్నతికి భువనేశ్వరి చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. మహిళా సాధికారతకు ఆమె ఆదర్శమన్నారు. మంత్రి లోకేశ్ స్పందిస్తూ... 'శుభాకాంక్షలు అమ్మా. జీవితమంతా పాడి రైతుల అభ్యున్నతికి, దేశ డైరీ ఎకోసిస్టమ్‌ని బలోపేతం చేయడానికి మీరు చేస్తున్న కృషిని చూసి నేను నిత్యం ప్రేరణ పొందుతూనే ఉన్నా. ఆ అవార్డుకు మీరు నిజమైన అర్హులు. కొడుకుగా గర్విస్తున్నా' అని పేర్కొన్నారు.



విజయవాడలో సిద్ధార్థ అకాడమీ గోల్డెన్ జూబ్లీ వేడుకలలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలతోనే నైపుణ్యాభివృద్ధి

▸▸ రాష్ట్రానికి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలను తీసుకొస్తున్నాం

▸▸ 'సిద్ధార్థ' 50 ఏళ్లు పూర్తిచేసుకోవడం హర్షణీయం: చంద్రబాబు

▸▸ సిద్ధార్థ అకాడమీ గోల్డెన్ జూబ్లీ వేడుకలకు హాజరు

విజయవాడ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలను తీసుకురావడం ద్వారా మన వద్దే నైపుణ్యాలు పెంచేలా కృషి చేస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్, టెక్నాలజీ ఎడ్యుకేషన్ 50 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా శనివారం విజయవాడలోని పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మైదానంలో నిర్వహించిన గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ విశ్వవిద్యాలయాల క్యాంపస్‌లను అమరావతిలో ఏర్పాటు చేయించాలని సంకల్పించామని సీఎం తెలిపారు. విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, విద్యారంగంలో పెను సంస్కరణలు తీసుకువస్తున్నామని సీఎం తెలిపారు. కిలోమీటరకు ఒక ఎలిమెంటరీ స్కూల్, మూడు కిలోమీర్లకు అప్పర్ ప్రైమరీ, ఐదు కిలోమీటర్లకు హైస్కూల్, ప్రతి మండలంలో జూనియర్ కాలేజీ, ప్రతి రెవెన్యూ డివిజన్‌లో ఇంజనీరింగ్ కాలేజీ, ప్రతి జిల్లాకు మెడికల్ కాలేజీ ఏర్పాటు చేశామన్నారు.

సిద్ధార్థ కృషి అభినందనీయం..

విజయవాడను విద్యలవాడగా మార్చడంలో సిద్ధార్థ సంస్థలు చేసిన కృషి అభినందనీయమన్నారు. లక్షల మంది విద్యార్థులను తీర్చిదిద్దిన ఘనత సిద్ధార్థ అకాడమీ సాధించిందని వివరించారు. నాడు ఈ అకాడమీ కోసం దాతలు చేసిన సహాయం నేడు రాష్ట్రంలోనే అత్యుత్తమంగా నిలిచిందని కొనియాడారు. 50 ఏళ్లు పూర్తిచేసుకోవడమంటే అకాడమీ నిర్మాణానికి కృషిచేసిన వారి ఐక్యతను తెలియజేస్తోందని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న సిద్ధార్థ అకాడమీకి అభినందనలు తెలిపారు. సిద్ధార్థ అకాడమీ నిర్మించిన కళాశాల భవనాలను యూనివర్సిటీగా తీర్చిదిద్దిన ఘనత ఎన్టీఆర్‌దన్నారు. సిద్ధార్థ అకాడమీ అగ్రికల్చర్ వర్సిటీని నిర్మించేందుకు నందిగామలో భూమి కావాలని ప్రభుత్వాన్ని కోరిందని, తప్పకుండా ప్రభుత్వం తరఫున సహకరిస్తామన్నారు. అమరావతి నిర్మాణం పూర్తయిన తర్వాత ప్రపంచంలోని తెలుగువారు, సిద్ధార్థలో విద్యనభ్యసించి స్థిరపడినవారు అమరావతికి రావాలని పిలుపునిచ్చారు.

నెలకోరోజు గ్రామాలకు వైద్యులు!

▸▸ పల్లెలు, గిరిజన ప్రాంతాల్లో స్పెషలిస్టుల కొరత

▸▸ నెలలో ఒకసారి అక్కడకు వెళ్లి సేవలందించాలి

▸▸ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచన



కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీలో జరిగిన సభలో ప్రసంగిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

కాకినాడ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వైద్యులు ఎంత బిజీగా ఉన్నా.. నెలకోసారి గ్రామాలు, గిరిజన ప్రాంతాలకు వెళ్లి వైద్య సేవలు అందించాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కోరారు. రాష్ట్రంలో అనేక గ్రామాలు, గిరిజన ప్రాంతాల్లో స్పెషలిస్టుల కొరత ఉందన్నారు. దీన్ని అధిగమించేందుకు వైద్యులు నెలలో ఒకసారి అక్కడకు వెళ్లి శిబిరాలు నిర్వహించి, వైద్య సేవలు అందించాలని పేర్కొన్నారు. కాకినాడ జిల్లాలోని కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీలో పూర్వ విద్యార్థులు రూ.10.11 కోట్లతో చేపట్టిన నూతన భవనాల నిర్మాణానికి పవన్ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్యులు పేద ప్రజలకు చికిత్సలు అందిస్తూ సమాజానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఇటీవల అరకులో పర్యటించినప్పుడు, అక్కడ గిరిజన మహిళలు సికిల్‌సెల్, అనీమియాతో బాధపడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. అందుకే అక్కడ తన వంతుగా, దాతల సహకారంతో బ్లడ్ బ్యాంక్ భవనం నిర్మిస్తున్నట్లు పవన్ తెలిపారు. రంగరాయ మెడికల్ కాలేజీలో ఎందరో పేరున్న వైద్య నిపుణులున్నారని, వీరంతా గ్రామీణులకు కూడా సేవలందించాలని కోరారు. ఇక్కడ చదువుకొన్న పూర్వ విద్యార్థులు మెడికల్ కాలేజీ కోసం నూతన భవనం నిర్మించడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. కొందరు ఇరుకు మనస్తత్వంతో వ్యవహరిస్తున్నారని, ప్రతి ఒక్కరూ విశాలంగా ఆలోచించాలని కోరారు.

మత చిచ్చుపెట్టే వారిని ఉపేక్షించొద్దు

మతాల మధ్య చిచ్చు పెట్టాలని చూసే శక్తుల పట్ల పోలీసులు అప్రమత్తంగా ఉండాలని పవన్ కల్యాణ్ పోలీసులకు సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో రాజీపడొద్దని, కఠినంగా వ్యవహరించాలన్నారు. రెండోరోజు కాకినాడ జిల్లా పర్యటనలో భాగంగా పవన్ జిల్లా పోలీసు కార్యాలయాన్ని సందర్శించారు. కమాండ్ కంట్రోల్‌రూం, పోలీస్ ఆఫీసర్ల జిమ్ తదితర విభాగాలను పరిశీలించారు. డయల్ 100 పనితీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించవద్దన్నారు. అంతకు ముందు గొల్లప్రోలులో సుద్దగడ్డ కాలువపై రూ.3.05 కోట్లతో నిర్మించిన బ్రిడ్జిని పరిశీలించారు.


48 గంటలు నిరంతరాయంగా..



రాజధాని అమరావతిలో నిర్మిస్తున్న ఐకానిక్ హైకోర్టు భవన సముదాయాల పనుల్లో భాగంగా 48గంటల పాటు నిర్విరామంగా జరగనున్న బ్లాక్-3 కాంక్రీట్ పనులను శనివారం సాయంత్రం పూజలు చేసి ప్రారంభిస్తున్న ఏపీసీఆర్‌డీఏ కమిషనర్ కె.కన్నబాబు, ఇంజనీర్ ఇన్ చీఫ్ ఆర్ గోపాలకృష్ణారెడ్డి, ఇతర అధికారులు



ప్రస్తుతం ఉన్న స్పిల్ వే



ప్రతిపాదిత స్పిల్ వే (పగటి వేళ)



ప్రతిపాదిత స్పిల్ వే (రాత్రి వేళ)

పోలవరం స్పిల్‌వేకు 'ద్రవిడియన్ తోరణాలు'!

▸▸ సీఎం చంద్రబాబుకు డిజైన్లు ప్రతిపాదించిన నిర్మాణ సంస్థ

▸▸ ఉగాదినాటికే ప్రాజెక్టు తొలిదశ పూర్తిచేసేందుకు అంగీకారం

అమరావతి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పోలవరం సాగునీటి ప్రాజెక్టు తొలిదశ అనుకున్న లక్ష్యానికి.. అంటే 2027 ఉగాది పర్వదినానికి ముందే ప్రారంభానికి సిద్ధం చేస్తున్నారు. ఈ నెల ఏడో తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటించిన విషయం తెలిసిందే. ఇక్కడి సమీక్ష సమావేశంలో 2027 జూన్ నాటికి పోలవరం తొలిదశ పూర్తి చేస్తామంటూ అధికారులు ఇచ్చిన లక్ష్యాన్ని మూడు నెలల ముందుకు కుదించారు. మార్చినాటికే ప్రాజెక్టు తొలిదశ పూర్తి చేయాలని నిర్మాణ సంస్థను సీఎం చంద్రబాబు ఆదేశించారు. దీనికి మేఘా ఇంజనీరింగ్ అధిపతి కృష్ణారెడ్డి ఆమోదించారు. ఇదే సమయంలో స్పిల్‌వేను కళాతోరణంతో అలంకరించాలన్న ప్రతిపాదనలతో కూడిన డిజైన్లను నిర్మాణ సంస్థ ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుంచింది. ద్రవిడయన్ సంస్కృతితో కూడిన డిజైన్లను ముఖ్యమంత్రికి చూపించింది. వీటిని అమరావతిలో కూర్చొని చర్చించి, ఖరారు చేద్దామంటూ ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

మా సమస్యలు పరిష్కరించండి

▸▸ సీఎంని కలసి విన్నవించిన పంచాయతీరాజ్ చాంబర్ ప్రతినిధులు

అమరావతి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీ చైర్మన్లకు గౌరవ వేతనాన్ని పెంచాలని, స్థానిక సంస్థలన్నింటికీ సకాలంలో ఎన్నికలు నిర్వహించేలా చూడాలని కోరుతూ సీఎం చంద్రబాబుకు ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ వినతి పత్రం సమర్పించింది.

అమెరికాలో సంతమాగులూరు యువకుడి అదృశ్యం


కారసాని హరీశ్‌రెడ్డి

సంతమాగులూరు(అద్దంకి), జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా సంతమాగులూరుకు చెందిన కారసాని హరీశ్ రెడ్డి అమెరికాలో అదృశ్యమయ్యారు. బంధువుల కథనం మేరకు.. హరీశ్ రెడ్డి మూడేళ్ల క్రితం అమెరికాలో ఉన్నత చదువుల కోసం వెళ్లారు. అక్కడే పార్ట్‌టైం ఉద్యోగం చేస్తున్నారు. సంతమాగులూరుకే చెందిన మరో ముగ్గురు యువకులతో కలసి టెక్సాస్‌లో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో అల్కాస్‌లోని డెనాలి ప్రాంతానికి ఒక్కడే విహారయాత్రకు వెళ్లాడు. డిసెంబరు 30నుంచి తల్లిదండ్రులకు, స్నేహితులకు ఫోన్ చేయ లేదు. ఫోన్ స్విచ్ఛాఫ్ అయింది. దీంతో స్నేహితులు అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసినట్టు తెలుస్తోంది. ఈ విషయ తెలిసి సంతమాగులూరులో ఉంటున్న తల్లిదండ్రులు, బంధువులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. హరీశ్‌రెడ్డి ఆచూకీ కోసం అక్కడ ఉన్న తెలుగు వారు ప్రయత్నిస్తున్నారు.

చర్చలతో జల వివాదాలను పరిష్కరించుకోవడమే మేలు

▸▸ రేవంత్‌రెడ్డి ప్రతిపాదనను స్వాగతించిన సీపీఐ

అమరావతి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): జల వివాదాలను రెండు రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సుహృద్భావ వాతావరణంలో చర్చించుకుని పరిష్కారం చేసుకుందామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రతిపాదనను సీపీఐ స్వాగతించింది. కోర్టులు, కేంద్రం వద్ద పంచాయతీ పెట్టకుండా రెండు రాష్ట్రాల సీఎంలు చర్చించుకుని వివాదాలను పరిష్కరించుకోవడం వల్ల ఇరు రాష్ట్రాలకూ మేలు జరుగుతుందని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ అభిప్రాయపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో ఒక్కటిగా కలిసి ఉన్న ఏపీ, తెలంగాణ రాష్ట్రాల అభివృద్ధి నదీ జలాలపై ఆధారపడి ఉందని ఆయన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కృష్ణా, గోదావరి నదుల్లో పుష్కలంగా ఉన్న జలాలను సద్వినియోగం చేసుకుంటూ రెండు తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి చెందాలని రామకృష్ణ ఆకాంక్షించారు.


ప్రథమ బహుమతి విజేత టి.నాగలక్ష్మికి చెక్కును అందజేస్తున్న రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక కమిషన్ చైర్‌పర్సన్ పొడపాటి తేజస్వి, 'ఆంధ్రజ్యోతి' అసిస్టెంట్ ఎడిటర్ టి.సురేశ్ కుమార్, న్యాయనిర్ణేతలు అబ్బూరి రత్నలక్ష్మి, కొండ్రెడ్డి రమాదేవి

రంగుల హరివిల్లు

ఆకట్టుకున్న 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గులు

▸▸ ఉల్లాసంగా.. ఉత్సాహంగా ఫైనల్స్ పోటీలు

▸▸ జ్యోతి వెలిగించి ప్రారంభించిన బొండా సుజాత

▸▸ ముఖ్యఅతిథిగా హాజరైన పొడపాటి తేజస్వి

▸▸ విజేతలకు బహుమతుల ప్రదానం

విజయవాడ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): "సంక్రాంతి తెలుగు సంప్రదాయాలకు అద్దం పట్టే పండగ. కష్టపడిన రైతులను, వారికి సహకరించిన పశువులను గౌరవించుకునే సంప్రదాయం తెలుగు వారిదే. చెట్టుకు మొక్కి, చీమకు చక్కెర, పాముకు పాలు పోసే సంస్కృతి మనదే!" అని రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక కమిషన్ చైర్‌పర్సన్ పొడపాటి తేజస్వి పేర్కొన్నారు. 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' సంస్థలు ప్రతి ఏటా ముగ్గుల పోటీలు నిర్వహిస్తూ తెలుగు వారి సంప్రదాయాలు, సంస్కృతిని పరిరక్షించేందుకు కృషి చేస్తున్నాయంటూ ప్రశంసించారు. ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ నిర్వహించిన 'సంతూర్ ముత్యాల ముగ్గు' (పవర్డ్ బై: సన్‌ఫీస్ట్ మ్యాజిక్ బిస్కెట్, టేస్ట్ పార్టనర్ స్వస్తిక్ మసాలా, ప్రేయర్ పార్టనర్ పరిమళ్ మందిర్ భారత్‌వాసి అగర్‌బత్తీ) ఫైనల్ పోటీలకు తేజస్వి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజేతలను అభినందించి బహుమతులు అందించారు. శనివారం విజయవాడలోని ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ కళాశాల ప్రాంగణంలో జరిగిన ఫైనల్ పోటీలలో రాష్ట్రంలోని 28 జిల్లాల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వారితోపాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి ఒక్కొక్కరు చొప్పున మొత్తం 30 మంది మహిళలు పాల్గొన్నారు. పోటాపోటీగా అందమైన రంగ వల్లులు తీర్చి దిద్దారు. అబ్బూరి రత్నలక్ష్మి, కొండ్రెడ్డి రమాదేవి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఒక్కో ముగ్గును నిశితంగా పరిశీలించి విజేతలను ఎంపిక చేశారు. బాపట్ల జిల్లాకు చెందిన టి.నాగలక్ష్మి ప్రథమ బహుమతిని సాధించారు. ఆమెకు రూ.30 వేల బహుమతిని అందజేశారు. కోనసీమ జిల్లాకు చెందిన మల్లేశ్వరి, చిత్తూరు జిల్లాకు చెందిన ఎ.సునీత, కర్నూలు జిల్లాకు చెందిన బి.వసంత, తమిళనాడుకు చెందిన కె.భార్గవి వేసిన ముగ్గులకు రెండో బహుమతి లభించింది. వారికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున అందజేశారు. మిగిలిన 25 మంది మహిళలకు కన్సొలేషన్ బహుమతిగా రూ.2 వేలు చొప్పున అందజేశారు. పోటీల్లో పాల్గొన్న వారందరికీ సంతూర్, సన్‌ఫీస్ట్, పరిమళ్ మందిర్ వారి గిఫ్ట్ హ్యాంపర్లు అందించారు. శనివారం ఉదయం ఈ పోటీలను ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు సతీమణి బొండా సుజాత జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ముగ్గులు మహిళల్లోని ప్రతిభకు ఒక నిదర్శనమన్నారు. ఆకాశంలో ఉన్న చుక్కలను భువికి తీసుకొచ్చి ఒక వరుస క్రమంలో అమర్చినట్టుగా ముత్యాల ముగ్గులు వేస్తారని, వాటికి రంగులు అద్దితే మరింత ఆకర్షణీయంగా ఉంటాయని తెలిపారు.


ప్రథమ బహుమతి అందుకున్న ముగ్గు


ద్వితీయ బహుమతి విజేతలు ఎ.సునీత బి.వసంత ఎం.మల్లేశ్వరి కె.భార్గవి


ముస్తాబైన ముగ్గులు

సంస్కృతిని చాటి చెప్పేలా...

ముగ్గుల పోటీ ఫైనల్స్‌లో వేసిన ముగ్గులు తెలుగు వారి సంప్రదాయాలకు అద్దం పట్టేలా ఉన్నాయని ముఖ్యఅతిథిగా హాజరైన తేజస్వి పేర్కొన్నారు. ఈ ముగ్గులను తిలకించేందుకు పాఠశాల విద్యార్థులను తీసుకురావాలని, దీనివల్ల సంస్కృతీ సంప్రదాయాలను నేటితరం పిల్లలు తెలుసుకునే అవకాశం ఉంటుందని సూచించారు. ఈ ఏడాది నిర్వహించిన ముగ్గుల పోటీలకు సంబంధించిన విశేషాలను 'ఆంధ్రజ్యోతి' అసిస్టెంట్ ఎడిటర్ టి.సురేశ్ కుమార్ వివరించారు. రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో మొత్తం 81 కేంద్రాల్లో పోటీలు నిర్వహించగా, 12 వేల మంది మహిళలు పాల్గొన్నారని తెలిపారు. అత్యధికంగా హిందూపురంలో 612 మంది, కనిగిరిలో 322 మంది మహిళలు పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ వేమూరి మురళి, ఆంధ్రజ్యోతి ఎడిటోరియల్, సర్క్యులేషన్, అడ్వర్టైజ్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాజెక్టులకు రూ.10,500 కోట్లు కేటాయించండి

▸▸ రాష్ట్ర ప్రభుత్వానికి ఆలోచనాపరుల వేదిక డిమాండ్

▸▸ వెలిగొండ పూర్తికాకుండానే జగన్ జాతికి అంకితమిచ్చేశారని ఆగ్రహం

అమరావతి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): వార్షిక బడ్జెట్(2026-27)లో సాగు నీటి ప్రాజెక్టులకు రూ.10,500 కోట్లు కేటాయించాలని రాష్ట్ర ఆలోచనాపరుల వేదిక డిమాండ్ చేసింది. వేదిక ప్రతినిధులు ఏబీ వెంకటేశ్వరరావు, అక్కినేని భవానీ ప్రసాద్, టి.లక్ష్మీనారాయణ, కంభంపాటి పాపారావు, నలమోతు చక్రవర్తి శనివారం విజయవాడలో మీడియా సమావేశంలో మాట్లాడారు. శ్రీశైలం కుడి బ్రాంచి కాలువకు రూ.400 కోట్లు, తెలుగుగంగకు రూ.500 కోట్లు, కేటాయించి నంద్యాల, కడప జిల్లాల పరిధిలోని నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరారు. తద్వారా రెండు ప్రాజెక్టుల కింద 4,65,000 ఎకరాల ఆయకట్టుకు పూర్తిగా సాగునీరందించాలన్నారు. వెలిగొండకు రూ.2500 కోట్లు, గాలేరు-నగరికి రూ.2500 కోట్లు, హంద్రీ-నీవాకు రూ.2500 కోట్లు, ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి రూ.2500 కోట్లు, చింతలపూడి ఎత్తిపోతల పథకానికి రూ.1000 కోట్లు, అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణానికి రూ.500 కోట్లు, బుడమేరు వరద నివారణ కోసం రూ.3000 కోట్లు, వినియోగంలో ఉన్న భారీ మధ్య, చిన్న తరహా ప్రాజెక్టులకు తగిన నిధులు కేటాయించాలని వేదిక కోరింది. వెలిగొండ ప్రాజెక్టుకు ఇంకో రూ.5000 కోట్లు ఖర్చు చేస్తేగాని పనులు పూర్తికావని, కానీ, ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నాడు ఈ పథకాన్ని అర్ధంతరంగా జాతికి అంకితం చేసేశారని వేదిక ఆగ్రహం వ్యక్తం చేసింది.

రూ.3,380 కోట్లతో రహదారుల అభివృద్ధి

▸▸ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

▸▸ జగన్ అధికారంలోకి వచ్చేదీలేదు.. చచ్చేదీలేదని వ్యాఖ్య

కాళ్ల, జనవరి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రస్తుతం రూ.3,380కోట్లతో రహదారి అభివృద్ధి పనులు జరుగుతున్నాయని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం ఆర్ అండ్ బీ వ్యవస్థను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ల మండలం కోపల్లె వద్ద బొండాడ డ్రెయిన్‌పై రూ.12కోట్లతో నాలుగు లైన్ల బ్రిడ్జి నిర్మాణానికి శనివారం డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజులతో కలిసి భూమి పూజ చేశారు. అంతకు ముందు డ్రెయిన్‌పై శిథిలావస్థకు చేరిన బ్రిడ్జిని మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జగన్ మళ్లీ అధికారంలోకి వచ్చేది లేదు చచ్చేదిలేదని వ్యాఖ్యానించారు.

ప్రభుత్వ శాఖల్లో 'నోడల్' విధానం!

అమరావతి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సౌకర్యార్థం ప్రభుత్వం కొత్తగా నోడల్ అధికారుల విధానాన్ని తెరపైకి తీసుకువచ్చింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల దగ్గర నుంచి అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేసే కిందస్థాయి ఉద్యోగి వరకూ అందరికీ మేలు జరిగేలా ఈ విధానాన్ని తీసుకువచ్చారు. ఒక ఉద్యోగికి తన ఉద్యోగంలో భాగంగా సమయనికి అనుగుణంగా ప్రభుత్వం నుంచి రావాల్సిన బెనిఫిట్స్ మొత్తం అందించడమే నోడల్ అధికారులు బాధ్యత. ప్రభుత్వ నిర్ణయం వల్ల ఉద్యోగుల సమస్యలకు దాదాపు పరిష్కారం దొరుకుతుంది. దీనిని అన్ని శాఖల్లో అమలు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

ముఖ్య జనాభా లెక్కల అధికారిగా కలెక్టర్

▸▸ జన గణన-2027కు అధికారుల నియామకం

అమరావతి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జన గణన-2027కు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. జిల్లాల్లో ముఖ్య జనాభా లెక్కల అధికారిగా కలెక్టర్లను నియమించింది. అదనపు జనాభా లెక్కల అధికారిగా జయింట్ కలెక్టర్ వ్యవహరిస్తారు. జిల్లా రెవెన్యూ అధికారిని జిల్లా జనాభా లెక్కల అధికారిగా నియమించడంతో పాటు జిల్లా ప్లానింగ్ అధికారి, జిల్లా విద్యాధికారి, పంచాయతీరాజ్ ఆఫీసర్, జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్, జిల్లా పరిషత్ సీఈవో, సర్వే అసిస్టెంట్ డైరెక్టర్లను జిల్లా అదనపు జనాభా లెక్కల అధికారులు ప్రభుత్వం నియమించింది. జిల్లా స్టాటిక్స్ ఆఫీసర్‌ను జిల్లా సంయుక్త జనాభా లెక్కల అధికారిగా వ్యవహరిస్తారు. అలానే సబ్ కలెక్టర్లు సబ్ డివిజన్ జనాభా లెక్కల అధికారిగా, మున్సిపాలిటీల్లో కమిషన్లు ముఖ్య జనాభా లెక్కల అధికారులు నియమిస్తున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

బాధాకర చరిత్రకు ప్రతీకారం తీర్చుకోవాలి

▸▸ యువతకు ఎన్ఎస్ఏ అజిత్ దోవల్ పిలుపు

న్యూఢిల్లీ, జనవరి 10: దాడులు, అణిచివేతలతో కూడిన బాధాకర చరిత్రకు ప్రతీకారంగా దేశాన్ని రక్షణ, ఆర్థిక పరంగానే కాకుండా అన్ని రంగాల్లో దృఢంగా మార్చాలని జాతీయ రక్షణ సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్ పిలుపునిచ్చారు. ఢిల్లీలో జరుగుతున్న వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. స్వాతంత్ర్య సమరయోధులు మహాత్మా గాంధీ, సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్ వంటి వారి త్యాగాలను ఉదహరిస్తూ ప్రసంగించారు. 81 ఏళ్ల తాను బ్రిటీష్ పాలన కాలంలో జన్మించానని, మన పూర్వీకులు ఎన్నో కష్టనష్టాలకోర్చి స్వాతంత్ర్య పోరాటం చేశారని చెప్పారు. 'ప్రతీకారం' అనే పదం మంచిది కాకపోయినా పెద్ద శక్తిగా మారగలదన్నారు. ఆనాడు జరిగిన తప్పులను సరిదిద్ది అన్ని రంగాల్లో దేశాన్ని మళ్లీ గొప్ప స్థానంలో నిలబెట్టాలన్నారు.

ఉల్టా.. పల్టా!

అమరావతిపై వైసీపీ తికమక

▸▸ ఇక్కడ కట్టొద్దంటూ జగన్ హూంకరింపు

▸▸ రివర్ బేసిన్ పేరుతో బెదిరింపు

▸▸ 48 గంటల్లోనే తెరపైకి వచ్చిన సజ్జల

▸▸ 'స్వాగతిస్తున్నాం' అని ప్రకటన

▸▸ రివర్ బేసిన్ మాటెత్తని వైనం

▸▸ అమరావతి రైతులపై 'ప్రేమ'

▸▸ ఖర్చు, అవినీతి అంటూ పాతకథలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఒకే పార్టీ... ఒకటే అంశం! కానీ... ఒకసారి 'జై' కొడతారు! అంతలోనే... 'నై' అంటారు! ఒకరొచ్చి 'నో' అంటారు! ఇంకొకరేమో 'ఎస్' చెబుతారు. గంటల్లోనే ప్లేటు తిరగేస్తారు! తూచ్... అలాకాదని తికమక పెడతారు! ఇది... 'రాజధాని అమరావతిపై' వైసీపీ వైఖరి. మొన్నటికి మొన్న... 'అమరావతిని రివర్ బేసిన్‌లో కడుతున్నారు. అలా కట్టేందుకు వీల్లేదు. ఈ విషయంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలి' అని ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. సరిగ్గా 48 గంటల్లో అదే పార్టీ కీలక నేత సజ్జల రామకృష్ణా రెడ్డి మీడియా ముందుకొచ్చి 'రాజధాని అమరావతిని వైసీపీ మనస్ఫూర్తిగా స్వాగతిస్తుంది. అమరావతిని మేము వ్యతిరేకించలేదు. చంద్రబాబు చేస్తున్న స్కామ్‌లనే ప్రశ్నిస్తున్నాం" అని చెప్పారు. అమరావతిపై జగన్ చేసిన వ్యాఖ్యలతో రాజకీయంగా తీవ్ర నష్టం జరుగుతోందని గ్రహించే... సజ్జల హఠాత్తుగా తెరపైకి వచ్చినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

ఒక్కోసారి ఒక్కో మాట

అమరావతిపై వైసీపీది ఆది నుంచీ మోసపూరితమైన వైఖరే! 'అమరావతిని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నాం' అని అసెంబ్లీ వేదికగా జగన్ చెప్పారు. తాము అధికారంలోకి వస్తే అమరావతిని కదిలించబోమని, జగన్ ఇక్కడ ఇల్లు కట్టుకోవడమే దీనికి నిదర్శనమని వైసీపీ నేతలు నమ్మబలికారు. కానీ... అధికారంలోకి రాగానే మూడు ముక్కలాటకు తెరలేపారు. విచిత్రమేమిటంటే... ఇప్పుడు ఇన్నేళ్ల తర్వాత సజ్జల కూడా ఇదే మాట చెప్పడం! "ఈ ప్రాంతంపై జగన్‌కు వ్యతిరేకత లేదు. పైగా అభిమానిస్తారు. ఆయన సీఎం కాకముందే ఇక్కడ ఇల్లు, కార్యాలయం కట్టడమే దీనికి నిదర్శనం' అని మరోసారి మభ్యపెట్టేలా మాట్లాడారు. రాజధానిని రివర్ బేసిన్‌లో కడుతున్నారని, ఇది సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు విరుద్ధమని జగన్ పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ విషయంలో సుప్రీంకోర్టు కూడా జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. కానీ... శనివారం మీడియాతో మాట్లాడిన సజ్జల 'రివర్ బేసిన్' ఊసే ఎత్తకపోవడం గమనార్హం. అంటే... జగన్ లేవనెత్తిన రివర్ బేసిన్ వాదన తప్పే అని పరోక్షంగా అంగీకరించినట్లేనా!? ఇక... అమరావతిలో నీళ్లు తోడిపోసేందుకు వందల కోట్లు ఖర్చు పెట్టారని ఆరోపించారు. జీఏడీ టవర్ల కోసం తవ్విన పునాదుల్లో నిలిచిన నీళ్లను తోడేందుకు కూటమి ప్రభుత్వం తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. దీనికి కారణమెవరు? అమరావతిలో నిర్మాణాలను వైసీపీ ఎక్కడికక్కడ వదిలేయడమే కదా!? 'అమరావతిని ఎప్పుడూ తక్కువగా చూడలేదు' అని కూడా సజ్జల చెప్పారు. తాము అధికారంలో ఉండగా వైసీపీ నేతలు అమరావతిని శ్మశానంతో పోల్చిన విషయాన్ని మరిచిపోయారు.

ఐదేళ్ల విధ్వంసం వదిలి...

సజ్జల తన ప్రెస్‌మీట్‌లో రాజధాని రైతులపై ప్రేమ కురిపించారు. వారి ప్లాట్లు అభివృద్ధి చేయలేదని, రోడ్లు వేయలేదని ఒకింత ఆవేదన ప్రదర్శించారు. అధికారంలో ఉన్న ఐదేళ్లూ రాజధాని రైతులకు వైసీపీ నరకం చూపించింది. కేసులుపెట్టింది. రోడ్లెక్కకుండా అడ్డుకుంది. అవమానించింది. అవన్నీ మరిచిపోయి... ఇప్పుడు రాజధానిలో ప్లాట్లను అభివృద్ధి చేయలేదని సజ్జల ఆరోపించడమే విచిత్రం. వైసీపీ హయాంలో అమరావతి అడవిని తలపించింది. రోడ్లను తవ్వేసుకుని, గ్రావెల్ ఎత్తుకుపోయారు. పైపులను దొంగిలించారు. అయినా నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు. పైగా... అరాచక శక్తులను ప్రోత్సహించింది. ఇప్పుడు... సజ్జల మీడియా ముందుకు వచ్చి 'మేం ఈ ప్రాంతాన్ని తక్కువ చేయలేదు' అని చెబితే నమ్మేదెలా? పదేళ్లు హైదరాబాద్‌లో ఉండే అవకాశమున్నా, చంద్రబాబు ఇక్కడికి వచ్చేశారంటూ సజ్జల పేర్కొన్నారు. రాష్ట్రం విడిపోయినా 'పరాయి' పంచనుంచే పాలన సాగాలన్న కోరికేమిటో మరి! ఉమ్మడి రాజధానిలోనే ఉండి ఉంటే... ఇక్కడ పదేళ్లు సహజంగా అభివృద్ధి జరిగేదని వింత వాదన చేశారు. పరిపాలనను స్వరాష్ట్రానికి తరలించుకుంటే అభివృద్ధి జరుగుతుంది కానీ... పక్క రాష్ట్రం నుంచి పాలిస్తే జరిగే అభివృద్ధి ఏమిటో ఆయనకే తెలియాలి. అమరావతి కోసం అన్ని కోట్లు, ఇన్ని కోట్లు ఖర్చు పెట్టేస్తున్నారన్నది సజ్జల ఆక్రోశం! జగన్ అధికారంలో వచ్చేనాటికి అమరావతిలో పది వేల కోట్లకు పైగా విలువైన పనులు జరిగాయి. అయినా అమరావతిని అటకెక్కించడం, ఆ నిర్మాణాలను ఎలా వాడుకుంటారో చెప్పకపోవడం ప్రజాధనాన్ని వృథా చేయడం కాదా అనే ప్రశ్నకు సజ్జల సమాధానమేమిటో! సచివాలయంతోపాటు హెచ్‌వోడీలు ఒకే చోట ఉండేలా నిర్మిస్తున్న జీఏడీ టవర్ల విస్తీర్ణంపైనా సజ్జల తనదైన లెక్కలు చెప్పారు.

అమరావతిని వైసీపీ స్వాగతిస్తుంది

▸▸ జగన్ ఎప్పుడూ అమరావతిని తక్కువ చేయలేదు: సజ్జల



అమరావతి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అమరావతిని వైసీపీ మనస్ఫూర్తిగా స్వాగతిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. తాము ఎప్పుడూ అమరావతిని తక్కువ చేయలేదని, విశాఖలో సీఎం కూర్చుంటే మరింత అభివృద్ధి చెందేందుకు వీలుందని మాత్రమే చెప్పామని అన్నారు. శనివారం తాడేపల్లి వైసీపీ కార్యాలయంలో సజ్జల మీడియాతో మాట్లాడారు. "జగన్ ఈ ప్రాంతానికి వ్యతిరేకం కాదు. పైగా అభిమానిస్తారు. ఈ ప్రాంతంలో భాగస్వామి అవుతారనేందుకు 2019కి ముందే ఇక్కడ ఇల్లు కట్టుకోవడం, పార్టీ ఆఫీసు నిర్మించడమే నిదర్శనం. చంద్రబాబు చెప్పినట్లుగా అమరావతి రాజధానిని జగన్ ఆమోదించి... ఇక్కడే ఉండాలనుకున్నారు. అమరావతిని ఎప్పుడూ తక్కువ చేసి చూడలేదు" అని సజ్జల పేర్కొన్నారు. ఇప్పుడు ప్రతిపక్షంగా ఒక ప్రశ్న లేవనెత్తామని, దీనికి సమాధానం చెప్పకుండా విరుచుకుపడుతున్నారని విమర్శించారు. "అమరావతిలో అన్యాయం జరుగుతుంటే ప్రశ్నించడంలో తప్పేముంది? బాబు చేస్తున్న స్కామ్‌లనే ప్రశ్నిస్తున్నాం. జగన్ ఇల్లు ఉన్న ఏరియా, అమరావతి ఒక్కటే అయినా... అమరావతిలో నీళ్లతోడటానికి వేల కోట్లు ఎందుకు ఖర్చు చేస్తున్నారు?' అని ప్రశ్నించారు.

వైసీపీ దృష్టిలో రాజధాని ఎక్కడో చెప్పాలి

▸▸ పారదర్శకంగా అమరావతిలో టెండర్లు: మంత్రి నారాయణ



అమరావతి, తాడేపల్లి టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాజధానిగా అమరావతి ఒక్కటేనని కూటమి ప్రభుత్వానికి క్లారిటీ ఉందని.. మరి వైసీపీ కోరే రాజధాని ఏదో ఆ పార్టీ నేతలు స్పష్టంగా చెప్పాలని మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ డిమాండ్ చేశారు. శనివారం ఉండవల్లి సీఎం క్యాంప్ ఆఫీస్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అమరావతిపై వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు. అమరావతిపై పూటకోలా విష ప్రచారం చేయడం వైసీపీకి తగదన్నారు. 'రివర్ బేసిన్‌కు, రివర్‌బెడ్‌కు తేడా లేకుండా అమరావతిపై జగన్ మాట్లాడారని, మళ్లీ సజ్జల కూడా అదే మాట్లాడుతున్నారని మండిపడ్డారు. 'రాష్ట్ర విభజన తర్వాత అమరావతి రాజధానికి వైసీపీ ఒప్పుకుంది. కానీ అధికారంలోకి వచ్చాక జగన్ మూడుముక్కలాట ఆడారు. మొత్తం సర్వనాశనం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులంతా ఎంతో ఆనందంగా ఉన్నారు' అని తెలిపారు. ప్రజలు ఇబ్బంది పడకూడదనే సీఎం చంద్రబాబు దూరదృష్టితో.. అన్ని కార్యాలయాలూ ఒకేచోట ఉండేలా సచివాలయాన్ని డిజైన్ చేశారని తెలిపారు. అమరావతిలో అన్ని టెండర్లు పారదర్శకంగా పూర్తి చేసి పనులు చేపడుతున్నామని, అమరావతిని ఆపడం సాధ్యం కాదని తెలిసి ఇష్టానుసారం మాట్లాడుతున్నారని మంత్రి అన్నారు.

ఆరిన మంటలు

అదుపులోకి కోనసీమ బ్లోఔట్.. ప్రివెంటర్ ఏర్పాటుతో కథ సుఖాంతం

▸▸ ఆరు రోజుల్లో ఆపరేషన్ పూర్తి

▸▸ నిర్విరామంగా పనిచేసిన ఓఎన్జీసీ నిపుణులు

▸▸ కేరింతలతో ఫైర్ ఫైటర్స్ సంబరాలు

▸▸ ఊపిరిపీల్చుకున్న స్థానిక ప్రజలు

▸▸ ఇదో గణనీయమైన విజయం: ఓఎన్జీసీ

▸▸ రిగ్ దగ్ధంతో రూ. కోట్లలో ఆస్తి నష్టం

▸▸ పంట నష్టం లెక్కల్లో అధికారులు

అమలాపురం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ ముందు కోనసీమ ప్రజలను ఆందోళనకు గురిచేసిన బ్లో ఔట్ శనివారం మధ్యాహ్నానికి పూర్తిగా అదుపులోకి వచ్చింది. ఓఎన్జీసీ నిపుణులు మంటలను ఆర్పి వేసి, గ్యాస్ లీకేజీని పూర్తిగా అరికట్టారు. రికార్డు టైంలో మంటలను నిలువరించామని, బ్లోఔట్ నియంత్రణల విషయంలో ఇదో గణనీయమైన విజయమని ఓఎన్జీసీ ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈనెల 5న డా. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం ఇరుసుమండ గ్రామంలో ఓఎన్జీసీ మోరి-5 బావిలో బ్లోఔట్‌తో భారీగా మంటలు ఎగిసి పడిన విషయం తెలిసిందే. ఈ బావిలో డీప్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ సంస్థ వర్క్ ఓవర్ రిగ్‌తో 2.7 కి.మీ. లోతులో డ్రిల్లింగ్ చేస్తుండగా భారీ విస్ఫోటంతో తొలుత గ్యాస్ బయటకు వచ్చి మంచు మాదిరిగా పరిసర ప్రాంతాలను కప్పివేసింది. గంట వ్యవధిలోనే మంటలు అంటుకున్నాయి. అగ్నికీలలు వంద మీటర్లకు పైబడి ఎగసిపడ్డాయి. దాంతో పరిసర గ్రామాల ప్రజలు భయకంపితులై ప్రాణాలు అరచేత పట్టుకుని ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమై సుమారు 500 మందికి పునరావాస చర్యలు చేపట్టింది.

మంటలు అదుపులోకి ఇలా..

బ్లోఔట్ విషయం తెలిసిన వెంటనే ఓఎన్జీసీ సీనియర్ మేనేజ్మెంట్ డైరెక్టర్ విక్రమ్ సక్సేనా, ఢిల్లీకి చెందిన క్రైసిస్ మేనేజ్మెంట్ నిపుణుల బృందం ఘటనా స్థలానికి చేరుకుంది. బ్లోఅవుట్ నియంత్రణకు వారు ప్రణాళికలు రచించారు. ముందుగా బ్లోఅవుట్ బావి వద్దకు ఒక ప్రత్యేక రోడ్డును నిర్మించారు. మంటలకు దగ్ధమైన రిగ్ శకలాలను మూడు రోజుల్లో తొలగించారు. వెల్ మౌత్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వాటర్ అంబ్రెల్లాలతో నిరంతరాయంగా నీటిని వెదజల్లుతూ శనివారం ఉదయం 10.30 గంటల సమయంలో బ్లోఅవుట్ మంటలను పూర్తిగా నిరోధించారు. మధ్యాహ్నం బ్లోఔట్ ప్రివెంటర్‌ను (బీవోపీ) వెల్ మౌత్ వద్ద అమర్చడంతో మంటలు, గ్యాస్ పూర్తిస్థాయిలో అదుపులోకి వచ్చాయి. బ్లోఔట్ నియంత్రణ ఆపరేషన్ విజయవంతంగా కావడంతో ఓఎన్జీసీ నిపుణుల ఆనందానికి అవధుల్లేవు. విక్టరీ సంకేతాలు చూపుతూ, కేరింతలతో సంబరాలు చేసుకున్నారు. వారం రోజుల్లో మంటలను అదుపు చేస్తామని కలెక్టర్ ఆర్.మహేశ్ కుమార్, ఎంపీ గంటి హరీశ్ బాలయోగి సమక్షంలో వెల్లడించిన నిపుణులు ఒకరోజు ముందుగానే ఈప్రక్రియను ముగించడంతో పరిసర గ్రామాల ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. భవిష్యతో ఇక్కడ కార్యక్రమాలు నిర్వహించబోమని ఓఎన్జీసీ తన ప్రకటనలో వెల్లడించింది. భద్రతకు, పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేసింది.


ఇరుసుమండలో బ్లోఔట్ మంటలు అదుపులోకి వచ్చిన తరువాత వెల్ మౌత్ వద్ద బ్లోఔట్ ప్రివెంటర్‌ను అమరుస్తున్న దృశ్యాలు

భారీగా ఆస్తి నష్టం.!

బ్లోఔట్ వల్ల సుమారు 3 లక్షల క్యూబిక్ మీటర్ల మేర గ్యాస్ నిక్షేపాలు దగ్ధమయ్యాయి. రూ.కోట్ల విలువైన రిగ్ కాలిపోయింది. మంటల్లో కాలిపోయిన కొబ్బరిచెట్లు, పంట నష్టాలను ప్రాథమికంగా అంచనా వేసిన అధికారులు, ఆదివారం స్థానికులతో సమావేశం అనంతరం తుది లెక్కలు వేసి పరిహారం అందించనున్నారు. బ్లోఔట్ అదుపునకు నిరంతరాయంగా శ్రమించిన కలెక్టర్ మహేష్‌కుమార్, ఎంపీ హరీష్, ఎమ్మెల్యే వరప్రసాద్‌ల కృషిని, ఏవిధమైన ప్రాణాపాయం లేకుండా మంటలను అదుపు చేసిన నిపుణులను స్థానికులు ప్రశంసించారు.

పల్లెకు పోదాం.. చలో..!

హైదరాబాద్ నుంచి ఏపీకి సంక్రాంతి ప్రయాణాలు.. కిటకిటలాడుతున్న జాతీయ రహదారులు

- కంచికచర్ల వద్ద గంటల తరబడి ట్రాఫిక్ జామ్
- చిల్లకల్లు, కీసర టోల్‌ప్లాజాల దగ్గర వాహనాల బారులు
- విజయవాడ వద్ద పశ్చిమ బైపాస్ మీదుగా మళ్లింపు
- కిటకిటలాడుతున్న ఆర్టీసీ బస్సులు, రైళ్లు



కంచికచర్ల వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తికాకపోవడంతో పెరిగిన రద్దీ



విజయవాడ బస్‌స్టాండ్‌లో వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు భారీగా తరలివచ్చిన ప్రయాణికులు

విజయవాడ/ఏలూరు క్రైం/పెదపాడు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణ నుంచి ఏపీకి సంక్రాంతి ప్రయాణాలు ఊపందుకున్నాయి. పండుగకు వారం రోజులకు పైగా సెలవులు రావడంతో హైదరాబాద్ నుంచి వేలాది కార్లు విజయవాడకు క్యూ కట్టాయి. కోస్తా జిల్లాలతో పాటు ఉభయ గోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాలకు వచ్చేవారితో జాతీయ రహదారులు కిటకిటలాడుతున్నాయి. చిల్లకల్లు, కీసర టోల్‌గేట్ల దగ్గర తీవ్ర రద్దీ నెలకొంది. శనివారం తెల్లవారుజాము నుంచే రికార్డు స్థాయిలో వాహనాలు రావడం మొదలైంది. ట్రాఫిక్ ప్రభావం విజయవాడపై పడింది. వాహనాలను మధ్యాహ్నం నుంచి పశ్చిమ బైపాస్‌కు మళ్లించడంతో రద్దీ తగ్గింది. మరోవైపు, ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల వైపు హైదరాబాద్-విజయవాడ ఎన్‌హెచ్-65పై ఫ్లైవోవర్ నిర్మాణం పూర్తికాకపోవడం, సర్వీసు రోడ్డు మీదుగానే ప్రయాణాలు సాగించాల్సి రావడంతో వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయాయి. జాతీయ రహదారిపై అనాసాగరం దాటి మునగచెర్ల వరకు 4 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. ట్రాఫిక్ పోలీసులు పరిస్థితిని నియంత్రిస్తున్నారు. ఇక విజయవాడ నుంచి ఏలూరు మీదుగా వెళ్లే రహదారులన్నీ వాహనాలతో నిండిపోయాయి. కలపర్రు టోల్‌గేట్ వద్ద వాహనాల శ్రేణులు బారులు తీరడంతో పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. నాచుకుంట టోల్‌గేట్ వద్ద కూడా భారీగా ట్రాఫిక్ జామ్ అయింది.

బస్సులు, రైళ్లు ఫుల్

హైదరాబాద్ నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సులన్నీ కిటకిటలాడుతున్నాయి. ఏపీఎస్ఆర్టీసీ హైదరాబాద్ నుంచి నడిపే 110 షెడ్యూల్ బస్సులు నిండిపోగా, శుక్రవారం అదనంగా 25 స్పెషల్స్ నడిపింది. శుక్రవారం తెలంగాణ ఆర్టీసీకి చెందిన షెడ్యూల్ బస్సులు 200 కాకుండా మరో 50 స్పెషల్స్ పంపారు. ఇక శనివారం 100కు పైగా ప్రత్యేక బస్సులు నడిపారు. సొంతూళ్లకు వచ్చే వారికోసం ఎన్టీఆర్ జిల్లా రీజియన్ అధికారులు 526 స్పెషల్ బస్సులు నడుపుతున్నారు. హైదరాబాద్ నుంచి విజయవాడ, విశాఖ వైపు వెళ్లే రైళ్లన్నీ అసాధారణ స్థాయిలో కిక్కిరిసి ప్రయాణిస్తున్నాయి. ఇవికాకుండా 16 స్పెషల్ రైళ్లు కూడా కిటకిటలాడుతున్నాయి. రద్దీని దృష్టిలో ఉంచుకుని విజయవాడ- హైదరాబాద్‌ల మధ్య శనివారం నుంచి మరో రెండు స్పెషల్ రైళ్లను రైల్వే శాఖ ప్రకటించింది. వీటిని ఈ నెల 19 వరకు నడపనున్నారు.

కోడి పందేలను అడ్డుకోండి

- జంతుహింస, జూదనిరోధక చట్టాలను కఠినంగా అమలు చేయండి
- జిల్లా కలెక్టర్లు, ఎస్పీలకు హైకోర్టు ఆదేశం

అమరావతి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా జరిగే కోడిపందేలను అడ్డుకోవాలని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు జిల్లాల కలెక్టర్లను హైకోర్టు ఆదేశించింది. జంతుహింస నిరోధక చట్టం-1960, ఏపీ జూద నిరోధక చట్టాలను కఠినంగా అమలు చేయాలని, గతంలో ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. గ్రామాల్లో సభలు నిర్వహించి చట్టనిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొంది. బరుల వద్ద కోడి కత్తులు, ఇతర పందెం సామగ్రి, సొమ్ములను తక్షణం స్వాధీనం చేసుకోవాలని స్పష్టం చేసింది. అవసరమైతే 144 సెక్షన్ అధికారాన్ని వినియోగించాలని సూచించింది. చట్ట నిబంధనలు ఉల్లంఘించేవారిపై కఠిన చర్యలు తీసుకొనేందుకు పోలీసులకు స్వేచ్ఛ ఇచ్చింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ఇటీవల ఉత్తర్వులు ఇచ్చారు. సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి కాళ్లకు కత్తులు కట్టి పందేలు నిర్వహించడం ద్వారా జీవహింసకు పాల్పడుతున్నారని, పందేలను అడ్డుకోవాలని, అక్రమ మద్యం, జూదం వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలు నిలువరించాలని కోరుతూ హైకోర్టులో 14 పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై న్యాయమూర్తి విచారణ సందర్భంగా పిటిషనర్లు వాదనలు వినిపిస్తూ.. గతంలో ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. హోంశాఖ తరపున ప్రభుత్వ న్యాయవాది ఎ.జయంతి వాదనలు వినిపిస్తూ.. చట్టవ్యతిరేక కార్యక్రమాలపై ప్రజలను చైతన్యపరిచేలా పోలీసులు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వివరించారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. గతంలో ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని కలెక్టర్లు, జిల్లా ఎస్పీలను ఆదేశించారు.

హైదరాబాద్ శివారుల్లో

పందెం కోళ్లు

- ఫామ్‌హౌజ్‌లు, కన్వన్షన్ సెంటర్‌లలో.. సంక్రాంతి సంబరాలకు ఏర్పాట్లు
- పార్టీలు, పేకాట స్థావరాలకూ కసరత్తు

హైదరాబాద్ సిటీ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి వచ్చిందంటే చాలు.. హైదరాబాద్ నగరం సగానికి పైగా ఖాళీ అవుతుంది. కొంతమంది హైదరాబాద్‌లోనూ సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. నగర శివారు ప్రాంతాలైన కీసర, హయత్‌నగర్, మహేశ్వరం, మొయినాబాద్ తదితర ప్రాంతాల్లో పందెం కోళ్లను పెంచుతున్నారు. బెట్టింగ్ రాయుళ్లు ఏపీలోని సంబరాలకు ఏ మాత్రం తీసిపోకుండా కోళ్ల పందాలు, పేకాట శిభిరాలు, డ్యాన్స్‌లు, రేవుపార్టీల వంటివి నిర్వహించి ఎంజాయ్ చేస్తున్నారు. జనసమ్మర్థం ఉన్న ప్రాంతాల్లో కాకుండా, రహస్యంగా నగర శివారుల్లోని ఫామ్‌హౌజ్‌లు, ప్రైవేట్ కన్వెన్షన్ సెంటర్లు, వ్యవసాయ క్షేత్రాల్లో ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇటీవల మొయినాబాద్ పరిధిలోని ఫామ్‌హౌజ్‌లలో పందెం కోళ్లతో బెట్టింగ్ నిర్వహిస్తున్న వారిని సైబరాబాద్ పోలీసులు పట్టుకున్నారు. ఆ తర్వాత పట్టుకున్న కోళ్లను రాజేంద్రనగర్ కోర్టులో వేలం వేయగా ఒక్కో కోడి రూ.2300 పలికింది. కొంతమంది నిర్వాహకులు శివారు ప్రాంతాల్లోని ఫామ్‌హౌజ్‌లను అడ్డాగా చేసుకొని సంక్రాంతి పార్టీలు, పేకాట స్థావరాలు నిర్వహించడానికి సిద్ధమవుతున్నారు. వాట్సాప్ గ్రూపుల ద్వారా స్నేహితులను, పేకాట రాయుల్లను ఆహ్వానిస్తారు. కొంతమంది నిర్వాహకులు ఆహుతుల కోరిక మేరకు కోళ్ల పందాలను సైతం నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. నగర శివారుల్లో పందెం కోళ్ల సంస్కృతి పెరిగిపోతుండటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఫామ్‌హౌజ్‌లు, వ్యవసాయ క్షేత్రాలు, కన్వెన్షన్ సెంటర్లపై పోలీసులు ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao**,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: **N.Rahul Kumar** Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. **Managing Director : Vemuri Radha Krishna**. Founder: K.L.N.Prasad.